

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 177

శనివారం 16-9-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మేనిఫెస్టోలో చెప్పకపోయినా కాపు సామాజిక వర్గాలకు మరింత మంచి జరగాలన్న తపన, తాపత్రయంతో...

వరుసగా నాలుగో ఏడాది..

వైఎస్సార్ కాపు నేస్తం

రాష్ట్ర వ్యాప్తంగా కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన అర్హులైన
3,57,844 మంది పేద అక్కచెల్లెమ్మలకు రూ. **536.77** కోట్ల ఆర్థిక సాయాన్ని
నేడే తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో బటన్ నొక్కి
నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్న
గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

"వైఎస్సార్ కాపు నేస్తం"ద్వారా **45** నుండి **60** ఏళ్లలోపు ఉన్న కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన పేద అక్కచెల్లెమ్మలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, వారికి మంచి జరగాలన్న తపనతో.. ఏటా రూ. **15,000** చొప్పున **5 ఏళ్లలో మొత్తం** రూ.**75,000** ఆర్థిక సాయం అందిస్తున్న జగనన్న ప్రభుత్వం..

నేడు అందిస్తున్న రూ. **536.77** కోట్లతో కలిపి జగనన్న ప్రభుత్వం ఇప్పటివరకు అర్హులైన పేద కాపు అక్కచెల్లెమ్మలకు కేవలం "వైఎస్సార్ కాపు నేస్తం" ద్వారా అందించిన మొత్తం ఆర్థిక సాయం రూ. **2,029** కోట్లు.. ఒక్కో పేద కాపు అక్కచెల్లెమ్మకు నాలుగేళ్ళ కాలంలో అందించిన లబ్ధి అక్షరాలా రూ. **60,000..**

గత ప్రభుత్వ హయాంలో

కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు వివిధ రూపాల్లో 5 ఏళ్లలో సగటున ఏడాదికి కనీసం **రూ. 400 కోట్లు** కూడా ఇవ్వని దుస్థితి..

కానీ, మన జగనన్న ప్రభుత్వం 52 నెలల్లోనే

వివిధ పథకాల ద్వారా **77,00,628** మంది కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల లబ్ధిదారులకు అనేక రెట్లు అధికంగా మొత్తం రూ. **39,247** కోట్ల (DBT + Non DBT) లబ్ధి చేకూర్చింది..

తేడా గమనించండి..

కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల సంక్షేమం కోసం వివిధ పథకాల ద్వారా అందించిన లబ్ధి...

కాపుల సంక్షేమానికి మనందరి జగనన్న ప్రభుత్వం ఈ 52 నెలల పాలనలో..			కాపు కులాలకు గత ప్రభుత్వ 5 ఏళ్ల పాలనలో..
పథకం పేరు	లబ్ధిదారులు	లబ్ధి (రూ. కోట్లలో)	
DBT (Direct Benefit Transfer)			
వైఎస్సార్ ఆసరా	7,16,734	2,083	మాఫీ చేస్తామని చెప్పి ఎగ్గొట్టడంతో మహిళా సంఘాల నిర్వీర్యం..
జగనన్న అమ్మ ఒడి	4,04,583	2,248	లేదు
జగనన్న చేదోడు	18,019	52	లేదు
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	4,33,909	655	అశాస్త్రీయంగా పంట నష్టాల అంచనా.. అయినవారికే పరిహారం..
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	2,11,178	191	అలస్యంగా ఏళ్ళతరబడి పెండింగ్‌తో.. అదీ కొందరికే సాయం..
జగనన్న తోడు (వడ్డీ)	1,79,686	7	చిరు వ్యాపారులను ఆదుకునే పథకమే లేదు.. రుణాలే లేవు, ఇక వడ్డీ చెల్లింపుల ఊసే లేదు..
జగనన్న వసతి దీవెన	2,08,064	387	ఇచ్చినవే అరకొర ఫీజులు.. అవీ ఏళ్ల తరబడి పెండింగులు..
జగనన్న విద్యా దీవెన	2,29,030	1,192	
వైఎస్సార్ కాపు నేస్తం	3,57,844	2,029	లేదు
వైఎస్సార్ మత్స్యకార భరోసా	1,335	2	చాలీచాలని సాయం.. అదీ బకాయిలు పెడుతూ
వైఎస్సార్ నేతన్న నేస్తం	2,577	35	లేదు
వైఎస్సార్ పెన్షన్ కానుక	7,19,845	7,734	కోటాలు, కోతలతో వీలైనంతమందికి ఎగ్గొడుతూ.. తమవారికే సాయం..
వైఎస్సార్ రైతు భరోసా	7,85,700	4,383	లేదు
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	5,52,662	105	ఎప్పుడైనా ఇచ్చే అరకొర సాయం..
వైఎస్సార్ సున్నా వడ్డీ (SHGs)	8,77,589	437	2016-17కే స్కీముకు స్వస్తి.. అప్పటికి ఇచ్చింది అతి స్వల్పం.. అప్పుల్లో డ్వాక్రా సంఘాలు..
వైఎస్సార్ వాహన మిత్ర	29,957	84	లేదు
డా॥ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	28,638	45	లేదు
డా॥ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	1,33,925	465	అరకొర సాయం.. అదీ ఆసుపత్రులకు బకాయిలు పెడుతూ.. అతి తక్కువ ప్రొసీజర్లకే వర్తింపు
వైఎస్సార్ బీమా	8,151	143	అస్మదీయులకే లబ్ధి
జగనన్న విదేశీ విద్యా దీవెన	51	14	ఇచ్చిందే అరకొర, అదీ కొందరికే..! ఎంపిక ప్రక్రియలో అవినీతి, సిఫార్సులకే పెద్దపీట..
అగ్రిగోల్డ్	24,617	21	ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా లక్షలాది మందిని గాలికి వదిలేసిన వైనం..
తెల్ల రేషన్ కార్డుదార్లకు ప్రత్యేక కోవిడ్ సాయం	2,12,101	21	వర్తించదు
DBT మొత్తం	61,36,195	22,333	
Non - DBT			
జగనన్న తోడు (రుణాలు)	1,79,686	361	చిరు వ్యాపారులను ఆదుకునే పథకమే లేదు
జగనన్న గోరు ముద్ద	4,02,076	376	నాసిరకం ఆహారం.. ఉడికీ ఉడకని అన్నం, రుచీపచీ లేని కూరలు.. బకాయిలు
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	1,50,800	229	నామమాత్రంగా పౌష్టికాహారం.. అదీ కొందరికే పరిమితం
జగనన్న విద్యా కానుక	4,05,450	203	అరకొరగా కొద్దిమందికే.. అదీ బడులు తెరిచిన 6-7 నెలలకు..
వైఎస్సార్ - జగనన్న ఇళ్ల పట్టాలు (ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఇళ్ళు)	2,46,080 ఒక్కో ఇంటి స్థలం విలువ కనీసం రూ.5 లక్షలు	12,304	లేదు
8వ తరగతి చదువుతున్న పిల్లలకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల పంపిణీ	45,105	60	లేదు
హౌసింగ్	1,35,236	3,381	అతికొద్ది మందికే..
Non - DBT మొత్తం	15,64,433	16,914	
మొత్తం (DBT + Non - DBT)	77,00,628	39,247	

కాపుల సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పింది..

కాపు సంక్షేమం

గత ప్రభుత్వం కాపు రిజర్వేషన్ల విషయంలో మోసం చేయడమే కాకుండా, సంవత్సరానికి రూ. 1,000 కోట్ల చొప్పున 5 సంవత్సరాలలో రూ.5,000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి ఈ 5 సంవత్సరాలలో కేవలం రూ. 1,340 కోట్లు కేటాయించిన నేపథ్యంలో, మేము ప్రభుత్వంలోకి వచ్చాక కాపు కార్పొరేషన్‌కు సం॥రానికి రూ. 2,000 కోట్లు చొప్పున 5 సంవత్సరాలకు కలిపి రూ. 10,000 కోట్లు కేటాయిస్తాం, ఖర్చు చేస్తాం..

..అని మేనిఫెస్టోలో ఇచ్చిన మాట కన్నా మిన్నగా కాపుల సంక్షేమం కోసం ఇప్పటివరకు కేవలం నాలుగేళ్లలో రూ. 39,247 కోట్ల లబ్ధి చేకూర్చాం..

- ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా కాపుల బలోపేతం కోసం విశేష కృషి.. సామాజిక సమతుల్యత పాటిస్తూ కాపులకు ఒక డిప్యూటీ సి.ఎం తో సహా ఏకంగా 4 మంత్రి పదవులు కేటాయింపు..
- అన్ని నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో కాపు వర్గాలకు తగు ప్రాధాన్యత..





శ్రీ. అడపా శేషగిరి, ఛైర్మన్, కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్

గమనిక: "వైఎస్సార్ కాపు నేస్తం" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి 16 సెప్టెంబర్ 2023 నాడు ఉదయం 11 గంటలకు తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో ఆర్థికసాయాన్ని జమ చేస్తారు.. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్ల లైవ్ లో వీక్షించవచ్చు...

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



క్రోచెట్ టోపీలతో పిల్లలు



పంచడానికి సిద్ధంగా ఉన్న పాంచోస్

250 మంది... ఒకే ఆలోచన...

250 మంది మహిళలు ఆరు నెలల్లో 2,719 క్రొచెట్ పాంచోలు తయారుచేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ నెలకొల్పారు. ఈ పాంచోలను గిరిజన పిల్లలకు ఉచితంగా పంచిపెడుతున్నారు. విశాఖపట్నం వేదికగా వీరందరూ ఒక తాటి మీదకు వచ్చి చేసిన ఈ ప్రయత్నం ఎంతో మందిని ఆకట్టుకుంటోంది. మహిళా మనోవికాసం పేరుతో క్రొచెట్ గ్రూప్‌ను ప్రారంభించిన మాధవి సూరిభట్ల, డెబ్బై ఏళ్ల వయసులోనూ చురుగ్గా పాల్గొన్న రాఘవమ్మ, టీమ్‌లీడర్‌గా ఫణి శిరీష, తనూజలు ఈ సందర్భంగా ఈ రికార్డు సాధనపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

– నిర్మలారెడ్డి

కొత్త ప్రపంచం



కుటుంబ జీవనంలోనే ఏళ్లు గడిచిపోయాయి. 70 ఏళ్ల వయసులో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఎంబ్రాయిడరీ, క్రొచెట్ అల్లిక చిన్నప్పటి నుంచీ అలవాటు. మహిళా గ్రూప్‌లో చేరి నాలుగేళ్లు అవుతోంది. వచ్చిన పనిని నలుగురితో షేర్ చేసుకోవడం, తెలియంది తెలుసుకోవడం చేస్తుంటాను. ఇంటి దగ్గర రోజూ కొంత సమయం ఎంబ్రాయిడరీకి కేటాయిస్తుంటాను. ఈ గ్రూప్ ద్వారా ఈవెంట్‌లో పాల్గొని చాలామంది మహిళలతో పరిచయాలు పెంచుకోగలిగాను. ఒక కొత్త ప్రపంచాన్ని చూస్తున్నట్టుగా, చాలా ఆనందంగా అనిపించింది.

– డి.వి.రాఘవమ్మ, విజయవాడ

గ్రూప్‌కి లీడర్‌ని



మా పిల్లలతో కలిసి స్వచ్ఛంద కార్యక్రమాలలో పాల్గొంటుంటాను. మూడేళ్ల క్రితం మహిళా మనోవికాస్‌లో జాయిన్ అయ్యాను. 25 మంది ఉన్న గ్రూప్‌కి లీడర్‌గా ఉన్నాను. ఇలా మొత్తం తొమ్మిది టీమ్స్ ఉన్నాయి. ఒక్కో టీమ్‌లో 25 నుంచి 35 వరకు ఉంటారు. నెల రోజులు ఆన్‌లైన్‌లో క్రొచెట్ కోర్సు నేర్చుకున్నాను. కింద టేడాది గ్రూప్ అంతా దాదాపు 4,686 క్రొచెట్ టోపీలు అల్లి, ఈవెంట్ చేశాం. ఆ టోపీలను చలి ఎక్కువ ఉండే గిరిజన ప్రాంతాల పిల్లలకు అందజేశాం. ఈసారి పాంచోస్‌ను కూడా అదేవిధంగా పంపిణీ చేస్తున్నాం. రెండుసార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకోవడం ఆనందంగా ఉంది.

– ఫణి శిరీష, హైదరాబాద్

ఆన్‌లైన్ క్లాసుల నుంచి మొదలు...



ప్రైవేట్ కంపెనీలో హెచ్‌ఆర్ ఉద్యోగం చేసే నేను పిల్లలు సెటిలయ్యాక మానేశాను. ఇంటి వద్ద ఉంటూ నా హాబీస్ పైన దృష్టి పెట్టాను. అన్నిరకాల హ్యాండ్‌క్రాఫ్ట్స్ చేయగలను. అందులో భాగంగానే నా క్రాఫ్ట్ వర్క్ నలుగురికీ తెలియజేద్దామని ఎఫ్‌బీలో మధురం క్రాఫ్ట్స్ అండ్ క్రియేషన్స్ పేరుతో పోస్ట్ చేసే దాన్ని. కొంతమంది తమకు క్లాసులు చెప్పమన్నారు. దీంతో కోవిడ్ టైమ్‌లో గ్రూప్ స్టార్ట్ చేసి, ఆన్‌లైన్ క్లాసులు చెబుతూ వచ్చాను. విదేశాలలోనూ నా స్టూడెంట్స్ ఉన్నారు. చెన్నై గ్రూప్‌తో 3 సార్లు క్రొచెట్ గిన్నిస్ రికార్డ్‌లో పాల్గొన్నాను. నా వ్యక్తిగతంగానే ఏడుసార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించాను. వైజాగ్‌లోనూ ఈవెంట్ చేయాలనే ఆలోచనతో మహిళా మనోవికాస్ పేరుతో గ్రూప్ ప్రారంభించాను. ఆన్‌లైన్‌లో మహిళలకు క్రొచెట్ క్లాసులు తీసుకునేదాన్ని. ఒకరి ఆలోచనను ఇంకొకరు పంచుకుంటూ క్రొచెట్ అల్లికలు చేసి, వాటిని పేదవారికి పంచాలనేది ఆలోచన. దేశ విదేశాల నుంచి ఒకరి ద్వారా మరికొందరు పరిచయం అవుతూ ఆన్‌లైన్‌లో ఒక తాటిమీదకు వచ్చారు. కిందటేడాది క్రొచెట్ టోపీలు తయారుచేశాం. ఇప్పుడు పాంచోస్ తయారుచేశాం. పెళ్లి అయిన తర్వాత గృహిణులుగా ఉన్నవారు తమ జీవితంలో ఎలాంటి అచీవ్‌మెంట్ లేదు అనుకునేవారికి ఇదో మంచి బూస్టింగ్ అయ్యింది. మా గ్రూప్‌లో క్యాన్సర్ పేషెంట్స్ కూడా ఉన్నారు. కీమో తీసుకుంటూ కూడా ఈ అల్లికలు చేశారు. ఈవెంట్‌కు అటెండ్ అవ్వాలనుకునేవారు 150 మెంబర్స్ వచ్చారు. ఆరేళ్ల పాప నుంచి 80 ఏళ్ల వయసు వారు ఈ ప్రోగ్రామ్‌లో పాల్గొన్నారు. అందరికీ ఇది ఒక స్ట్రెస్ బస్టర్ అని చెప్పవచ్చు.

– మాధవి సూరిభట్ల, విశాఖపట్నం

మా పిల్లలకూ నేర్పిస్తున్నాను..



డెలివరీ టైమ్‌లో ఖాళీగా ఉండటంతో ఆన్‌లైన్‌లో క్రొచెట్ బేసిక్స్ నేర్చుకున్నాను. ఆర్డర్స్ మీద అమీగ్రూమీ స్టఫ్డ్ టాయ్స్ కూడా చేయడం నేర్చుకున్నాను. మా పిల్లలకు కూడా నేర్పిస్తున్నాను. ప్రతి ఒక్కరూ పది పాంచోస్ చేస్తే చాలు అనుకున్నాను. నేను 25 పాంచోస్ చేసిచ్చాను. ఇప్పుడు చాలా మంది అడుగుతున్నారు ఎలా అచీవ్‌మెంట్ వస్తుంది అని. కొంతమంది 'మాకు నేర్పిస్తారా, మేం ఎలా ఇందులో పాల్గొనాలి..' అని అడుగుతున్నారు. ట్రైబల్ పిల్లలకు వాటిని అందజేశారు.

– తనూజ, నంద్యాల

న్యూస్‌మేకర్

'పూజారి గారూ... అర్చన చెయ్యండి' అనే మాట ప్రతి గుడిలో వినపడేదే. కాని తమిళనాడులో ఒక మార్పు జరిగింది. పూజారులుగా స్త్రీలు నియమితులయ్యే ప్రయత్నం మొదలయ్యింది. 'పూజారమ్మా... అర్చన చెయ్యి' అనే ఇకపై మాట వినపడనుంది. రమ్య, కృష్ణవేణి, రంజిత అనే ముగ్గురు మహిళలు అర్చకత్వం కోర్సును ముగించి త్వరలో పూజారులుగా నియమితం కానున్నారు.

ఆమె ఇకపై గుడి పూజారి



రమ్య, కృష్ణవేణి, రంజిత

'మహిళలు పైలెట్లుగా, వ్యోమగాములుగా దిగంతాలను ఏలుతున్నప్పుడు దేవుని అర్చనను ఎందుకు చేయకూడదు' అనే ప్రశ్న తమిళనాడు ప్రభుత్వం లేవనెత్తింది. అంతేకాదు దానికి సమాధానం కూడా వెతికింది. జవాబును ప్రజల ముందుకు తెచ్చింది. గతంలో ఛాందస దృష్టితో బహిష్టు కారణాన స్త్రీలను 'అపవిత్రం' అని తలచి గర్భగుడి ప్రవేశానికి, అర్చనకు దూరంగా ఉంచేవారు. గ్రామదేవతల అర్చనలో స్త్రీలు చాలా కాలంగా ఉన్నా ఆగమశాస్త్రాలను అనుసరించే దేవాలయాలలో స్త్రీలు అర్చకత్వానికి నిషిద్ధం చేయబడ్డారు. ఇప్పుడు ఆ విధానంలో మార్పును తెచ్చింది తమిళనాడు ప్రభుత్వం. మహిళా అర్చకులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వనుంది. అందులో భాగంగా ముగ్గురు మహిళలు ఒక సంవత్సరం కోర్సును ముగించి సహాయక అర్చకులుగా శిక్షణ పొందనున్నారు. ఒక సంవత్సరంపాటు ఆలయాల్లో శిక్షణ పొందాక ప్రధాన అర్చకులు కానున్నారు.

అందరూ యోగ్యులే

డి.ఎం.కె నేత కరుణానిధి 2007లో అర్చకత్వానికి అన్ని కులాల వాళ్లు యోగ్యులే అనే సమానత్వ దృష్టితో తమిళనాడులో ఆరు అర్చక ట్రైనింగ్ స్కూళ్లను తెరిచారు. అయితే ఆ కార్యక్రమం అంత సజావుగా సాగలేదు. ఇప్పుడు స్టాలిన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని కులాల వాళ్లు అర్చకత్వం కోర్సు చేసి పూజారులుగా నియమితులు కావచ్చన్న విధానాన్ని ప్రోత్సహించింది. దాంతో గత సంవత్సరం నుంచి చాలామంది ఈ కోర్సుల్లో చేరుతున్నారు. అయితే తిరుచిరాపల్లిలోని అర్చక ట్రైనింగ్ స్కూల్‌లో ముగ్గురు మహిళలు ఈ కోర్సులో చేరడంతో కొత్తశకం మొదలైనట్టయ్యింది. రమ్య, కృష్ణవేణి, రంజిత అనే ముగ్గురు మహిళలు ఒక సంవత్సరం కోర్సులోని థియరీని విజయవంతంగా పూర్తి చేసి ప్రభుత్వ హిందూ ధార్మిక మంత్రిత్వ శాఖ నుంచి తాజాగా సర్టిఫికెట్లు పొందారు. ప్రాక్టికల్స్‌లో భాగంగా ఒక సంవత్సరం పాటు వివిధ ఆలయాల్లో సహాయక అర్చకులుగా పని చేసి తదుపరి అర్చకులుగా నియమితులవుతారు. కోర్సు చదివిన కాలంలో వీరికి 3000 రూపాయల స్టయిపెండ్ లభించింది.

దేవుడు కూడా బిడ్డడే

'దేవుడు కూడా చంటిబిడ్డలాంటివాడే. గర్భగుడిలో దేవుణ్ణి అతి జాగ్రత్తగా ధూపదీపాలతో, నైవేద్యాలతో చూసుకోవాలి. స్త్రీలుగా మాకు అది చేతనవును' అంది రమ్య. కడలూరుకు చెందిన ఈ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ ఉద్యోగం మాని మరీ అర్చకత్వం కోర్సులో చేరింది. మరో మహిళ కృష్ణవేణి ఇంటర్ వరకూ చదివి ఈ కోర్సు చేసింది. మూడో మహిళ రంజిత బి.ఎస్సీ చదివింది. 'మా బ్యాచ్‌లో మొత్తం 22 మంది ఉంటే మేము ముగ్గురమే మహిళలం. కాని గత నెలలో మొదలైన కొత్తబ్యాచ్‌లో 17 మంది అమ్మాయిలు చేరారు. రాబోయే రోజుల్లో ఎంతమంది రానున్నారో ఊహించండి' అంది రమ్య.

తమిళనాడులో మొదలైన ఈ మార్పును మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తాయో లేదో ఇప్పటికైతే సమాచారం లేదు. కాని స్త్రీలు దైవాన్ని కొలిచేందుకు ముందుకు వస్తే ఇకపై వారిని ఆపడం అంత సులువు కాకపోవచ్చు.

కిచెన్ టిప్స్



- కాయగూరలు తరిగే చెక్కని నిమ్మచెక్కతో రుద్ది కాసేపయ్యాక కడిగేయండి. మరకలు పోతాయి. ఎప్పుడైనా దానిపై మాంసం కోసినా.. నిమ్మచెక్కతో రుద్దాలి. క్రిములు వృద్ధి చెందకుండా ఉంటాయి
- నిమ్మచెక్కలని సన్నగా తరిగి కాసిని నీళ్లలో వేసి ఆ పాత్రని మైక్రో ఓవెన్‌లో కొన్ని నిమిషాలు ఉంచి తీసేయండి. అలా చేస్తే దుర్వాసనలు తొలగిపోవడంతో పాటూ లోపల పడి ఉన్న పదార్థాలని శుభ్రం చేయడం కూడా తేలికవుతుంది.
- ఫ్రిజ్‌లో ఓ మూలగా నిమ్మచెక్కని పెట్టి చూడండి. అందులోంచి వచ్చే దుర్వాసనలు పోతాయి.
- స్టీలు కుళాయిలపై నీటిమరకలు పడుతుంటాయి. అవి తెల్లగా మారాలంటే వాటిని నిమ్మచెక్కతో రుద్ది కడిగితే చాలు.

సోషల్ మీడియా సాక్షిగా... సాయంగా

కూటికోసం కోటివిద్యలు అంటారు. ఈ విద్యే... ఎవరూ చూసే వారు లేక అనాథలా మారి, పదిమంది దగ్గర యాచిస్తూ కడుపు నింపుకొంటోన్న మెర్లిన్‌కు భోజన, వసతి సదుపాయాలు కల్పించి ఆదుకుంటోంది. ఎంతోమందికి మెర్లిన్ నేర్పిన విద్యాబుద్ధులే 81 ఏళ్ల వయసులో నిస్సహాయస్థితిలో ఉన్న ఆమెని ఆదుకుంటూ... అండగా నిలబడ్డాయి.



మెర్లిన్‌తో మొహమ్మద్ ఆషిక్

బర్మాకు చెందిన మెర్లిన్ భారతీయ వ్యక్తిని పెళ్లి చేసుకుని చెన్నైలో స్థిరపడిపోయింది. ఇంగ్లీష్, లెక్కలు, తమిళం బోధిస్తూ, భర్తతో సంతోషంగా ఉండేది. సంవత్సరాలు గడిచే కొద్దీ తనవారిని ఒక్కొక్కరిగా పోగొట్టుకుంటూ ఒంటరిదైపోయింది. తినడానికి తిండిలేక, ఉండడానికి చోటులేక ఫుట్‌పాతే అన్నీ అయ్యి బతుకుతోంది. చెన్నై రోడ్లమీద తిరుగుతూ భిక్షమెత్తుకుని పొట్టనింపుకుంటోంది.

దుస్తులు కొనివ్వండి బాబూ...

ఒకరోజు 'ఏబ్రోకాలేజ్‌కిడ్' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా సోషల్ సర్వీస్ చేస్తోన్న మొహమ్మద్ ఆషిక్ కంటపడింది మెర్లిన్. ఆమెను చూడగానే ఆమె మొదటినుంచి యాచకవృత్తిలో ఉన్న ఆమె కాదని గ్రహించాడు ఆషిక్. వెంటనే "ఎక్కడినుంచి వచ్చావు అమ్మా? నీకు ఎవరూ లేరా? వయసులో ఉన్నప్పుడు ఏం చేసేదానివి..." వంటి ప్రశ్నలు వేస్తూ మెర్లిన్ గురించిన వివరాలు తెలుసుకున్నాడు ఆషిక్. "భిక్షం అడిగి కడుపు నింపుకుంటున్నాను. కొన్ని రోజులు ఆహారం దొరుకుతుంది. మరికొన్ని రోజులు ఏమీ దొరకదు... నీళ్లు తాగి పడుకుంటాను. దేవుడు ఎంతవరకు ఇస్తే అంతే బాబు" అని మెర్లిన్ చెప్పింది. "నీకు ఏం కావాలమ్మా?" అని ఆషిక్ అడిగినప్పుడు...

"నా దుస్తులు చిరిగిపోయాయి. వీలయితే అవి కొనివ్వు బాబు... అది చాలు" అంది.



యాచించ కూడదనీ...

మెర్లిన్ పరిస్థితి చూసి చలించిపోయిన ఆషిక్ మెర్లిన్‌కు చీర కొనిచ్చాడు. తరువాత..."అమ్మ నువ్వు ఇంగ్లీష్ క్లాసులు చెప్పు. వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తాను. ఒక్కో వీడియోకు డబ్బులు ఇస్తాను అని చెప్పాడు". మెర్లిన్ ఇంగ్లీష్ క్లాసులు చెప్పడానికి ఒప్పుకోవడంతో ఆమె చెప్పే పాఠాలు వీడియోలు తీసి 'ఇంగ్లీష్ విత్ మెర్లిన్' పేరుమీద ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేసి పోస్టు చేస్తున్నాడు. ఒక్కో వీడియోకు డబ్బులు ఇస్తూ మెర్లిన్ ఎవరి దగ్గరా చేయి చాచకుండా... తన కష్టార్జితంతో బతికేలా ఏర్పాట్లుచేశాడు ఆషిక్.

తన విద్యార్థులసాయంతో...



ఆషిక్ పోస్టు చేసిన మెర్లిన్ వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. వాటిని చూసిన వారిలో కొంత మంది మెర్లిన్ దగ్గర చదువుకున్న విద్యార్థులు ఉన్నారు. తమ టీచర్ పరిస్థితి ఇంత దారుణంగా ఉందా అని బాధపడుతూ మెర్లిన్‌ను వెతుక్కుంటూ వచ్చారు. దగ్గర కూర్చుని, ఫలానా వాళ్లమని పరిచయం చేసుకుని, అప్పుడు ఇలా చేశాం, అలా చేశాం, మీరు ఇలా ఉండేవారంటూ మాట్లాడి ఆమెలో ఉత్సాహం నింపారు. కొంతమంది ఆమెతో వీడియో కాల్ చేసి మాట్లాడారు. అంతా కలిసి మెర్లిన్‌కు కష్టం కలగకుండా ఉండేందుకు, నలుగురి మధ్యలో ఉండేలా వృద్ధాశ్రమంలో చేర్చారు. అక్కడ ఆమెకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం మెర్లిన్ ఎనభై ఏళ్ల వయసులో ఇంగ్లీష్ క్లాసులు చెబుతూ ఐదు లక్షలకు పైగా ఫాలోవర్స్‌తో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

మనం చేసే మంచి ఎప్పటికైనా ఏదో ఒక రూపంలో తిరిగి వస్తుందనడానికి మెర్లిన్ జీవితమే ఉదాహరణగా నిలుస్తోంది.

సందర్భం

పోరాడి గెలిచింది

ఆమె 'టైమ్' ఇప్పుడు బాగుంది



నందితా వెంకటేషన్ నృత్య, సంగీత ప్రేమికురాలు. పాదం కదలాలంటే పదం వినిపించాల్సిందే. నాట్యంలో మంచి పేరు తెచ్చుకుంటున్న రోజుల్లో క్షయ బారిన పడింది. మందులు వాడి వాడి శరీరం గుల్ల అయింది. బాగయ్యాక కొన్ని రోజులకు ఆమె వినికిడి శక్తిని కోల్పోయింది. అలా అని ఆమె నాట్యం ఆపలేదు. ఆ నాట్యమే తన బలం అయింది. తక్కువ ధరలకు క్షయవ్యాధిగ్రస్తులకు మందులు దొరికేలా దక్షిణ ఆఫ్రికాకు చెందిన ఫుమెజా టిసిలీతో కలిసి కృషి చేసి విజయం సాధించింది నందిత. టైమ్స్ మ్యాగజీన్ 2023 (100–ఎమర్జింగ్ లీడర్స్) జాబితాలో నందితా వెంకటేశన్‌కు చోటు లభించింది....

'క్షయ వ్యాధి నా పాత స్నేహితురాలు' అని సరదాగా చెబుతుంది ముంబైలో పుట్టి పెరిగిన నందితా వెంకటేశన్. డిగ్రీ కాలేజీలో చేరిన సంతోషంలో ఒకవైపు స్నేహితులంతా తలమునకలై ఉండగా, నందిత మాత్రం టీబీతో పోరాడుతోంది. పద్నాలుగు నెలల పాటు చికిత్స తీసుకోవాల్సి వచ్చింది.

కొంతకాలానికి...

పరిస్థితిలో మార్పు రాకపోగా మరింత జటిలం అయింది. భరించలేని కడుపు నొప్పి, బరువు తగ్గడం మొదలైంది.

వైద్యుల సూచన మేరకు సర్జరీ కోసం ఆస్పత్రిలో పదిరోజులు ఉంది. డిశ్చార్జి తరువాత పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. దీంతో పెద్ద మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్‌లో చేర్పించారు.

'చికిత్సలో భాగంగా రోజుకు పది నుంచి పదిహేను మాత్రల వరకు వేసుకోవాల్సి వచ్చేది. వాంతులు అయ్యేవి. డిప్రెషన్‌కు గురయ్యేదాన్ని. టీబీ కంటే నరకమే నయం అనిపించేది' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది నందిత.

పీక్కుపోయిన ముఖంతో, రాలిపోయిన తల వెంట్రుకలతో తనను తాను అద్దంలో చూసుకోవాలన్నా భయపడేది నందిత. ఇలా భయపడుతూ, బాధపడుతూ ఉంటే వైద్యుల చికిత్స ఎలాంటి ఫలితం ఇవ్వదని తనకు తెలుసు. ముందు మనోధైర్యం తెచ్చుకోవాలి. మానసికంగా ఉల్లాసంగా ఉండాలి అనుకుంది. తనకు కావల్సిన శక్తులు సంగీతంలో దొరికాయి. రెండు నెలల తరువాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయింది. 22 కిలోల బరువు తగ్గింది.

మందులు వాడీ వాడీ శరీరం చచ్చుబడినట్లుగా అనిపించింది. అయితే ఇంటికి వచ్చిన సంతోషం ఆ బాధని దూరం చేసింది. అయితే ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. నెలరోజుల తరువాత వినికిడి శక్తి కోల్పోయింది. ఎంత పెద్ద శబ్దమైనా వినిపించేది కాదు.

వినికిడి శక్తి కోల్పోయినా తనకు ఇష్టమైన నృత్యంపై ప్రేమను మాత్రం కోల్పోలేదు నందిత. మ్యూజిక్ వినిపించక పోయినా డ్యాన్స్ చేసేది. ఇది తనకు బాధ నుంచి ఉపశమనంగా అనిపించేది.

ఏడు సంవత్సరాల వయసులో భరతనాట్యంలో శిక్షణ మొదలుపెట్టిన నందిత...

'భరత నాట్యం అనేది నాకు కేవలం అభిరుచి కాదు. అంతకంటే ఎక్కువ. నన్ను నేను ప్రేమించుకోవడానికి, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి. నన్ను నేను వ్యక్తీకరించుకునే బలమైన మాధ్యమం' అంటుంది.

చీకటిరోజులు వెళ్లి పోయాయి. నందిత మళ్లీ మామూలు మనిషి అయింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్‌లో పోస్ట్-గ్రాడ్యుయేషన్ చేసిన నందిత జర్నలిస్ట్‌గా తనకు ఇష్టమైన అక్షర సేద్యం చేస్తోంది.



నందితా వెంకటేషన్

క్షయవ్యాధి చికిత్సలో భాగంగా తనలాగే వినికిడి శక్తి కోల్పోయిన దక్షిణ ఆఫ్రికాకు చెందిన ఫుమెజా టిసిలీతో కలిసి ఒక అమెరికన్ మల్టీ నేషనల్ ఫార్మాస్యూటికల్ కంపెనీకి సంబంధించిన క్షయవ్యాధి ఔషధానికి రెండోసారి పేటెంట్ ఇవ్వకూడదంటూ భారత ప్రభుత్వానికి పిటిషన్ దాఖలు చేసి విజయం సాధించింది. ఈ విజయం ద్వారా క్షయవ్యాధిగ్రస్తులకు తక్కువ ధరలకు మందులు దొరికే అవకాశం ఏర్పడింది. ఇద్దరూ టైమ్స్ జాబితాలో చోటు సాధించారు.

శనివారం 16-9-2023


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే
సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 177


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



భారత్‌కు బంగ్లా షాక్
6 పరుగుల తేడాతో ఓడిన టీమిండియా.. గిల్ శతకం వృథా - 11లో



ఎగుమతులు వెనకడుగే..
ఏడు శాతం తగ్గుదల.. ఆగస్ట్‌లో 34.48 బిలియన్ డాలర్లుగా నమోదు - 11లో



కక్ష్య దూరం మళ్లీ పెంపు
ఇస్రో ఈనెల 2వ తేదీన ప్రయోగించిన ఆదిత్య-ఎల్1 ఉపగ్రహానికి శుక్రవారం నాలుగో విడత కక్ష్య దూరాన్ని పెంచారు.
వివరాలు 6లో ▸



హింసాకాండలో 175 మంది బలి
మణిపూర్‌లో హింసాత్మక ఘటనల్లో 175 మంది మరణించారని, 32 మంది అదృశ్య మయ్యారని ఆ రాష్ట్ర పోలీసు శాఖ తెలిపింది.
వివరాలు 6లో ▸



జై హింద్, పాపా...!
కశ్మీర్ లోయలో వీర మరణం పొందిన మన్ ప్రీత్‌కు తన కుమారుడు 'జైహింద్ పాపా' అంటూ తుది వీడ్కోలు పలికాడు.
వివరాలు 6లో ▸



మరణానంతరం డిగ్రీ
అమెరికాలో మృతి చెందిన జాహ్నవికి మరణానంతరం డిగ్రీ ప్రదానం చేయనున్నట్లు నార్త్ ఈస్టర్న్ వర్సిటీ ప్రకటించింది.
వివరాలు 6లో ▸

మన వైద్య రంగం దేశానికే దిక్సూచి

గొప్ప, మనసున్న డాక్టర్లను సమాజానికి అందించడమే లక్ష్యం: సీఎం జగన్

ఐదు మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవంలో సీఎం

- ఇన్నాళ్లుగా రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు 11 మాత్రమే
- గత నాలుగేళ్లలో వైద్య, ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాం
- రూ.8,480 కోట్ల ఖర్చుతో కొత్తగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం
- తొలి విడతగా నేడు విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల ప్రారంభం.. వచ్చే ఏడాది మరో ఐదు కాలేజీలు.. ఆపై ఏడాది ఇంకో ఏడు మెడికల్ కాలేజీలు
- తద్వారా ఎంబీబీఎస్, పీజీ మెడికల్ సీట్లు రెట్టింపు.. ప్రతి జిల్లాలోనూ అత్యుత్తమ స్పెషాలిటీ వైద్య సేవల్లో గొప్ప మార్పు
- జీరో వేకెన్సీ విధానంతో ఆస్పత్రుల్లో ఖాళీలన్నీ భర్తీ

2లో



విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

"కొన్ని స్టేట్‌మెంట్స్ ఎప్పుడూ నా మనసును తడు తుంటాయి. ఈవేళ అలా 'నాట్ ఆల్ ఏంజిల్స్ హేవ్ వింగ్స్.. సమ్ హేవ్ స్టెతస్కోప్స్' (దేవతలంటే రెక్కలున్న వాళ్లు మాత్రమే కాదు.. స్టెతస్కోప్స్ ఉన్న వాళ్లు కూడా) అనే కోట్ నా మనసుకు తట్టింది. అందుకే ఈ కళాశాలలో అడుగు పెట్టినప్పుడు దీనిని బోర్డుపై రాసి సంతకం పెట్టాను. కీప్ దిస్ ఇన్ మైండ్. మీరంతా మంచి డాక్టర్లు, పోస్టు గ్రాడ్యు యేట్ డాక్టర్లు, సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు అవుతా రన్న నమ్మకం నాకు ఉంది. ఆల్ ద వెరీ బెస్ట్."
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నేడు 'కాపు నేస్తం' నాలుగో విడత

నిడదవోలు సభలో బటన్ నొక్కి జమ చేయనున్న సీఎం జగన్

కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన 3,57,844 మందికి లబ్ధి.. నాలుగేళ్లలో అక్కచెల్లెమ్మలకు అందించిన ఆర్థిక సాయం రూ.2,029 కోట్లు

- వివరాలు 9లో

న్యూస్‌రీల్

ఎల్లలు దాటనున్న మాడుగుల హల్వా!



నోట్లో వేసుకోగానే మైమరపించే మాడుగుల హల్వా రుచిని ప్రపంచానికి పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో దీనిని ప్రత్యేక పరిశ్రమగా అభివృద్ధి చేయడంతో పాటు.. భౌగోళిక గుర్తింపు తీసు కొచ్చేందుకు అడుగులేస్తోంది. ఇందుకోసం దామోదర సంజీవయ్య లా వర్సిటీతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.
వివరాలు 8లో ▸

హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశాలు



'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ' సమావేశాలకు హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్ వేదిక కానుంది. శని, ఆదివారాల్లో ఈ సమావే శాలు జరగనున్నాయి. త్వరలో జరగ నున్న 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, భారత్ జోడో యాత్ర-2 నిర్వహణ, తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.
వివరాలు 10లో ▸

బాబు బెయిల్ పిటిషన్‌లో కౌంటర్ వేయండి

- సీఐడీకి ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆదేశం.. తదుపరి విచారణ 19కి వాయిదా
- సీఐడీ వేసిన పోలీసు కస్టడీ పిటిషన్, హైకోర్టులో క్వాష్ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నాయి
- ఈ పరిస్థితుల్లో బెయిల్ పిటిషన్‌పై విచారణ సబబేనా?
- సందేహం వ్యక్తం చేసిన ఏసీబీ ప్రత్యేక కోర్టు
- మా కస్టడీ పిటిషన్‌లో ముందు కెళ్లకుండా హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చారు
- వాటిని అడ్డుపెట్టుకుని బెయిల్ పిటిషన్ వేసి మధ్యంతర బెయిల్ అడుగుతున్నారు
- కోర్టు దృష్టికి తీసుకొచ్చిన సీఐడీ

7లో

రామోజీ పైశాచికత్వం

రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ లీవుపై 'ఈనాడు' సైకో రాతలు



- ప్రభుత్వ పెద్దలే పంపించేశారని, అక్కడ కుట్ర జరుగుతోందని విషప్రచారం
- దీనికి ఊహలు, అభూత కల్పనలు జోడిస్తూ చెలరేగిపోయిన టీడీపీ.. జైల్లో భద్రతపై అనుమానా లంటూ కోర్టులోనూ అదే వాదన
- వాస్తవానికి భార్యను ఆసుపత్రిలో చేర్పటంతో లీవు పెట్టిన రాహుల్
- శుక్రవారం ఆయన భార్య కిరణ్మయి మృతి; జైళ్ల శాఖ డీఐజీ పరామర్శ
- ఎల్లో ముఠా ఇంతలా దిగజారి పోవటంపై విస్తుపోతున్న జనం
- బాబు దొంగతనాన్ని కప్పిపుచ్చేందుకు ఎక్కడికక్కడ ఎల్లో డ్రామాలు
- ప్రత్యేక విమానాల్లో తిరుగుతున్న చంద్రబాబు కుటుంబ సభ్యులు
- ఎల్లో పత్రికల వార్తలతో 'ఇవీ నిజాలు..' అంటూ ఓ వెబ్‌సైట్ కూడా
- అడ్డంగా దొరికిపోయి ఇంత బుకాయింపా అంటూ నిపుణుల నివ్వెరపాటు

- వివరాలు 3లో

విధ్వంసానికి భారీ కుట్ర

3లో

- జాతీయ రహదారులపై అల్లర్లకు స్కెచ్
- చంద్రబాబు అవినీతి నుంచి దృష్టి మళ్లించేందుకే
- విద్యార్థులు, యువతే పావులుగా పక్కా పన్నాగం
- సోషల్ మీడియా ద్వారా 'విధ్వంస' రచన
- అప్రమత్తమైన పోలీసులు

మన మహిళ పొదుపులో అగ్రగామి



- దేశంలోనే అత్యధికంగా ఏపీ స్వయం సహాయక సంఘాల పొదుపు రూ.18,606 కోట్లు
- అన్ని రాష్ట్రాల పొదుపులో మన సంఘాల వాటా 31 శాతం
- గత ఆర్థిక ఏడాది పొదుపు రూ.6,938 కోట్లు పెరుగుదల
- ఒక్కో సంఘం సగటు పొదుపులోనూ ఏపీ టాప్
- బ్యాంకు రుణాల మంజూరు దేశంలో మన సంఘాలకే ఎక్కువ
- 2022-23లో పొదుపు సంఘాలకు రూ.40,230 కోట్ల రుణాలు
- వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీతో పెరిగిన ఆర్థిక క్రమశిక్షణ
- పొదుపు సంఘాలపై నాబార్డు 2022-23 నివేదిక విడుదల

7లో

ఖరీఫ్ ధాన్యం సేకరణకు సన్నాహాలు

- తరలించడానికి 30వేల వాహనాల ఏర్పాటు
- ఆర్బీకేల్లో వాటి రిజిస్ట్రేషన్ ప్రారంభం
- జీపీఎస్ ట్రాకర్ ద్వారా మిల్లుకు చేరేలా పర్యవేక్షణ
- ధాన్యం సేకరణకు తాత్కాలిక సిబ్బంది నియామక ప్రక్రియ షురూ..
- మిల్లు వద్ద డిప్యూటీ తహశీల్దార్ కేడర్ అధికారి కస్టోడియన్ అధికారిగా నియామకం



- వివరాలు 10లో

ఇదండీ సంగతి


..జస్ట్ పాలు అమ్మి.. రెండెకరాలు నుండి లక్షల కోట్లు ఎలా సంపాదించారో ఆ కిటుకొకటి చెప్పి పుణ్యం కట్టుకోండి సార్!

క్లుప్తంగా...

20న ఉదయం 11 గంటలకే కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: ఈ నెల 20న ఉదయం 11 గంటలకే సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన సచివాలయం మొదటి బ్లాక్‌లోని కేబినెట్ సమావేశ మందిరంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ సమావేశం జరుగుతుందని ఇటీవల ఉత్తర్వులు జారీ చేయగా ఇప్పుడు ఉదయం 11 గంటలకే సమావేశం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

వైద్య విద్యార్థులు గొప్ప డాక్టర్లుగా పేరు తెచ్చుకోవాలి

• సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీల ఏర్పాటులో భాగంగా నిర్మాణం పూర్తైన ఐదు కాలేజీలను నేడు మన ప్రభుత్వంలో ప్రారంభించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఈ కాలేజీల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఇక్కడ నేర్చుకున్న విద్యతో ప్రజలకు మెరుగైన సేవలు అందించి, గొప్ప డాక్టర్లుగా పేరు తెచ్చుకోవాలి. మన ప్రభుత్వం నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల్లో వచ్చే ఏడాది ఇంకో ఐదు, ఆ మరుసటి ఏడాది మరో ఏడు కాలేజీలు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటుకు మన ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఫలితంగా మన రాష్ట్రానికి చెందిన వేల మంది విద్యార్థులను గొప్ప డాక్టర్లుగా చేసే దిశగా అడుగులు పడుతున్నాయి' అని శుక్రవారం ఆయన ట్వీట్ చేశారు.

ల్యాబ్‌లు పరిశీలించిన ముఖ్యమంత్రి



'నాట్ ఆల్ ఏంజెల్స్ హేవ్ వింగ్స్.. సమ్ హేవ్ స్టెతస్కోప్స్' అని రాసి.. సంతకం చేస్తున్న సీఎం

విజయనగరం: విజయనగరం జిల్లాలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన వివిధ ప్రయోగశాలలను శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసక్తిగా తిలకించారు. ప్రొఫెసర్లు చెప్పిన విషయాలను ఓపికగా విని, సందేహాలు నివృత్తి చేసుకున్నారు. అంతకుముందు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం 'నాట్ ఆల్ ఏంజెల్స్ హేవ్ వింగ్స్.. సమ్ హేవ్ స్టెతస్కోప్స్' అని బోర్డుపై రాసి, సంతకం చేశారు. ఆ తర్వాత స్కిల్, బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లు, అనాటమి మ్యూజియంను సందర్శించారు. వివిధ రకాల టెస్ట్‌ల గురించి ప్రొఫెసర్లు సీఎంకు వివరించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

వైద్య కళాశాలల ప్రారంభం చరిత్రాత్మక ఘట్టం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 17 ప్రభుత్వ కొత్త వైద్య కళాశాలల ఏర్పాటులో భాగంగా శుక్రవారం 5 వైద్య కళాశాలలను ప్రారంభించి సీఎం జగన్ చరిత్రాత్మక ఘట్టానికి తెర తీశారని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్యాంసుందర్ ఓ ప్రకటనలో కొనియాడారు. వైద్య కళాశాలల ఏర్పాటు విషయంలో తమ సంఘం సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి మద్దతుగా ఉంటుందన్నారు.

గ్లోబల్ బిజినెస్ గేట్ వే గా శ్రీసిటీ



సీఐఐ ప్రతినిధులతో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

వరదయ్యపాళెం (తిరుపతి జిల్లా): మేక్ ఇన్ ఇండియా బాటలో ఆటోమొబైల్, ఇంజినీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇండస్ట్రియల్ టెక్స్‌టైల్ రంగాల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తూ గ్లోబల్ బిజినెస్ గేట్‌వేగా శ్రీసిటీ విస్తరిస్తోందని రాష్ట్ర కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం 25 మంది సీఐఐ సభ్యుల బృందం శ్రీసిటీని సందర్శించింది. వీరికి శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్ స్వాగతం పలికారు. శ్రీసిటీ పరిశ్రమల్లో సాంకేతిక నైపుణ్యాలను బృందం అధ్యయనం చేసింది. బిజినెస్ సెంటర్‌లో శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో బృంద సభ్యులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. జపాన్, యూరప్, యూఎస్ నుంచి ఎక్కువ పరిశ్రమలు ఏర్పాటు కావడం శుభపరిణామమన్నారు. పలు గ్లోబల్ బ్రాండ్ల ఉత్పత్తులు శ్రీసిటీకి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. సీఐఐ తిరుపతి జోన్ వైస్ చైర్మన్ పుష్పిత గార్గ్, జోన్ హెడ్ చందన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మన వైద్య రంగం దేశానికే దిక్సూచి

గొప్ప, మనసున్న డాక్టర్లను సమాజానికి అందించడమే లక్ష్యం

ఐదు మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవంలో సీఎం వైఎస్ జగన్



డిసెక్షన్ హాలులో వైద్య సేవలను స్వయంగా పరీక్షిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: నాలుగేళ్లలో చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు, కార్యక్రమాల వల్ల మన వైద్య రంగం దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రూ.8,480 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో కొత్తగా నిర్మాణం చేపట్టిన 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో తొలి దశలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఐదు కళాశాలలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీని స్వయంగా, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. విశాఖపట్నం నుంచి ఉదయం 10:30 గంటలకు విజయనగరం మెడికల్ కాలేజీ వద్దకు చేరుకున్నారు. కళాశాల అంతటా కలియదిరిగి పరిశీలించిన తర్వాత విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. అనంతరం సీఎం జగన్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం మొదలు పెట్టామని, అందులో ఇప్పటికే పూర్తి అయిన ఐదు మెడికల్ కాలేజీల్లో ఈరోజు పిల్లలు అడ్మిషన్లు తీసుకొని డాక్టర్లుగా అడుగులు వేస్తున్నారన్నారు. వైద్య విద్య అభ్యసించాక, అందరూ మంచి సేవల ద్వారా గొప్ప డాక్టర్లుగా, గొప్ప మనుషులుగా, గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారని మనసారా ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. మనసున్న డాక్టర్లను సమాజానికి అందించడమే లక్ష్యంగా వేగంగా అడుగులు ముందుకు వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రతి జిల్లాలో టెరిషరీ కేర్...

- ఈ రోజు 5 మెడికల్ కాలేజీలు.. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో ప్రారంభించాం. వచ్చే ఏడాది మరో ఐదు కాలేజీల్లో అడ్మిషన్లు చేస్తాం. మళ్లీ మరుసటి ఏడాది మరో 7 కాలేజీలు అడ్మిషన్ స్థాయిలోకి వచ్చే పరిస్థితి ఉంటుంది. మొత్తంగా 17 మెడికల్ కాలేజీలను తీసుకు రాగలుగుతున్నాం.
- ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా చేశాం. ప్రతి జిల్లా స్థాయిలో ఒక మెడికల్ కాలేజీ పెట్టే కార్యక్రమాన్ని చేపట్టాం. దీనివల్ల టెరిషరీ కేర్ (స్పెషలిస్టు డాక్టర్లతో అత్యున్నత స్థాయి వైద్యం) అనేది ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలోకి మనం తీసుకు పోగలుగుతాం.
- ఎప్పుడైతే మెడికల్ కాలేజీ అందుబాటులో ఉంటుందో అప్పుడు అక్కడి ప్రొఫెసర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్లు నిత్యం అందుబాటులో ఉంటారు. దీనివల్ల వైద్య సేవల్లో గొప్ప మార్పు ఉంటుంది. ఇలా టెరిషరీ కేర్ పెరగడం వల్ల ప్రజలకు మంచి జరుగుతుంది. ఇది ఒక ఎత్తయితే మరోవైపు వేల మంది పిల్లలను మంచి డాక్టర్లుగా తయారు చేసే గొప్ప ఇన్‌స్టిట్యూషన్లను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేయగలుగుతున్నాం.

అదనంగా ఎంబీబీఎస్ సీట్లు

- స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత వరకు మన రాష్ట్రంలో గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు 11 మాత్రమే ఉన్నాయి. కేవలం ఈ నాలుగేళ్ల కాలంలో దేవుడి దయతో 13 జిల్లాలను 26 జిల్లాలుగా అధికార వికేంద్రీకరణ చేయగలిగాం. అలాగే, కొత్తగా ఏర్పాటు చేసే 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలతో కలిపి రాష్ట్రంలో మొత్తం 28 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులో ఉండే దిశగా అడుగులు వేగంగా వేస్తున్నాం.
- ఈ 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి రూ.8,480 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటివల్ల 2,250 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఉన్న మొత్తం ఎంబీబీఎస్ సీట్లు 2,185 కాగా, ఈ 17 మెడికల్ కాలేజీలు రావడంతో ఏకంగా 4,735కు పెరుగుతాయి.

గతానికి ఇప్పటికీ ఎంతో తేడా

- గవర్నమెంట్ ఆస్పత్రుల్లో మందులు తీసుకుంటే నయం కాదని చాలా మంది అనుకుంటారు. కానీ ఈరోజు అన్ని గవర్నమెంట్ ఆస్పత్రుల్లో డబ్ల్యూహెచ్‌ఓ (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్), జీఎంపీ (గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్) నిర్దేశించిన మందులు మాత్రమే ఉంచాం. ఆరోగ్యశ్రీ సేవలు మనం రాకముందు నామమాత్రంగా ఉండేవి. గతంలో 1050 ప్రొసీజర్లు ఉంటే ఈరోజు 3,255 ప్రొసీజర్లకు విస్తరించాం.
- అన్ని రకాల క్యాన్సర్ల నుంచి కాంక్లియర్ ఇంప్లాంట్ వరకు ఆరోగ్య శ్రీలో కవర్ అవుతున్నాయి. వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ పరిధిలోకి రావాలనే తపన, తాపత్రయంతో విస్తరిస్తున్నాం. గతంలో ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్ హాస్పిటళ్లు 900 ఉంటే ఈరోజు 2,285కు విస్తరించాయి. గతంలో ఆరోగ్యశ్రీ బడ్జెట్ రూ.1,100 కోట్లు కూడా సరిగా లేదు. ఈ రోజు ఆ బడ్జెట్ దాదాపు రూ.3,600 కోట్ల వరకూ ఉంది.

ఇప్పటికే ఉన్న కాలేజీల ఆధునికీకరణ

- రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న మెడికల్ కాలేజీలన్నింటిలోనూ మౌలిక సదుపాయాలన్నీ అప్‌గ్రేడ్ చేయగలిగాం. 'జీరో వేకెన్సీ' పాలసీ తీసుకొచ్చి గతంలో పెండింగ్‌లో ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయతలపెట్టాం. తద్వారా దాదాపు ఈ ఒక్క సంవత్సరంలోనే 609 కొత్త పీజీ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. 17 కొత్త మెడికల్ కాలేజీల ద్వారా భవిష్యత్‌లో మరో 2,737 పీజీ సీట్లు కూడా అందుబాటులోకి వస్తాయి.
- ఇదంతా ఎందుకు చేయాల్సి వస్తోందంటే మీరంతా (వైద్య విద్యార్థులు) మంచి డాక్టర్లు కావాలి. రాష్ట్ర ప్రజలకు ఇంకా ఎక్కువగా ఉపయోగపడాలనేదే నా ఆశయం. యాజ్ ఏ లీడర్, విజనరీస్, దిస్ ఈజ్ అవర్ డిజైర్. అందుకే ఇదంతా మీకు వివరిస్తున్నాను.
- ఈ రోజు ప్రారంభమవుతున్న ఐదు మెడికల్ కాలేజీల్లో దాదాపు 750 ఎంబీబీఎస్ సీట్లతో పిల్లలు డాక్టర్లు కాబోతున్నారు. రేపటి సంవత్సరం పాడేరు, పులివెందుల, మార్కాపురం, మదనపల్లె, ఆదోని ఇలాంటి బ్యాక్‌వర్డ్ ఏరియాల్లో కూడా మెడికల్ కాలేజీలు వస్తున్నాయి. తద్వారా 2024–25లో మరో 750 మెడికల్ సీట్లు వస్తాయి. ఆ తర్వాత 2025–26లో గిరిజన ప్రాంతాలు, టెరిషరీ కేర్ దొరకడం కష్టంగా ఉన్న పార్వతీపురం, నర్సీపట్నం లాంటి చోట్ల మరో ఏడు మెడికల్ కాలేజీలు రాబోతున్నాయి. తద్వారా 1,050 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయి.



నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం మెడికల్ కాలేజీలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం

నర్సింగ్ కాలేజీలూ అభివృద్ధి

- గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీలను కూడా అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటి వరకు దాదాపు 1,090 నర్సింగ్ సీట్లు ఉన్నాయి. కొత్తగా 18 నర్సింగ్ కాలేజీలను తీసుకొస్తున్నాం. వీటి ద్వారా మరో 1,200 నర్సింగ్ సీట్లు అందుబాటులోకి వస్తున్నాయి. మొత్తం 2,090 సీట్లు ఉంటాయి.
- రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఎన్‌ఏబీహెచ్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్స్, హెల్త్ కేర్ ప్రొవైడర్స్), ఎన్‌ఎంసీ (నేషనల్ మెడికల్ కమిషన్) మార్గదర్శకాలకు అనుగుణంగా నాడు–నేడు ద్వారా అప్‌గ్రేడ్ చేస్తున్నాం. ఇందుకోసం దాదాపు రూ.3,820 కోట్లు వెచ్చిస్తున్నాం.

జాతీయ స్థాయి కన్నా ఎంతో మెరుగు

- గతంలో కనివినీ చూడని విధంగా రాష్ట్రంలో ప్రతి మండలానికి కనీసం ఒక 108 వాహనం, రెండు 104 వాహనాలు ఉండేట్లుగా ఏర్పాట్లు చేశాం. 1,514 కొత్త వాహనాలు కొనుగోలు చేశాం. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లతో కలిపితే మొత్తం 2,204 అంబులెన్స్ వాహనాలు రాష్ట్రంలో తిరుగుతున్నాయి. ఇలా ఏ రాష్ట్రంలోనూ తిరగడం లేదు.
- మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే రాష్ట్రంలో ఈ నాలుగేళ్లలో ఒక్క వైద్య, ఆరోగ్య విభాగంలోనే 53,126 మందిని రిక్రూట్ చేశాం. జాతీయ సగటును గమనిస్తే ప్రభుత్వాస్పత్రుల్లో స్పెషలిస్టు వైద్యుల ఖాళీలు 61 శాతం ఉన్నాయి. మన రాష్ట్రంలో అది 3.96 శాతం మాత్రమే. ఒక స్పెషల్ రిక్రూట్‌మెంట్ బోర్డు పెట్టి, నో వేకెన్సీ పాలసీ తీసుకొచ్చి అసలు ఎక్కడా ఖాళీలు ఏర్పడక ముందే భర్తీ చేయాలని వెంట పడుతున్నాం.

ప్రివెంటివ్ కేర్ అవసరం

- నాలుగేళ్ల మన పాలనలో ప్రణాళికా బద్ధంగా గ్రామ స్థాయి నుంచి మార్పులు తీసుకొస్తున్నాం. ఒకపక్క క్యూరేటివ్ కేర్, టెరిషరీ కేర్‌పై దృష్టి పెట్టాం. క్యూరేటివ్ కేర్ ఎంత అవసరమో ప్రివెంటివ్ కేర్ (ప్రమాదకరమైన వ్యాధులు, ఆరోగ్య సమస్యలు తీవ్ర స్థాయికి చేరకముందే కనుక్కొని నిరోధించడం) కూడా అంతే అవసరం.
- ఈ విషయంలో దేశానికే మార్గదర్శకంగా నిలబడే విధంగా గతంలో ఎప్పుడూ చూడని విధంగా అడుగులు పడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా 10,032 విలేజ్ క్లినిక్స్ ఏర్పాటయ్యాయి. వాటిలో సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు ఉంటారు. అక్కడ 105 రకాల మందులు ఇస్తారు. 14 రకాల డయోగ్నోస్టిక్ టెస్టులు చేస్తారు. మరో 542 అర్బన్ క్లినిక్‌లు తీసుకొచ్చాం.
- విలేజ్ క్లినిక్‌లను ప్రివెంటివ్ కేర్ దిశగా అడుగులు వేయిస్తున్నాం. ప్రతి మండలానికి కనీసం 2 పీహెచ్‌సీలు ఉండేట్లుగా చేస్తున్నాం. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు చొప్పున ఉంటారు. ఒక 104 వాహనం ఉంటుంది. ఒక డాక్టరు ఆస్పత్రిలో అందుబాటులో ఉంటే, మరో డాక్టరు ఈ అంబులెన్స్‌లో షెడ్యూల్ ప్రకారం కేటాయించిన గ్రామానికి వెళ్లి వైద్య సేవలు అందిస్తారు. ఇలా ప్రతి నెలా ఆ గ్రామానికి కనీసం రెండుసార్లు వెళ్లేట్లు చేస్తున్నాం. ఇలా చేయడం వల్ల ఆర్నెల్ల వ్యవధిలోనే ఆ గ్రామంలో ఎవరికి ఏ రోగం ఉంది.. ఎవరికి బీపీ, షుగర్ వంటి సమస్యలున్నాయనేది పూర్తిగా చెప్పగలిగేలా ఒక ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తెచ్చాం.



మెడిసిన్ విద్యార్థులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- జాతీయ స్థాయిలో సగటున ప్రభుత్వాస్పత్రుల్లో నర్సు పోస్టుల ఖాళీలు 27 శాతం ఉంది. మన రాష్ట్రంలో జీరో (సున్నా శాతం). జాతీయ స్థాయిలో సగటున ప్రభుత్వాస్పత్రుల్లో ల్యాబ్ టెక్నీషియన్ల ఖాళీలు 33 శాతం. మన రాష్ట్రంలో జీరో.

పేదవాళ్లకు ఉపయోగపడాలి

- వైద్య ఆరోగ్య రంగంలో మంచి డాక్టర్లు రావాలి. మంచి పీజీ స్టూడెంట్లు రావాలి. మీలో (వైద్య విద్యార్థుల్లో) మంచి మనసు రావాలి. మీరంతా పేదవాళ్లకు ఉపయోగపడే పరిస్థితి రావాలనేదే నా ఆశయం. ఇప్పటి వరకు బటన్ నొక్కితే డీబీటీ పద్ధతిలో 2.35 లక్షల కోట్ల రూపాయలు నేరుగా పేద ప్రజల ఖాతాల్లోకి వేయగలిగాం. ఎలాంటి లంచాలకు, ఎక్కడా వివక్షకు చోటు లేకుండా చేయగలిగాం.
- ఇంటి తలుపు తట్టి పెన్షన్ ఇచ్చేలా వ్యవస్థను గడప వరకు తీసుకుపోగలిగాం. రేషన్ కార్డు, రేషన్ బియ్యాన్ని ప్రతి గడప ముంగిటకు చేర్చగలిగాం. ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి, ఇంటి స్థలం లేని వారెవరైనా ఉన్నారా అని వెతికి, అప్లికేషన్ పెట్టించి 30 లక్షల ఇంటి స్థలాలను పేదవాళ్లకు ఇవ్వగలిగాం. 22 లక్షల ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది.
- ఎవరికి ఏ రకమైన సర్టిఫికెట్ కావాలన్నా ఇంటింటికీ వెళ్లి అడిగి మరీ సమకూరుస్తున్నాం. ఇటీవల జగనన్న సురక్ష కార్యక్రమంలో 98 లక్షల సర్టిఫికెట్లు అందజేశాం.

జగనన్న ఆరోగ్య సురక్ష మరో మంచి కార్యక్రమం

- ఈ రోజు మరో మంచి కార్యక్రమం దిశగా అడుగులు వేస్తున్నాం. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించాం. ఇంటింటికీ వెళ్లి జల్లెడ పట్టి ఆ ఇంట్లో ఎవరికి ఏ రకమైన ఆరోగ్య సమస్య ఉన్నా సరే 7 రకాల టెస్టులు చేస్తారు. 5 దశల్లో యాక్టివిటీ మొదలు పెట్టాం. నాలుగో దశలో హెల్త్ క్యాంపులు ఉంటాయి. సెప్టెంబర్ 30న మొదటి హెల్త్ క్యాంపు నిర్వహిస్తారు.
- తర్వాత 45 రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ హెల్త్ క్యాంపులు పూర్తవుతాయి. గ్రామం మొత్తం మ్యాపింగ్ అవుతుంది. ప్రతి ఇంట్లో ఏ రకమైన సమస్య ఉన్నా, వారికి ఉచితంగా టెస్టులు చేస్తాం. ఉచితంగా మందులు ఇవ్వబోతున్నాం. తర్వాత హ్యాండ్ హోల్డింగ్ చేయబోతున్నాం. అది చాలా కీలకమైంది.
- ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా అడుగులు వేస్తున్నాం. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కావాలని మనస్ఫూర్తిగా అడుగుతున్నా.
- ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు విడదల రజని, బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, కంబాల జోగులు, కడుబండి శ్రీనివాసరావు, కళావతి, పుష్ప శ్రీవాణి, జోగారావు, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, విక్రాంత్, రఘురాజు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ భావన, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులకు పెద్దమనసుతో సాయం



బాధితుల కష్టాలు వింటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



బాధితులకు చెక్కులు అందించిన కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం, విజయనగరం రూరల్/అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హెలిప్యాడ్ వద్ద అనారోగ్యంతో బాధ పడుతున్న పలువురు బాధితులు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న పూసపాటిరేగ గ్రామానికి చెందిన టొంపల లేఖన, బోన్‌మ్యారో మార్పిడి కోసం ఎదురు చూస్తున్న గంట్యాడ మండలం కొర్లాం గ్రామానికి చెందిన దూరి భానుప్రసాద్, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం దేరసాం గ్రామానికి చెందిన పోలియో వ్యాధిగ్రస్తుడు పిల్లా శంకరరావు, అనుకోని ప్రమాదంతో వీల్‌చైర్‌కే పరిమితమైన జి.సిగడాం మండలం నిద్దాం గ్రామానికి చెందిన చౌదరి గణేష్‌లు తమ అనారోగ్య సమస్యలు చెప్పుకున్నారు. వీరందరి సమస్యలను ఓపికగా విన్న సీఎం వారి భుజం తట్టి ఓదార్చారు. తక్షణ సాయంగా రూ.లక్ష చొప్పున అందించాలని, మెరుగైన వైద్యం కోసం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. నిమిషాల వ్యవధిలో కలెక్టర్ నాగలక్ష్మి వారికి చెక్కులు అందజేశారు.

మీరే నాకు స్ఫూర్తి



అన్నా.. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రైవేటు వైద్య కళాశాలల కంటే మెరుగైన వసతులు ఉన్నాయి. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కళాశాలను నిర్మించారు. ఇంటి వద్ద ఉన్నామనే భావన కలిగేలా హాస్టల్ ఉంది. మా అమ్మానాన్నల సంకల్పానికి మీరు (సీఎం జగన్) తోడు కావడంతో వైద్య విద్యను అభ్యసించే అవకాశం దొరికింది. ఇక్కడ ఫ్యాకల్టీ బాగుంది. మిమ్మల్ని ప్రతి ఒక్కరూ గౌరవిస్తారు. నాకు మీరే స్ఫూర్తి.

– ప్రసూన, వైద్య విద్యార్థిని, ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరం

మీకు రుణపడి ఉంటాం



అన్నా.. డాక్టర్ కావాలన్న కల మీ ద్వారా సాకారం అవుతోంది. మాది రైతు కుటుంబం. మా తల్లిదండ్రుల రెక్కల కష్టంతో నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చారు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే చదివాను. అమ్మఒడి పథకం సాయంతో ఇంటర్ విద్యనభ్యసించాను. మా కుటుంబం అంతా మీకు రుణపడి ఉంటుంది.

– కోటీశ్వరి, వైద్యవిద్యార్థిని, ప్రభుత్వ వైద్యకళాశాల, ఏలూరు

మా గ్రామంలో నేనే మొదటి డాక్టర్



అన్నా.. మాది చాలా పేద కుటుంబం. నాన్న దినసరి కూలీ. నాకు ఎంబీబీఎస్ సీటు రాదని చాలా మంది నిరుత్సాహ పరిచేవారు. మీరు తీసుకున్న నిర్ణయం వల్లే నాకు ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు వచ్చింది. చక్కగా చదువుకుని సమాజానికి సేవలందిస్తాను. మా అమ్మకు కేన్సర్. చికిత్స చేయించలేమనుకున్నాం. కానీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చికిత్స జరిగింది. నేను డాక్టర్ కావాలన్న మా అమ్మ కల మీ వల్ల నెరవేరుతోంది. మా గ్రామంలో (విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం పెద్దసెలగం) నేనే మొదటి డాక్టర్‌ని అవుతాను.

– గగనశ్రీ, వైద్య విద్యార్థిని, రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాల

వసతులు అద్భుతం



మాది రాజస్థాన్. ఆలిండియా కోటాలో మచిలీపట్నంలో కొత్తగా నిర్మించిన వైద్య కళాశాలలో సీటు వచ్చింది. ఇక్కడ వసతులు అద్భుతంగా ఉన్నాయి. ఒకేసారి ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభించడం గొప్ప విషయం. ప్రైవేటు వైద్య కళాశాలల కంటే మిన్నగా సౌకర్యాలు ఉన్నాయి. ఇక్కడ అందరూ మీరు చేసిన మంచి పనుల గురించి చెబుతుంటే ఆనందంగా ఉంది.

– సచిన్ దాన్యా, వైద్య విద్యార్థి, ప్రభుత్వ వైద్య కళాశాల, మచిలీపట్నం

రాయలసీమకు వెలుగొచ్చింది



నంద్యాలలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో రాయలసీమకు వెలుగు వచ్చింది. ఇంత తక్కువ సమయంలో వైద్య కళాశాల ఏర్పాటు అంత సులభం కాదు. మా వైద్య కళాశాలను అద్భుతంగా నిర్మించారు. కళాశాలకు దగ్గరగా హాస్టల్ ఉంది. మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించారు. వైద్య విద్యను చక్కగా అభ్యసించి మంచి వైద్యురాలిగా ప్రజలకు సేవలందిస్తాను. ఇలాంటి అవకాశం ఎంతో మందికి కల్పించిన జగనన్నకు కృతజ్ఞతలు.

– జలదుర్గం త్రిభువని, వైద్య విద్యార్థిని, ప్రభుత్వ వైద్యకళాశాల, నంద్యాల

సీఎం జగన్ చిత్తశుద్ధికి నిదర్శనం



రాజమండ్రిలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వస్తోంది. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. నాలుగున్నరేళ్లలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలని సంకల్పించగా, ఈ ఏడాది ఐదు వైద్య కళాశాలలను అందుబాటులోకి తేవడం వైద్య విద్యా రంగంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.

– మాధవీలత, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్

వైద్య విద్యకు అధిక ప్రాధాన్యం



విద్య, వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్య, వైద్యం కలిసిన వైద్య కళాశాలను ప్రారంభించడం సంతోషంగా ఉంది. పేద ప్రజలు అత్యవసర వైద్యం కోసం విజయవాడ వెళ్లేవారు. ఇక ఆ అవసరం లేదు. ఇక్కడ వైద్య కళాశాల ఏర్పాటుతో ఇప్పుడు ఇక్కడే మంచి వైద్యం అందుతుంది.

– వి.ప్రసన్న వెంకటేష్, ఏలూరు జిల్లా కలెక్టర్

జిల్లా మణిహారంగా వైద్య కళాశాల

ప్రభుత్వ వైద్య కళాశాల జిల్లా మణిహారంగా నిలవనుంది. జిల్లా వాసుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ, ప్రభుత్వ వైద్య కళాశాలను ముఖ్యమంత్రి ప్రారంభించడం పట్ల చాలా సంతోషంగా ఉంది. మరింత మంది పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి రావడంతోపాటు పేదలకు మెరుగైన వైద్యం అందుతుంది. వైద్య కళాశాలకు సంబంధించి 22 విభాగాల్లో 174 పోస్టులు మంజూరయ్యాయి. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వైద్య కళాశాలను ఏర్పాటు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు.

– నాగలక్ష్మి సెల్వరాజన్, విజయనగరం జిల్లా కలెక్టర్

ప్రజల చిరకాల వాంఛ తీరింది



గతేడాది జూన్‌లో వైద్య కళాశాలకు క్లియరెన్స్ వచ్చింది. సమయం తక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడంతో వైద్య కళాశాలను నిర్మించుకోగలిగాం. వైద్య కళాశాల ఏర్పాటుతో నంద్యాల జిల్లా ప్రజల చిరకాల వాంఛ తీరింది. జిల్లా ప్రజలు అత్యవసర వైద్యం కోసం కర్నూలు, హైదరాబాద్ వెళ్లేవారు. ఇప్పుడు ఇక్కడ వైద్య కళాశాల ఏర్పాటుతో మెరుగైన వైద్యం స్థానికంగా, సకాలంలో అందుతుంది.

– ఎం.జిలానీ, నంద్యాల జిల్లా కలెక్టర్

సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల జిల్లాలో పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పుడు వైద్య కళాశాలను ప్రారంభించడంతో జిల్లా ప్రజలు సంతోషిస్తున్నారు. వైద్య కళాశాలకు సంబంధించిన తరగతి గదులు, హాస్టల్ నిర్మాణాలు పూర్తయ్యాయి. ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న కల సాకారమైందని ప్రజలు ఆనందిస్తున్నారు.

– రాజాబాబు, కృష్ణా జిల్లా కలెక్టర్

క్లుప్తంగా...

సీఎం జగన్ సంక్షేమానికి, బాబు కపట రాజకీయాలకు మధ్యే ఎన్నికలు

వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: రానున్న ఎన్నికలు వైఎస్సార్‌సీపీ వర్సెస్ టీడీపీ మాత్రమే కాదని.. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు, చంద్రబాబు అధికార దాహానికి, కపట రాజకీయాలకు మధ్య ఎన్నికలు అని వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి చెప్పారు. సోషల్ మీడియా వేదికగా శుక్రవారం ఆయన ఈ అంశంపై స్పందించారు. విశ్వసనీయతకు, యూటర్న్ రాజకీయాలకు, ఐక్యతకు, కుల రాజకీయాలకు మధ్య, తోడేళ్ల గుంపునకు, సింహానికి మధ్య జరుగుతున్న ఎన్నికలని అభివర్ణించారు. సీమెన్స్ ప్రమేయమే లేకుండా ఆ సంస్థ పేరుతో చంద్రబాబు బురిడీ కొట్టించినట్లు స్పష్టమైందని విజయసాయిరెడ్డి చెప్పారు. ఖైదీ నంబర్ 7691(చంద్రబాబు) కుట్ర పూణేలో వెలుగులోకొచ్చిందన్నారు. అగ్రిమెంట్‌లో తేదీ, లెటర్ నంబర్ కూడా లేదని, స్కాంకు సంబంధించిన ఫైళ్లను సెక్రటేరియట్‌లో తగులబెట్టారని తెలిపారు. నాలుగు లేయర్లలో డబ్బుల పంపిణీ జరిగినట్లు ఆధారాలు లభించాయన్నారు. కాగా, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకకాలంలో 5 మెడికల్ కాలేజీల్లో అకడమిక్ తరగతులను ప్రారంభించడం గొప్ప విషయమని, ఇది సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే సాధ్యపడిందని విజయసాయిరెడ్డి ప్రశంసించారు.

పరామర్శకా? ప్యాకేజీ మాట్లాడుకునేందుకా?

పవన్‌పై హోంమంత్రి వనిత ఆగ్రహం



సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో పక్కా ఆధారాలతోనే టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారని హోం మంత్రి తానేటి వనిత చెప్పారు. చంద్రబాబును అరెస్ట్ చేసి కక్ష సాధిస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవం లేదని ఆమె స్పష్టంచేశారు. హోంమంత్రి వనిత శుక్రవారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడుతూ కక్ష సాధించాలంటే నాలుగేళ్లలో ఎంతో మంది జైళ్లలో ఉండేవారన్నారు. పవన్‌కళ్యాణ్ అసలు చంద్రబాబును కలిసింది పరామర్శకా? ప్యాకేజీ మాట్లాడుకునేందుకా? అనే ఆగ్రహం వ్యక్తంచేశారు.

అవినీతి వల్లే బాబుపై కేసులు

1,083వ రోజు దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: చంద్రబాబు పాలనలో జరిగిన భారీ అవినీతి వ్యవహారాల్లోనే ఆయన జైలు పాలయ్యే పరిస్థితి వచ్చిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 1,083వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ ఒక్క 'స్కిల్' స్కామ్‌లోనే రూ.వందల కోట్ల అవినీతి జరిగిందంటే.. బాబు చేసిన అవినీతి కేసులన్నిటినీ తవ్వితే రూ.లక్షల కోట్ల కుంభకోణాలు బయట పడతాయన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

బీసీ న్యాయమూర్తిని దూషిస్తే సహించం: గూడూరి



పాలకొల్లు అర్బన్: చంద్రబాబు అవినీతి కేసును విచారించిన బీసీ కులానికి చెందిన ఏసీబీ న్యాయమూర్తిని దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వ్యక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారిని కులాల పేరు ఎత్తి చూపుతూ వ్యక్తిగత దూషణలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

చంద్రబాబు కోసం ప్రత్యేక వైద్య బృందం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న నారా చంద్రబాబుకు ప్రభుత్వం ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేసింది. సెంట్రల్ జైలులో ప్రత్యేక అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. 10 మందితో కూడిన ప్రత్యేక వైద్య బృందం నిరంతరం చంద్రబాబు ఆరోగ్యస్థితి గమనిస్తూ ఉంటుంది. అంబులెన్స్‌లో అత్యవసర మందులు, బ్లడ్ ప్యాకెట్లు రెండు అందుబాటులో ఉంచారు. డాక్టర్ పి. శ్రీనివాస్ టీం లీడర్‌గా ఉన్న ఈ బృందంలో జనరల్ సర్జన్, అనస్తీషియా స్పెషలిస్ట్, ఆర్థోపెడిక్ నిపుణులు, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఎంఎన్‌వో, ఇద్దరు అంబులెన్స్ డ్రైవర్లు అందుబాటులో ఉంటారు.

రామోజీ పైశాచికత్వం

రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ లీవుపై 'ఈనాడు' సైకో రాతలు



రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో
ఏం జరుగుతోంది?

ఈనాడులో ప్రచురించిన కథనం

సాక్షి, అమరావతి: 'ఈనాడు' పత్రిక, దాన్ని నడిపిస్తున్న రామోజీరావు ఇంత పైశాచికంగా ఆలోచిస్తున్నారెందుకు? తెలుగుదేశం పార్టీ దారుణంగా దిగజారిపోయి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని 'ఈనాడు' కూడా తన సొంత స్టోరీల మాదిరిగా రాస్తూ ఎందుకింత నీచానికి ఒడిగడుతోంది? ఒక జైలు సూపరింటెండెంటు... అనారోగ్యంతో ఉన్న తన భార్య ఆరోగ్యం విషమించిందని తెలుసుకుని అప్పటికప్పుడు సెలవు పెట్టి వెళితే దానిక్కూడా ఊహలు, అతిశయోక్తులు జోడించి 'రాజమండ్రి జైల్లో ఏం జరుగుతోంది?' అంటూ కథనాన్ని వండేశారంటే ఏమనుకోవాలి? చంద్రబాబుతో, పవన్ కళ్యాణ్, లోకేశ్, బాలకృష్ణ ములాఖత్ అయిన కాసేపటికే జైలు సూపరింటెండెంట్ రాహుల్ సెలవు పెట్టారని, ప్రభుత్వ పెద్దలు బలవంతంగా సెలవుపై పంపించటం వల్లే ఇదంతా జరుగుతోందని, జైలును కుట్రలకు కేంద్రంగా మారుస్తున్నారని... ఇలా చేతికొచ్చిన అక్షరాలన్నిటినీ రాసేసింది. దాన్నే తెలుగుదేశం పార్టీ తన విషప్రచారానికి వాడుకుంటోంది. జనం మెదళ్లలో వీలైనంత విషం నింపటానికి ఎల్లో ముఠాలన్నీ ఒక్కటై సాగిస్తున్న ఈ దుష్ప్రచారం హద్దుల్లేకుండా సాగిపోతోంది.

భార్య అనారోగ్యం అని చెప్పినా....

వాస్తవానికి జైలు సూపరింటెండెంట్ రాహుల్ భార్య కిరణ్మయి (46) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఔట్ పేషెంట్‌గానే చికిత్స పొందుతున్న కిరణ్మయిని.. ఆరోగ్యం విషమించటంతో ఈ నెల 14న ఆసుపత్రిలో చేర్చారు. ఆమెను దగ్గరుండి చూసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో రాహుల్ కూడా సెలవు పెట్టారు. దురదృష్టవశాత్తూ పరిస్థితి విషమించి శుక్రవారం ఆమె మరణించారు కూడా. 'ఈనాడు' పత్రిక గానీ, టీడీపీ గానీ ఇలాంటి వార్త రాసేముందు రాహుల్ సెలవు పెట్టిన కారణాన్ని తెలుసుకుని... అది వాస్తవమో కాదో ఒక్కసారి ధ్రువపరుచుకుని ఉంటే సరిపోయేది. అలా చేస్తే.. ఇంతటి హేయమైన, నీచమైన దౌర్భాగ్యపు రాతలు రాసి ఉండేవారు కాదేమో!!. వాస్తవానికి అలా అనుకోవటానికి లేదు. ఎందుకంటే వీళ్లెవరికీ నిజాలతో పనిలేదు. నిజం తెలిసినా దాన్ని బయటకు చెప్పరు కూడా. ఎన్ని అబద్ధాలు చెప్పయినా... జనం మెదళ్లలో ఎంతటి విషాన్ని నింపయినా చంద్రబాబును వీలైతే జైల్లోంచి బయటకు తేవటం, లేకపోతే సానుభూతి సంపాదించి రాజకీయంగా లబ్ధి పొందటమే వాళ్ల లక్ష్యాలు. దీనికోసం తాము అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా సంపాదించిన కోట్ల రూపాయల డబ్బు మూటల్ని వెదజల్లటానికి ఎల్లో ముఠా వెనకాడటం లేదు. కోట్లాది రూపాయలు ఫీజులివ్వటంతో పాటు ప్రత్యేక విమానాల్లో లాయర్లను తీసుకురావటం... దత్తపుత్రుడితో సహా కుటుంబ సభ్యులంతా హైదరాబాద్ - విజయవాడ- ఢిల్లీ అంటూ స్పెషల్ ఫ్లైట్లలో తిరుగుతుండటం... జాతీయ మీడియాకు ఢిల్లీలో చినబాబు లోకేశ్ ఇంటర్వ్యూలు... స్కిల్‌డెవలప్‌మెంట్‌పై నిజాలు అంటూ గాలి మాటలతో ఓ వెబ్‌సైట్‌ను ప్రారంభించటం.. ఇవన్నీ ఈ అక్రమ సంపాదనకు పుట్టిన సంతానమే అనుకోవాలి.

• టీడీపీ ట్విట్టర్‌లో చేసిన పోస్ట్ ఇదీ..



దొంగతనం చేసి ఇంత యాగీ చేయటమా?

దేశంలోనే కాదు... ఒక దొంగని అరెస్టు చేస్తే ఇంత యాగీ చెయ్యటమనేది ప్రపంచంలో ఎక్కడా ఉండదు. ఒక్క ఏపీలో తప్ప... అదీ చంద్రబాబునాయుడి విషయంలో తప్ప. ఒకవైపేమో సీమెన్స్ సంస్థ తమతో ఎవరూ ఎలాంటి ఒప్పందమూ చేసుకోలేదని చెబుతోంది... కానీ ఎల్లో మీడియా మాత్రం సీమెన్స్ పెద్ద సంస్థకాదా? సీమెన్స్ అంతర్జాతీయ దిగ్గజం కాదా? అని వాదిస్తోంది. నిజాలకు మసిపూస్తోంది. నిజంగా సీమెన్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్టే ఎదురు ప్రశ్నలు వేస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తరఫున విడుదల చేసిన డబ్బులు బయటకు పోయాయన్నది నిజం. అవి సీమెన్స్‌కు చేరలేదని ఆ సంస్థే చెబుతోంది. అవి షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబును చేరాయని కేంద్ర దర్యాప్తు సంస్థలే తేల్చాయి. మరి ఇంత రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయి కూడా.. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగుల సంఘీభావమంటూ, బెంగళూరులో తమకు మద్దతు తెలిపారంటూ పదేసి మందిని పోగేసి ఇంత యాగీ చేయటమెందుకు? మణిపూర్ పోరాట యోధురాలు ఇరోమ్ షర్మిల ద్వారా కూడా ట్వీట్ చేయించారంటే చంద్రబాబు ఎల్లో నెట్‌వర్క్ ఏ స్థాయిలో ఉందో చెప్పకనే తెలుస్తుంది. అసలు ఇరోమ్ షర్మిలకు ఏపీ గురించి తెలుసా? ఇక్కడ ఏం జరిగిందో తెలుసా? చంద్రబాబు ఎంత లూటీ చేశాడో తెలుసా? నిజంగా తప్పు చేయకపోతే... తాము అన్నీ సక్రమంగానే చేసి ఉంటే ఆ విషయాలన్నీ కోర్టులో చెప్పొచ్చు కదా? చంద్రబాబును వదిలేయాలంటూ వాట్సాప్ మెసేజ్‌లు, ఆడియో సందేశాలు... ఎందుకిదంతా? 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు... ఈ 40 ఏళ్లుగా తాను పెంచి పోషించిన విష వ్యవస్థను తనకు మద్దతివ్వటానికి ఉపయోగించుకుంటున్నారని తెలియటానికి ఇంకేం కావాలి? తనకు వ్యతిరేకంగా తీర్పునిస్తే న్యాయమూర్తిపై కూడా దారుణంగా దుష్ప్రచారం చేసిన ఈ ఎల్లో ముఠా తన అబద్ధాలతో ఇంకెన్నాళ్లు మనుగడ సాగించగలదు?.

సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ భార్య కిరణ్మయి మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ సతీమణి కిరణ్మయి (46) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో కిరణ్మయి బాధపడుతున్నారు. ఆమెకు ఆరోగ్యం బాగోకపోవడంతో నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాహుల్, కిరణ్మయి దంపతులకు ఇద్దరు కుమార్తెలు.

పోలీసు యంత్రాంగం తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటోంది

- స్థితిగతులు తెలుసుకుని వాస్తవాలను ప్రచురించండి
- జైళ్లశాఖ డీఐజీ రవికిరణ్, తూర్పు గోదావరి ఎస్పీ పి.జగదీష్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు యంత్రాంగం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని, స్థితిగతులు తెలుసుకుని రాయాలని, అవాస్తవాలను ప్రచురించవద్దని కోస్తా, ఆంధ్ర రీజియన్ జైళ్లశాఖ డీఐజీ రవికిరణ్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీష్ చెప్పారు. సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ భార్య కిరణ్మయి అనారోగ్యంతో మృతి చెందడంతో డీఐజీ రవికిరణ్, ఎస్పీ జగదీష్ శుక్రవారం హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి సూపరింటెండెంట్‌ను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు వార్తాపత్రికల్లో జైలు సూపరింటెండెంట్ రాహుల్ సెలవుపై వెళ్లిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తపరుస్తూ వార్తలు వచ్చాయన్నారు. ఆయన సతీమణి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఈ నెల 14న ఉదయం 6గంటలకు ఆసుపత్రిలో చేర్చారన్నారు. ఆమెను చూసుకునేందుకు రాహుల్ రెండు రోజులు సెలవుపై వెళ్లారన్నారు. దీనికి ఈ ఒక్క కారణమే తప్ప మరేకారణం లేదన్నారు. రాహుల్ భయపడి వెళ్లిపోయారు, అధికారులు బలవంతంగా పంపించారు అనేవి పూర్తిగా అవాస్తవాలన్నారు.

విధ్వంసానికి భారీ కుట్ర

సాక్షి, అమరావతి: స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతకైనా బరితెగిస్తామని టీడీపీ మరోసారి రుజువు చేసింది. విద్యార్థులు, యువతను పావులుగా వాడుకుని రాష్ట్రవ్యాప్తంగా అలజడులు సృష్టించేందుకు పథకం రూపొందించింది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో ప్రజాధనం లూటీకి పాల్పడ్డ మాజీ సీఎం చంద్రబాబు అరెస్టయ్యి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. తమ అవినీతి బండారం బట్టబయలు కావడంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు టీడీపీ విధ్వంస కాండకు సిద్ధపడుతోంది. ఆ కుట్రను పక్కాగా అమలు చేసేందుకు సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటోంది. రానున్న రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలో అతి పెద్ద హింసాత్మక సంఘటన ఏదైనా జరగాలని టీడీపీ భావిస్తోంది. రాష్ట్రంలో విధ్వంసానికి పాల్పడి శాంతిభద్రతల సమస్య సృష్టించాలని పన్నాగం పన్నింది.

జాతీయ రహదారులు వేదికగా..

ప్రధానంగా జాతీయ రహదారులపై విధ్వంసం సృష్టించాలని టీడీపీ తమ పార్టీ నేతలకు ఆదేశాలు పంపింది. జాతీయ రహదారులను దిగ్బంధించి వాహనాలపై దాడులకు తెగబడటంతోపాటు దుకాణాలు, హోటళ్లు, దాబాల్లో విధ్వంసం సృష్టించాలన్నది పన్నాగం. చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై విధ్వంసం సృష్టించాలని పేర్కొంటూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల టీడీపీ శ్రేణులకు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసింది. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారితోపాటు కడప, అనంతపురం నుంచి బెంగళూరు వెళ్లే రహదారి, కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్లే రహదారులపై దాడులకు తెగబడాలని అల్లరి మూకలను పురిగొల్పింది. సామాన్యులపై దాడులు చేసి అల్లకల్లోలం సృష్టించాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. తద్వారా పోలీసులు అనివార్యంగా లాఠీచార్జీ చేయాల్సిన పరిస్థితి సృష్టించి వీలైతే పోలీసు కాల్పుల వరకు పరిస్థితిని తీసుకెళ్లాలని పథకం వేసింది. జాతీయ రహదారులు, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ స్తంభించిపోతే దేశవ్యాప్తంగా మీడియాలో చర్చకు తెరతీసి రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయాలని పన్నాగం పన్నింది.

సోషల్ మీడియా సాధనం..

ప్రధానంగా సోషల్ మీడియా వేదికల ద్వారా రెండు రోజులుగా యువత, విద్యార్థులను టీడీపీ రెచ్చగొడుతోంది. ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు స్వయంగా ఇంజనీరింగ్, ఇతర కాలేజీలకు వెళ్లి విద్యార్థులను రెచ్చగొడుతుండటం గమనార్హం. చంద్రబాబుకు మద్దతుగా సంఘీభావ ర్యాలీకి తరలి రావాలని విద్యార్థులను కోరారు. ర్యాలీ, ఫ్లాష్ మాబ్... అంటూ విద్యార్థులు, యువతను సమీకరించేందుకు సోషల్ మీడియాను సాధనంగా చేసుకున్నారు. అందరూ జాతీయ రహదారులపైకి రావాలని అందులో నిర్దేశించడం గమనార్హం. ఒకసారి జాతీయ రహదారులపైకి చేరుకున్నాక టీడీపీ రౌడీలు, గూండాలు, అల్లరి మూకలంతా విద్యార్థుల్లో కలసిపోయి విధ్వంసానికి పాల్పడాలన్నది పన్నాగం. విజయవాడ, విశాఖతో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులను భారీగా తరలించేందుకు యత్నించారు. అందుకోసం వివిధ జిల్లా కేంద్రాలకు శుక్రవారం ఉదయం నుంచి శనివారం సాయంత్రం వరకు వేర్వేరు సమయాలను కేటాయించడం గమనార్హం. అంటే ఒకచోట విధ్వంసానికి పాల్పడిన కొద్దిసేపటికే మరో జిల్లా కేంద్రానికి చేరుకుని రాష్ట్రం అంతా అల్లకల్లోలం సృష్టించాలన్నది టీడీపీ కుయుక్తి.

అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం..

టీడీపీ పన్నాగాన్ని గుర్తించిన నిఘా వర్గాలు పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాయి. శుక్రవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో అన్ని జిల్లాల్లో పోలీసు ఉన్నతాధికారులు ఇంజనీరింగ్, ఇతర కాలేజీలను సందర్శించి ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లతో చర్చించారు. అల్లర్ల కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్ దెబ్బతింటుందని విద్యార్థులకు కౌన్సెలింగ్ చేశారు. కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు దక్కపోవడంతోపాటు పాస్‌పోర్ట్, వీసా జారీకి అడ్డంకులు తప్పవని స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ ఫోన్ నంబర్లు తీసుకుని వాట్సాప్ సందేశాలు కూడా పంపారు. తాము విధ్వంసకర కార్యక్రమాలకు దూరంగా ఉంటామని విద్యార్థులు చెప్పడంతో మధ్యాహ్నం నుంచి వారిని ఇళ్లకు పంపించారు. కుట్రకు నేతృత్వం వహిస్తున్న టీడీపీ నేతలను నిర్బంధంలో ఉంచారు. పోలీసుల అప్రమత్తంగా వ్యవహరించి రాష్ట్రంలో శుక్రవారం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టడి చేయగలిగారు.

ఢిల్లీలో లోకేశ్ అగచాట్లు

- బీజేపీ జాతీయ నేతలను కలిసేందుకు ప్రయత్నిస్తున్నా స్పందన కరువు
- జాతీయ మీడియాతో మాట్లాడదామన్నా అదే పరిస్థితి
- బాబుకు బెయిల్‌పై సుప్రీంకోర్టు న్యాయవాదులతో మంతనాలు



సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయిన తన తండ్రి, టీడీపీ అధినేత చంద్రబాబుకు జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టేందుకు నారా లోకేశ్ నానాఅగచాట్లు పడుతున్నారు. బీజేపీ జాతీయ నేతలను కలవాలని భావించినప్పటికీ శుక్రవారం ఆయనకు అపాయింట్‌మెంట్‌లేవీ లభించలేదు. పార్టీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్, మరో ఎంపీ రామ్మోహన్‌నాయుడు సహా పార్టీ సీనియర్ నేత కంభంపాటి రామ్మోహన్‌రావు స్వయంగా రంగంలోకి దిగి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సహా ఒకరిద్దరి అపాయింట్‌మెంట్‌లు కోరినప్పటికీ వారి నుంచి సానుకూల స్పందన రాలేదు. దీంతో శనివారమైనా బీజేపీ అగ్ర నేతలను కలవాలనే ఉద్దేశంతో ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్నట్లు తెలిసింది. ఇక చంద్రబాబుకు అన్యాయం జరిగిందని, అక్రమంగా అరెస్ట్ చేశారంటూ జాతీయ మీడియాకు చెప్పుకునేందుకు లోకేశ్ ప్రయత్నించినా ఏ మీడియా సంస్థల నుంచి పెద్దగా స్పందన కానరాలేదు. ఒకట్రెండు మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇచ్చినా, అవేవీ శుక్రవారం ప్రసారం కాలేదు. ఇదే సమయంలో బాబుకు బెయిల్ విషయంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతోనూ లోకేశ్ చర్చలు చేస్తున్నారు. వచ్చే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై ఆయన ఎంపీలతో శనివారం పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

అన్యాయంగా బాబు అరెస్ట్: లోకేశ్

ఏఎన్‌ఐ న్యూస్ ఏజెన్సీతో మాట్లాడిన లోకేశ్, తన తండ్రిని అన్యాయంగా ప్రభుత్వం అరెస్ట్ చేసిందని ఆరోపించారు. ఈ విషయం జాతీయ స్థాయిలో తెలియజేసేందుకే ఢిల్లీ వచ్చినట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఎలాంటి స్కామ్ జరగలేదని, బాబుపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. ఈ విషయంలో చివరికి న్యాయమే గెలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకే జనసేన, టీడీపీ కలిసి పనిచేయాలని నిర్ణయించాయని తెలిపారు.

చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు మెమో

- అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లినందుకు జారీ
- 'స్కిల్' కుంభకోణంలో పాత్రధారి శ్రీనివాస్ సీఐడీ నోటీసులు అందగానే అమెరికాకు పరారీ
- వారంలో వచ్చి సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించిన ప్రణాళిక శాఖ

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో కీలక పాత్రధారిగా ఉన్న చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాసరావుపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్ర ప్రణాళిక శాఖలో అసిస్టెంట్ సెక్రటరీ హోదాలో ఉన్న ఆయన ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి పొందకుండా అమెరికాకు పరారయ్యారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ప్రణాళిక శాఖ ఆయనకు మెమో జారీచేసింది. ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకే చంద్రబాబు ఆదేశాలతో ఆయన అమెరికాకు పరారైన విషయం తెలిసిందే. ఎందుకంటే షెల్ కంపెనీల ద్వారా తరలించిన రూ.371 కోట్లలో రూ.241 కోట్లను హవాలా మార్గంలో చంద్రబాబుకు చేర్చడంలో పెండ్యాల శ్రీనివాసరావు పాత్రధారిగా ఉన్నారని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. దీంతో ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈ నెల 14న విజయవాడలో సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని పెండ్యాల శ్రీనివాసరావుకు ఐదో తేదీన సీఐడీ నోటీసులు జారీచేసింది. నోటీసులను ఆయనకు ఉన్న రెండు ఈ మెయిల్ ఐడీలకు మెయిల్‌చేయడంతోపాటు హైదరాబాద్‌లోని ఆయన చిరునామాకు స్పీడ్‌పోస్ట్ ద్వారా పంపారు. నోటీసులు అందినట్లు ఆయన కుమార్తె సీఐడీ అధికారులకు తెలిపారు. ఈ నోటీసులు అందడంతో ఆయన హుటాహుటిన అమెరికాకు పరారయ్యారు. వ్యక్తిగత పనుల మీద ఈ నెల 11 నుంచి 29 వరకు అమెరికాలో పర్యటించేందుకు ఆయన ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయన దరఖాస్తును ఉన్నతాధికారులు ఇంకా ఆమోదించలేదు. ఇంతలో సీఐడీ నోటీసులు రావడంతో ఆయన అనుమతి లేకుండానే అమెరికాకు పరారయ్యారు. ఈ నెల 11న అమెరికా వెళ్లాలని భావించినప్పటికీ తనకు హఠాత్తుగా ఆరోగ్యం దెబ్బతినడంతో అత్యవసర చికిత్స కోసం ఈ నెల ఆరో తేదీనే వెళ్తున్నట్టు ఆయన ప్రణాళిక శాఖకు ఓ మెయిల్ ద్వారా తెలిపి వెళ్లిపోయారు. దీన్ని ప్రణాళిక శాఖ తీవ్రంగా పరిగణించింది. పెండాల్య శ్రీనివాసరావు సెలవు దరఖాస్తును తిరస్కరించడం పాటు ఆయనకు మెమో జారీచేసింది. ప్రణాళిక శాఖ అధికారులు శుక్రవారం హైదరాబాద్‌లోని పెండ్యాల శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి ఆయన తండ్రికి మెమో కాపీని అందించారు. మెమో అందుకున్నప్పటి నుంచి వారం రోజుల్లో పెండ్యాల శ్రీనివాసరావు ఆఫీసుకు వచ్చి సంజాయిషీ ఇవ్వాలని ప్రణాళిక శాఖ ఆదేశించింది.

> ఎప్పుడు నీ బుద్ధి మోహమనే బురదను అధిగమిస్తుందో,
> అప్పుడు వినదగిన, వినిన విషయాల నుండి విముక్తుడివి అవుతావు.
> – హైందవ ధర్మం

సాక్షి

శనివారం, 16 సెప్టెంబర్ 2023

కశ్మీర్ మళ్లీ మొదటికి?!

అడపా దడపా జరిగే ఘటనలు మినహా దాదాపు ప్రశాంతంగా ఉన్నట్టు కనబడిన కశ్మీర్‌పై ఉగ్రవాదులు పంజా విసిరారు. ఒక ఎన్‌కౌంటర్ సందర్భంగా అనంతనాగ్ జిల్లాలో బుధవారం సైనికాధికారులు కల్నల్ మన్‌ప్రీత్ సింగ్, మేజర్ ఆషిష్, డీఎస్పీ హుమాయిన్ ముజామిల్ భట్ ఉగ్రవాదుల తుపాకి గుళ్లకు నేలకొరగడం... అదే ప్రాంతంలో శుక్రవారం మరో ఆర్మీ జవాన్ మిలిటెంట్ల చేతుల్లో ప్రాణాలు కోల్పోవటం అక్కడి తాజా పరిస్థితికి అద్దం పడుతోంది. దట్టంగా అడవులు, కొండలు ఉండే ప్రాంతాలను ఎంచుకుని భద్రతా బలగాలపై దాడికి తెగబడటం ఇటీవలికాలంలో మిలిటెంట్లు అనుసరిస్తున్న వ్యూహం. గత నెలలో ముగ్గురు ఆర్మీ జవాన్లను హతమార్చిన ప్రాంతం కుల్గామ్ కూడా దట్టమైన అటవీ ప్రాంతమే. కొండలు. కోనలు ఉండే అటవీప్రాంతంపై సమగ్ర అవగాహన ఉంటే తప్ప సైన్యం మిలిటెంట్లను తిప్పికొట్టడం సాధ్యం కాదు. తమకు బాగా పట్టున్న ఇలాంటి ప్రాంతాల్లో వారానికి సరిపడా ఆహారం, మందుగుండు సిద్ధం చేసుకుని ఒక పద్ధతి ప్రకారం మిలిటెంట్లు సైన్యాన్ని తామున్నచోటకు రప్పిస్తున్నారు. కొండలపై మాటుగాసి తమవైపు వస్తున్న బలగాలపై కాల్పులు జరపటం మిలిటెంట్లకు సులభమవుతోంది. ఎత్తయిన ప్రాంతంలో ఉండటం వల్ల భద్రతా బలగాలకు బాసటగా వచ్చే హెలికాప్టర్లపై సునాయాసంగా దాడులు చేయగలుగుతున్నారు. పైగా మిలిటెంట్ల ఫోన్ సంభాషణలను వినటం, వారి ఆనుపానులు ఎక్కడ వున్నాయో కచ్చితంగా అంచనా వేయటంలాంటి అంశాల్లో సైన్యం విఫలమవుతోంది. మైదాన ప్రాంతాల్లో గతంతో పోలిస్తే పరిస్థితి మెరుగుపడింది. అక్కడ భద్రతా బలగాలకు సమాచార వ్యవస్థ పటిష్టంగా ఉండటంతో మిలిటెంట్ల ఆటలు సాగడం లేదు.

ఉగ్రవాద దాడులు పెరగటం వెనక ఎప్పటిలాగే పాకిస్తాన్ హస్తం ఉండటం బాహాటంగా కనబడుతోంది. వాస్తవానికి పాక్ ఆర్థికంగా దివాలా తీసి, ఇప్పట్లో కోలుకునే అవకాశం లేని స్థాయికి చేరుకుంది. రాజకీయంగా సరేసరి. ఇమ్రాన్ ఖాన్‌ను గద్దెదించిన నాటినుంచీ సైన్యంపై సాధారణ ప్రజానీకంలో ప్రతికూలత పెరిగింది. మరోపక్క ఉగ్రవాదులకు నిధులు అందజేయటానికి తోడ్పడే సంస్థలనూ, దేశాలనూ నిరోధించేందుకు అంతర్జాతీయంగా ఏర్పాటైన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ పాకిస్తాన్‌పై నిఘా ఉంచింది. అయినా సరే అది తన వెనకటి గుణాన్ని వదులుకోవటానికి సిద్ధపడటం లేదని కశ్మీర్ తాజా పరిణామాలు చెబుతున్నాయి. ఇప్పుడు జరిగిన దాడులకు బాధ్యులుగా చెప్పుకున్న ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్) పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబాకు అనుబంధంగా పుట్టుకొచ్చిందని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. యాక్షన్ టాస్క్ ఫోర్స్ సంస్థ ఆంక్షలను అధిగమించటానికి పాకిస్తాన్ ఈ కొత్త ఉగ్ర సంస్థను సృష్టించిందని సులభంగానే గ్రహించవచ్చు. సరిహద్దులకు ఆవలినుంచే టీఆర్‌ఎఫ్‌కు ఆయుధాలు, డ్రగ్స్ అందుతున్న సంగతి కూడా నిర్ధారణ అవుతోంది. 370వ అధికరణను రద్దుచేసి, జమ్మూ–కశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టి నాలుగేళ్లు కావస్తోంది. అటు తర్వాత కశ్మీర్‌లో పరిస్థితి మెరుగు పడిందని, ఆర్థికంగా కోలుకోవటంతోపాటు భద్రతరీత్యా సురక్షితంగా ఉన్నదని బీజేపీ నేతలు చెబుతూ వచ్చారు. గతంతో పోలిస్తే కశ్మీర్‌కు పర్యాటకుల సంఖ్య పెరిగింది. నగరాలు, పట్టణాల్లో మిలిటెంట్ల ఆటలు సాగటం లేదు. కానీ అంతమాత్రానికే సంతృప్తి పడితే ప్రమాదకర పర్యవసానాలుంటాయని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి.

ఇటీవలి ఎన్‌కౌంటర్లను పరిశీలిస్తే బలగాలకు మార్గదర్శకాలిచ్చి వారిని నడిపించాల్సిన ప్రధాన అధికారులే బలవుతున్న సంగతి అర్థమవుతుంది. దాడులకు సీనియర్ అధికారులు నేతృత్వం వహించాలన్నది ఒకరకంగా మంచి నిర్ణయమే. ఇందువల్ల దాడుల్లో చురుగ్గా పాల్గొనేందుకు కింది స్థాయి జవాన్లు సంసిద్ధులవుతారు. అయితే దానికి తగినట్టుగా మిలిటెంట్లు మాటువేసిన ప్రాంతాన్ని నిర్దిష్టంగా, నిర్దుష్టంగా నిర్ధారించుకోవటానికి అవసరమైన పరికరాలు వారికి అందుబాటులో ఉంచటం అతి ముఖ్యం. తగిన వ్యూహాన్ని రూపొందించటంలో, బలగాల్లో ఆత్మవిశ్వాసం నింపి, వారి నమ్మకాన్ని గెల్చుకోవటంలో సీనియర్‌ల పాత్ర కీలకమైనది. అటువంటి అధికారులను కోల్పోవటం వల్ల భద్రతా బలగాలకు కలిగే నష్టం అంతా ఇంతా కాదు. ఇవన్నీ శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించినవి. వీటికి సమాంతరంగా కశ్మీర్‌లో మళ్లీ రాజకీయ ప్రక్రియ ప్రారంభించటానికి అవసరమైన చర్యలు తీసుకోవటానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవాలి. రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టాక అంతా మెరుగైందని బీజేపీ నేతలు చెబుతున్నా ఉగ్రవాదుల ఆగడాలు క్రమేపీ పెరుగుతున్న సంగతి కాదనలేనిది. పండిట్లపైనా, వలస వచ్చినవారిపైనా మిలిటెంట్ల దాడులు జరుగుతున్నాయని గతంలో కశ్మీర్ సమస్యపై మధ్యవర్తిత్వం వహించిన బృందంలోని సభ్యురాలు రాధాకుమార్ ఇటీవలే గుర్తుచేశారు. కశ్మీర్‌లో నిరుద్యోగిత దేశ సగటుకన్నా మూడు రెట్లు ఎక్కువున్నదని ఆమె అంటున్నారు. ఇప్పుడు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం 2015 నుంచి మిలిటెన్సీకి దూరంగా ఉంది. అక్కడ గత ఏడెనిమిదేళ్లుగా చెప్పుకోదగిన ఘటనలు లేవు. అటువంటిచోట ఉగ్రవాదులు భద్రతా బలగాలపై దాడులు చేయగలిగారంటే ఆలోచించాలి. కశ్మీర్‌లో నిరుడు దాదాపు వందమంది యువకులు ఉగ్రవాద సంస్థల్లో చేరారని, వీరిలో చాలామంది టీఆర్‌ఎఫ్‌వైపు మొగ్గారని గణాంకాలు చెబుతున్నాయి. కనుక ఉగ్రవాదాన్ని నిరోధించటానికి అవసరమైన చర్యలు తీసుకుంటూనే రాజకీయ ప్రక్రియ ప్రారంభించటం, యువతలో నిరుద్యోగితను అరికట్టడం వంటి చర్యలు అవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.పాడ్యమి ఉ.7.54 వరకు తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తర ఉ.7.33 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** సా.4.37 నుండి 6.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.51 నుండి 7.27 వరకు, **అమృతఘడియలు:** రా.3.29 నుండి 4.44 వరకు

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

వారు బాధితులు! 'వర్కర్లు' కాదు!

అభిప్రాయం



రంగనాయకమ్మ

దేహమే బ్రతుకుదెరువుగా వుండే స్త్రీకి 'సెక్సు వర్కరు' అనే కొత్త పేరు మర్యాదగా ఇచ్చామనుకున్నారు సుప్రీంకోర్టువారు. కానీ, అది ఆమెని గతం కన్నా మరింతగా అవమానం చెయ్యడమే అవుతుంది. వ్యభిచారం అనేది, సహజమైన 'పని' కాదు. దానికి 'పని'గా పేరు పెడితే, ఆ స్త్రీ ఆ 'సెక్సు పని'తో, పది రెట్లు నీచపడవలిసిందే. కుట్టూ, నేతా, విద్యా, వైద్యం వగైరా పనులన్నీ సమాజానికి సహజమైనవి. ఇవి ఎన్ని వేల సంవత్సరాలకైనా అనవసరం అవవు. గతిలేక వ్యభిచారాన్నే బ్రతుకుతెరువుగా వున్నవారికి, సహజమైన పనుల ద్వారా సమాజం బ్రతుకుదెరువులు కల్పిస్తే, 'వ్యభిచారం' అనే నీచ 'వృత్తి', ఆ మర్నాటి నించే వుండదు. అది 'పని' కాదు కాబట్టి, మాయం అవుతుంది.

క్రిందటి నెలలో, సుప్రీం కోర్టులో, ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన, 5గురు జడ్జీల ధర్మాసనం, కొన్ని సూచనలు చేసింది. కోర్టు పత్రాలలో లాయర్లు గానీ, తీర్పులలో జడ్జీలు గానీ, స్త్రీలను ప్రస్తావించవలిసినప్పుడు, ఉపయోగించవలిసిన భాష గురించి ఆ సూచనలు. ఆ సూచనలన్నీ కలిపి 30 పేజీల పుస్తకం. ఇప్పుడు కోర్టు పత్రాలలో తరచుగా ఉపయోగిస్తున్న 'సరి కాని' ('ఇన్ కరెక్ట్') మాటల్నీ, వాటికి బదులు ఉపయోగించవలిసిన సరైన ('ప్రిఫర్డ్') మాటల్నీ సూచిస్తూ, ఆ జడ్జీల ధర్మాసనం కొన్ని పద పట్టికలను కూడా ఇచ్చింది.

స్త్రీలను పురుషాధిక్య భావాలతో, స్టీరియో టైప్డ్‌గా చెప్పకూడదని సుప్రీం కోర్టు భావించింది. అది మంచిదే. వారు సూచించిన విషయాల్లో, ఒక్క విషయం గురించి మాత్రమే నేను ప్రత్యేకంగా ఇది రాస్తున్నాను.

'వేశ్య' అనీ, 'వ్యభిచారిణి' అనీ వాడే మాటకి బదులు, 'సెక్స్ వర్కర్' అనే మాటని వాడమని కోర్టు ధర్మాసనం వారు సూచించారు. ఈ సూచన పూర్తిగా తర్కరహితమైనదిగానూ, ఆ స్త్రీల మీద జరిగే పురుష దుర్మార్గాన్ని మరుగుపరిచేదిగానూ వుందని, నా అభిప్రాయం!

'వ్యభిచారిణి' అనే మాటకి బదులు 'సెక్స్ వర్కర్' అనే మాటని 'మంచి సూచనగా' చెప్పడం, ఆ స్త్రీకి తీవ్రమైన అన్యాయమేనని చెప్పడానికి కారణం, వారి బాధల గురించి నాకు ఎంతో కొంత తెలుసు. వ్యభిచార జీవితాల మీద, 54 ఏళ్ళ క్రిందట, నేను ''అంధకారంలో...'' అనే ఒక నవలనూ, గత 20 ఏళ్ళలో 4 వ్యాసాలనూ రాశాను.

అసలు ఒక స్త్రీ వ్యభిచారిణిగా బ్రతకడానికి మొదటి కారణం, ఆమె నిరుపేదతనం. రెండో కారణం, పురుష జనాభాలో అత్యధికులు, పేద స్త్రీలని మోసాలతో ఉపయోగించుకోవడం. వ్యభిచారిణిగా బ్రతికే స్త్రీని, ఆ పేరుతోనే అనడం వల్ల, 'ఆమె నీతిపరురాలు కాదు' అని ఆమెని అవమానించడం అవుతుందనీ; అలాగాక, ఆమెని 'సెక్సు వర్కరు' అంటే, ఇతర కార్మికుల లాగే ఆమె కూడా 'ఒక కార్మికురాలు' అనే అర్థం వల్ల ఆమెకి అవమానం అవదనీ, కోర్టువారు భావించినట్టు అర్థం వస్తోంది.

'వ్యభిచారిణి'కీ, 'సెక్సు వర్కరు'కీ, తేడాలు చూస్తే, రెండో మాటే ఆ స్త్రీని రెట్టింపుగా నీచపరిచే మాట అవుతుందని నా అభిప్రాయం!

'సెక్సు వర్కరు' అంటే? 'సెక్సు' అనే మాటకి వేరు వేరు అర్థాలు వున్నా, ఈ సందర్భానికి అయితే, 'కామ సంబంధం' అనే అర్థం. ఇక, 'వర్కరు' అంటే? 'పనిమనిషి' అని అర్థం కదా? 'సెక్సు వర్కరు' అన్నప్పుడు, ఆ మనిషి ఒక 'వర్కరు'!

సమాజంలో, యజమానుల దగ్గిర వేరు వేరు పనులు చేసే వర్కర్లు అందరూ పనిదినంలో, 8–9 గంటల సేపు ఆ పనులు



చేస్తూనే వుంటారు! వర్కర్లు జీతాలు తీసుకుంటారు కాబట్టి అన్ని గంటలూ పనిచేయాలని రూలు.

కామ సంబంధాన్ని 'పని'గా భావిస్తున్నారు సుప్రీం కోర్టు వారు! వ్యభిచారిణులకు అయితే, యజమాని వున్నా, లేకపోయినా 'ఇన్ని పనిగంటలు' అని ఒక హద్దు వుండదు. వారి ఆరోగ్యం నాశనం అవడానికి మాత్రం ఒక హద్దు వుండేదే!

'సెక్సు పనిమనిషి' అంటే, ఆమె డ్యూటీ ఏమిటి? వ్యభిచార వ్యాపారాలు చేయించే ఒక రహస్య కంపెనీలో, మోసపు మాటలతో, ఆ కూపంలో పడిపోయిన ఒక నిరుపేదరాలితో, మురళీధర్ అనే ఒక జర్నలిస్టు చేసిన ఇంటర్వ్యూని చూస్తే, ఆ 'సెక్సు వర్కరు' పురుషుల చేతిలో ఎంతటి క్రూరత్వాన్ని అనుభవించిందో తెలుస్తుంది. ఇందులో అతి ముఖ్యమైన విషయం, 'పని' అంటే, ఎవ్వరైనా, రోజులో కొంత విశ్రాంతి తీసుకున్నా, పనిదినం అంతా పని చెయ్యవలిసిందే. ఈ 'సెక్సు వర్కరు' కూడా, నూటికి నూరుపాళ్ళూ అటువంటి వర్కరే! ఆమె, ప్రతీ గంటా, ప్రతీ అరగంటా వేరు వేరు పురుషుల చేతుల్లో వుండాలి. ఎప్పుడైనా, ఆమె తిరస్కరిస్తే, ఆ మొగమనిషి, 'అదెలాగ? ఇప్పుడే నేను డబ్బు ఇచ్చేసి వచ్చాను. నేను ఈ పని చూసుకుని తొందరగా పోవాలి' అంటాడని, ఆ ఇంటర్వ్యూలోని స్త్రీ చెప్పింది. రోజులో, అన్ని గంటలూ 'పని' చెయ్యాలి కాబట్టి, 10 మంది వచ్చినా, ఇంకా పెరిగినా అలాగే ఈ వర్కరు గడపాలి.

వ్యభిచారమే బ్రతుకుతెరువుగా వున్న స్త్రీ, తనూ, తన బిడ్డలూ బ్రతకడానికే, ఆ మార్గాన్ని గతిలేక ఎంచుకుందే గానీ, ఆమె కామాంధురాలూ కాదు; నీచురాలూ కాదు. ఆ నీచత్వం అంతా సమాజానిదే!

దేహమే బ్రతుకుదెరువుగా వుండే స్త్రీకి 'సెక్సు వర్కరు' అనే కొత్త పేరు మర్యాదగా ఇచ్చామనుకున్నారు కోర్టువారు. కానీ, అది ఆమెని గతం కన్నా మరింతగా అవమానం చెయ్యడమే అవుతుంది. ఎలాగంటే, వ్యభిచారం అనేది, సహజమైన 'పని' కాదు. కానీ, దానికి 'పని'గా పేరు పెడితే, ఆ స్త్రీ ఆ 'సెక్సు పని'తో, పది రెట్లు నీచ పడవలిసిందే.

అసలు, కుట్టూ, నేతా, విద్యా, వైద్యం వగైరా పనులన్నీ సమాజానికి సహజమైనవి. ఇవి ఎన్ని వేల సంవత్సరాలకైనా అనవసరం అవవు. కానీ, గతిలేక వ్యభిచారాన్నే బ్రతుకుతెరువుగా వున్నవారికి, సహజమైన పనుల ద్వారా సమాజం బ్రతుకుదెరువులు కల్పిస్తే, 'వ్యభిచారం' అనే నీచ 'వృత్తి', ఆ మర్నాటి నించే వుండదు. పోతుంది. అది 'పని' కాదు కాబట్టి, మాయం అవుతుంది.

'సెక్సు వర్కరు' అనే మాటని, ఒక మంచి సంస్కరణగా, గతంలో బూర్జువా స్త్రీ వాదులు కూడా భావించారు. కానీ, కామ సంబంధం అనేది, శరీర ధర్మం అయినా, అది 'సెక్సు వర్కరు' సంబంధంగా పేరు తెచ్చుకుంటే, 'సెక్సు వర్కరు' పేరుతో, ఆ స్త్రీ, కార్మికురాలు అవుతుందని బూర్జువా స్త్రీ సంస్కర్తలు భావించి, దాని కోసం 1997లో ఒక మేనిఫెస్టోని కూడా విడుదల చేశారు, అదేదో గొప్ప సంస్కరణ లాగ!

ఇప్పుడు, సుప్రీం కోర్టు కూడా ఇదే రకంగా, అవే పదాల్ని వాడమంటున్నది. 2022లో, సుప్రీం కోర్టు ఇచ్చిన ఒక తీర్పు కూడా, వ్యభిచారాన్ని ఒక 'వృత్తి'గా గుర్తించాలనే తీర్పు ఇచ్చింది. అదే దృష్టితో, ఇప్పుడు 'వేశ్య', 'వ్యభిచారిణి' అనే పదాలకు బదులు 'సెక్సు వర్కర్' అనే పదాన్ని వాడమని సుప్రీం కోర్టువారు సూచించారు. ఇది అన్యాయం. ఆమెను 'సెక్స్ విక్టిమ్' ('బలాత్కార బాధితురాలు') అనో, ఇంకేదైనా సరైన మాటతోనో ప్రస్తావించడం న్యాయం.

సుప్రీం కోర్టు ధర్మాసనం మరోసారి ఈ విషయమై ఆలోచించాలి. లేకపోతే, ఈ రహస్య వ్యభిచారాన్ని బహిరంగ వ్యాపారంగా నిర్వహించే వారే అభివృద్ధి చెందుతూ, పేద స్త్రీలను నిరంతరం పీడనలోకి దింపుతూ వుంటారు.

మానవ సమాజంలో, ఆకలి కన్నా, అధిక చాకిరీ కన్నా, నిరుద్యోగం కన్నా, కులమతాల కన్నా, వైద్యం చేయించుకోలేని ప్రాణాంతక వ్యాధులకన్నా, అన్ని రకాల దురంతాల కన్నా, అతి క్రూరమైన, అతి నీచమైన దురంతం వ్యభిచారం! సమాజం ఈ సమస్యని పరిష్కరించడానికి, ఈ పీడితుల్ని రక్షించే పని తక్షణమే జరగాలి.

''వ్యభిచారానికి మూలం ప్రైవేటు ఆస్తిలో వుంది కనుక, ప్రైవేటు ఆస్తి రద్దుతో పాటు అది కూడా రద్దవుతుంది''(–ఎంగెల్స్) అనే విషయాన్ని పట్టించుకోకుండా, ఒక నీచమైన సంబంధానికి ఎంతటి కొత్త కొత్త నాజూకు పేర్లుపెట్టినా, అది ఆ స్త్రీలకి విముక్తి అవదు.

వ్యాసకర్త ప్రసిద్ధ రచయిత్రి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

బాధితుడు



మీకు తెలుసా? కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఇస్లామీయ హింసకు బాధితుడు. ఆయనకు ఏడేళ్లున్నప్పుడు (1948) ఆ గూండాలు ఆయన తల్లినీ, సోదరినీ సజీవంగా కాల్చేశారు.

– తేజిందర్ పాల్ సింగ్ బగ్గా, బీజేపీ యువ నాయకుడు

అంతా రివర్సు



ప్రజాస్వామ్యం= ప్రతిపక్షానికీ, మీడియాకూ అధికారపక్షం జవాబు దారీగా ఉండే చోటు. ప్రజాస్వామ్య తల్లి = అధికార పక్షాన్ని సమర్థించే మీడియాకు ప్రతిపక్షం జవాబుదారీగా ఉండే చోటు.

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

ఎప్పుడో మొదలైంది!



ఇండియా ఇప్పుడే టీకాలను ఉత్పత్తి చేస్తున్నట్టుగా కొందరు మాట్లాడుతున్నారు. ఇండియా ఎప్పుడూ టీకాల ఉత్పత్తిలో కేంద్రస్థానంలోనే ఉంది. యాంటీ–రేబిస్ టీకాను 1907లో, బీసీజీ టీకాను 1949లో, ఇన్‌ఫ్లుయెంజా టీకాను 1957లో, పోలియో టీకాను 1970లో, టైఫాయిడ్ టీకాను 1978లో, హెపటైటిస్–బి టీకాను 1997లో, మెనింజైటిస్ టీకాను 2010లో ఇండియా అభివృద్ధి చేసింది.

– అద్వైద్, హిస్టారియన్

వాళ్లను కదా అడగాలి?



జీవిక కోసం పనిచేస్తున్న జర్నలిస్టుల కంటే, వారు పనిచేస్తున్న యజమానుల మీద ఎందుకు ప్రతిపక్ష కూటమి 'ఇండియా' దాడిచేయదు? ఆ యజమానుల డబ్బుల మీద కూటమి ఆధారపడి ఉందా? (కొంత మందిని ఇండియా కూటమి బాయ్‌కాట్ చేసిందన్న వార్త నేపథ్యంలో.)

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

హీరో



నా 'టీకా స్థితి' కారణంగా 2021లో నన్ను ఒక సినిమా నుంచి తొలగించారు. అప్పుడు నేను ఆ విషయం బహిరంగంగా చెప్పలేదు. కానీ తన హక్కుల కోసం నిలబడి, దానికోసం ఏ మూల్యానికైనా సిద్ధపడిన (టెన్నిస్ క్రీడాకారుడు నొవాక్) జొకోవిచ్‌ను ఆరాధిస్తున్నాను. రికార్డులు, డబ్బుల కంటే జీవితంలో కొన్ని ముఖ్యమైన విషయాలుంటాయి.

– రాబ్ ష్నైడర్, హాలీవుడ్ నటుడు

దేన్ని ఆపడానికి?



ప్రపంచంలో ఇంకే దేశానికన్నా ఎక్కువగా ఇంటర్నెట్‌ను స్తంభింపజేస్తున్నది ఇండియానే. గతేడాది, యుద్ధంతో ఛిద్రమైన ఉక్రెయిన్ కన్నా(22), సుమారు మూడింతల సార్లు ఎక్కువగా(84) ఇండియా ఇంటర్నెట్‌ను షట్‌డౌన్ చేసింది.

– సదానంద్ ధూమే, కాలమిస్ట్

ఆ లెక్కలో జాతీయం



నేను బడిలో కేవలం రెండేళ్లపాటే (6, 7 తరగతుల్లో), అది కూడా 'థర్డ్ లాంగ్వేజ్'గా హిందీ చదివాను. రాజకీయాలను పక్కనపెడితే, దేశంలో అత్యంత ఉపయోకరమైన భాష హిందీ అని గట్టిగా చెప్పగలను. నా ప్రయాణాల్లో నాకొచ్చిన ప్రాథమిక హిందీనే నేను 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉపయోగించాను. హిందీ నేర్చుకోండి. అది చాలా ఉపయుక్తం.

– కిరణ్ కుమార్ ఎస్., సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

సంగీత కళాసాగరులు

ఆ స్వరం వింటే రాళ్ళు కూడా కరుగుతాయంటారు. సంగీతాన్ని నాదోపాసనగా భావించిన వ్యక్తి ఆయన. సంప్రదాయ కుటుంబంలో పుట్టి సంగీత ప్రపంచాన్ని శాసించిన వ్యక్తి ఆయన. బహుభాషావేత్త, వాగ్గేయకారుడు, సంగీత సాహిత్య కళానిధి, హరికథా చూడామణి, ఉత్తమ వాగ్గేయకారుడు, శిష్యులు ప్రేమతో ఎన్‌సీహెచ్ అని పిలుచుకొనే నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో 1923 సెప్టెంబర్ 15న జన్మించారు. తల్లి వేంకటరమణమ్మ, తండ్రి జగన్నాథ తిరువెంకటాచార్యులు. బాల్యంలో తండ్రి వద్ద తర్క మీమాంసాలను అధ్యయనం చేశారు. పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వద్ద సంగీత పాఠాలను ప్రారంభించారు. గురువు ఆశీర్వాద బలంతో సంగీతంలో పూర్తి స్థాయి కళాకారుడై దేశ విదేశాలలో కచేరీలు చేసే స్థాయికి చేరుకున్నారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో నిలయ విద్వాంసులుగా 1948లో జీవితం ప్రారంభించి, 1983 వరకు అక్కడే వయోలిన్ విద్వాంసునిగా పనిచేశారు. గాత్ర సంగీతంలోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. వందలాది మందికి గురుకుల పద్ధతిలో సంగీతంలో శిక్షణ నిచ్చారు.



నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు

కృష్ణమాచార్యులు వాగ్గేయకారుడు. కృతులను రచించారు. గోదాస్తుతి, బిడాల మోక్షం, పరకాల విలాసం, త్యాగరాజ అష్టోత్తరం, నారాయణ శతకం, ప్రాచీన భగద్గీత పరామర్శము తదితర తెలుగు గ్రంథాలు రాశారు. సంస్కృతంలో రామాయణ కథాయాంవ్యపదేశా, మృత సంజీవం, శఠగోప చరితం, నౌకా చరితం తదితర గ్రంథాలను రచించారు. 2006 ఆగస్ట్ 24న శ్రీరామ సన్నిధి చేరుకున్నారు.

బెజవాడ సంగీత మూర్తి త్రయం మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, అన్నవరపు రామస్వామి, ఎన్‌సీహెచ్ కృష్ణమాచార్యులు – వీరు ముగ్గురూ ఒకే గురువు 'గాయక సార్వభౌమ' పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వద్ద సంగీతంలో శిక్షణ తీసుకున్నారు. ఎవరి బాణీ వారిదే, ప్రతిభలో ముగ్గురికీ సాటిలేదు. ముగ్గురికీ విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఆశ్రయమివ్వడం విశేషం. తెలుగు వారి కీర్తి పతాకను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయులు వారు. ఎన్‌సీహెచ్ కృష్ణమాచార్యుల శత జయంతి సందర్భంగా నేటి నుంచి ఐదు రోజులపాటు విజయవాడలోని శివరామకృష్ణ క్షేత్రంలో సంగీత ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

– మణిమేఖల । 63034 59519

(వయోలిన్ విద్వాంసుడు ఎన్‌సీహెచ్ కృష్ణమాచార్యుల శతజయంతి)

బాబు కథ కంచికి చేరేనా?

అభిప్రాయం



డా॥ పూనూరు గౌతమ్ రెడ్డి

మనం చేసిన పనులే మన డెస్టినీని నిర్ణయిస్తాయి. ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండదు. తప్పని తెలిసీ మనసును జోకొట్టి, ముసుగేసి, కళ్లుగప్పి బరితెగించిన పనులైతే అంతే స్థాయిలో ప్రతిఫలం ఉంటుంది మరి! ఈ సూత్రం ఇప్పుడు మరోసారి వ్యక్తమైంది... అదీ చంద్రబాబు రూపంలో!

అప్పట్లో చంద్ర బాబు నైజం గుర్తించిన వైఎస్ స్వయంగా అసెంబ్లీలో మాట్లాడుతూ 'అసలు తల్లి కడుపులో నుంచి ఎందుకు బయటపడ్డానా అని విలపించే రోజు వస్తుంది చంద్రబాబూ' అని 2007 లోనే హెచ్చరించారు. ఈ మాటలు పెనుదుమారం లేపాయి. మేధావులని ముద్రపడిన వాళ్లంతా వైఎస్‌పై ఇంతెత్తున లేచారు. మరిప్పుడు ఏమైంది? చెప్పొచ్చేది ఏమంటే పైకి కనిపించేవీ, ప్రచారంలో ఉన్నవీ నిజం కావచ్చూ కాకపోనూవచ్చు! చంద్రబాబు ప్రతిపనిలో ముందు చూసేది స్వప్రయోజనమేననీ, చంద్ర బాబు ఇందులో ఆరితేరారనీ మొదటినుంచీ విమర్శలు ఉన్నాయి. అయితే ఆయన చేసుకున్న ప్రచార ఆర్భాటంలో అవి వినిపించలేదు. సరే! కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కిందుమీదులు అవుతుంటుంది. ఒక్కోసారి చెడు కూడా మంచిలానే భ్రమింపచేస్తుంది! కానీ కాలచక్రం ఆగదు. తిరుగు తుంటుంది. తిరగ మరగలైనప్పుడు ఆ భ్రమ నిజ స్వరూపం సాక్షాత్కారమవుతుంది. ఇప్పుడు అదే జరిగింది! రాజకీయాలను పక్కనబెడితే, స్కిల్డ్ క్రిమినాలజీ నివ్వెరపరుస్తోంది. పెద్దమనిషి ముసుగులో పిల్లల చాకోలెట్లను చప్పరించేసిన వైనం సకల జనులను నిర్ఘాంతపరుస్తోంది! సెక్షన్లు, వాదనలు సరే... నీతి ముందు చేరిన రెండు అక్షరాలు 'అవి' సంగతి ఏమిటన్నదే ఇప్పుడు జనం మదిలో మెదులుతోంది! కడిగితే మెరవడానికి ఇది ముత్యం కాదు. 'అవి' అ... క్షరాలు! ఎప్పటికీ నశించనివి! శాశ్వత అవినీతి ముద్ర! సరే! ఇక ప్రస్తుత రాజకీయ పరిస్థితికి వద్దాం! చంద్రబాబు జైలుకి వెళ్లారు, సానుభూతి వల్ల మాకు ఇంకా అవకాశాలు పెరిగాయని తెలుగు దేశం నేతలు చెప్పుకుంటున్నారు. అవినీతి సర్వ సాధారణ మనీ, విరాళాలు ఏ రూపంలోనైనా సరే చంద్రబాబు తీసు కోలేదని కానీ, అతీతులని కానీ తాము చెప్పడం లేదనీ, పార్టీ అవసరాల కోసం తప్పనిసరి అని కొందరు హృదయం విప్పి మరీ ఒప్పుకుంటున్నారు!

ఇప్పుడు హస్తిన ఏ విధంగా ఆలోచిస్తోందా అని కొందరు విశ్లేషణకు దిగారు! కేంద్ర పెద్దల గ్రీన్ సిగ్నల్ లేకుండా చంద్రబాబును ఎలా అరెస్ట్ చేస్తారన్నది ప్రశ్న! అలాగే చంద్రబాబుతో వారు పొత్తు గురించి ఏమనుకుంటున్నారనేదీ చర్చ. చంద్రబాబు ఏనాడూ నమ్మదగిన మిత్రుడు కాదని హస్తిన నేతల విశ్వాసం! మోదీ విషయంలోనే ఈ భావం రాజుకున్నది. వాజ్‌పేయి హయాంలో మోదీ గుజరాత్ సీఎంగా పదవీచ్యుతుడు కావడం తథ్యమని చంద్రబాబు అప్పట్లో వ్యాఖ్యానించారు. అలాగే, ఎన్డీయే నుంచి బయటకు వచ్చినప్పుడు కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా మోదీ కుటుంబం వరకూ వెళ్లారు! అదే విధంగా, హోంమంత్రి అమిత్‌షా కారుపై రాళ్లు వేయించారు. కమలనాథుల వ్యవహారం తెలిసిన వారెవరూ చంద్రబాబును తిరిగి దగ్గరకు రానిస్తారని అనుకోరు.

ఈ పరిస్థితుల్లో మళ్లీ మరో పొరపాటు చంద్రబాబు చేశారంటున్నారు. తెలంగాణ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే సమయం మించిపోయిందనీ, భాజపాతో పొత్తు సాధ్యం కాదనీ చాలా దర్పంగా చంద్రబాబు ప్రకటించుకున్నారు. తాము ఒంటరిగానే



తెలంగాణలో పోటీ చేస్తామని గొప్పగా చెప్పుకున్నారు. హస్తిన పెద్దలకు కావాల్సింది చంద్రబాబు కాదు, సీట్లు! ఇంత చిన్న లాజిక్‌ను కూడా అంత ఘరానా చంద్రబాబు ఎలా మర్చిపోయారో మరి! 'ఆపరేషన్ ఏపీ' ఎప్పుడో ఖరారయిందని అంటున్నారు. అయితే, అందుకు తగిన సమయం చూసుకుని పని కానిచ్చేశారంతే! మధ్యలో చంద్రబాబు ఆ యా సందర్భాల్లో అమిత్ షానూ, నడ్డానూ కలవడం... ఆ యా ఫొటోలను లీక్ చేయడం అంతా కావాలనే! చంద్రబాబుకు ఏమాత్రం అనుమానం లేకుండా ఆపరేషన్ నిశ్శబ్దంగా కొనసాగింది!

ఇక ఇప్పుడు జనసేనాని వ్యూహంపైనే అందరి దృష్టి ఉంది! ఆయన ఇప్పటికే చంద్రబాబుకు మద్దతు ప్రకటించారు. ఇది అంతా ఊహించిందే! ముసుగు తొలగింది అంతే! దీనికే తెదేపా నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. కానీ కింది స్థాయిలో పవన్ అభిమానులు ఎంత బాధ పడుతున్నారో అర్థం చేసుకోవడం లేదు! పదేళ్లుగా నమ్ముకుని ఉంటే ఎవరికీ చెప్పకుండా వెళ్లి చంద్రబాబుకు లొంగిపోయారని బాహాటంగానే ఆక్రోశిస్తున్నారు!

పొత్తు పెట్టుకున్నా ఓట్లు ఎలా ట్రాన్స్ఫర్ అవుతాయని అనుకొంటున్నారో మరి! అవన్నీ బాబు వ్యతిరేక ఓట్లన్న ప్రాథమిక సంగతిని మరిచారు. ఇప్పుడు బాబుతోనే పొత్తు పెట్టుకుంటే ఓట్లు ఎలా వేస్తారు? కాని, ఇంతవరకూ భాజపా అగ్రనేతలెవరూ నోరు విప్పలేదు! హస్తిన ఆలోచన వేరేవిధంగా ఉంటే మాత్రం పవన్ మరోసారి ఆలోచించుకోవాల్సి వస్తుంది! ఎందుకంటే ఆయనకు భాజపానే ముఖ్యం మరి! మోదీ అంటే అపారగౌరవం! ఒకవేళ భాజపా చంద్రబాబు అంశంలో ఎటూ తేల్చకుండా ఉంటే, జనసేన ఎటు వెళ్తుంది? యూ టర్న్ తీసుకుంటుందా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న!

చంద్రబాబుపై మరో ఏడెనిమిది పీటీ వారెంట్లు, పదికి పైగా కేసులు వరుసగా ఎదురుచూస్తున్నాయని వార్తలు వెలువడుతున్నాయి. అంటే... అసెంబ్లీ ఎన్నికలు ముగిసేవరకూ చంద్రబాబు బయటకు వచ్చే అవకాశాల్లేవని భావించవచ్చు. బిహార్‌లో లాలూ ప్రసాద్ విషయంలో ఇదే జరిగింది. అలాగే ఆయన పార్టీ కూడా అధికారంలోకి రాలేకపోయింది!

వ్యాసకర్త రాష్ట్ర అధ్యక్షులు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ । 98481 05455

క్లుప్తంగా...

నేటి నుంచి స్వచ్ఛతా ఉత్సవాలు


గంధం చంద్రుడు

సాక్షి, అమరావతి: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో అక్టోబరు 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని స్వచ్ఛాంధ్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నగరాలు, పట్టణాల్లోని ప్రధాన చౌరస్తాలు, ప్రజోపయోగ స్థలాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మున్సిపల్, కార్పొరేషన్, పంచాయతీ కార్యాలయాల పరిసరాల్లో పూర్తి పరిశుభ్రత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం పారిశుధ్య కార్మికులకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని, విద్యార్థులకు క్విజ్, స్వచ్ఛత పరుగు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబర్ 2న సభలు నిర్వహించి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని తీర్మానం చేస్తామన్నారు.

మావోయిస్ట్ మరువపల్లి రాజీ అరెస్ట్



పుట్టపర్తి అర్బన్: మావోయిస్ట్ కీలకనేత మరువపల్లి రాజీని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలను శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం నున్నంవారిపల్లికి చెందిన రాజీ అలియాస్ సరస్వతి 1999 సంవత్సరంలో నక్సలైట్ నాయకుడు ఎస్‌పీ రవూఫ్ ప్రభావంతో రివల్యూషనరీ యూత్ ఫ్రంట్ (ఆర్‌వైఎఫ్)లో చేరారు.తర్వాత మావోయిస్ట్ పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషించారు. ప్రస్తుతం పార్టీ స్పెషల్ జోన్ కమిటీ మెంబర్‌గా పనిచేస్తున్నారు. ఈమె మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, పశ్చిమ కనుమల స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌చార్జ్ సంజోయ్ దీపక్ రావు అలియాస్ విజయ్‌ను 2007లో పెళ్లి చేసుకున్నారు. రాజీపై రూ.20 లక్షల క్యాష్ రివార్డు ఉంది. ఆమెను శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో అరెస్టు చేసిన పోలీసులు శుక్రవారం రిమాండుకు తరలించారు. కాగా రాజీ భర్త, మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్ రావు అలియాస్ విజయ్‌ని సైబరాబాద్ పోలీసులు కూకట్‌పల్లిలో శుక్రవారం అరెస్ట్ చేశారు.

చంద్రబాబు, పవన్ తోడు దొంగలు

- మంత్రి ఆర్కే రోజా ఫైర్



చిలకలపూడి(మచిలీపట్నం)/నగరి(చిత్తూరు జిల్లా): చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తోడు దొంగల్లాంటి వారని, వారి మధ్య పొత్తు ముందే అనుకున్నదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి ఆర్.కె. రోజా అన్నారు. శుక్రవారం మచిలీపట్నంలోని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమె మీడియాతో మాట్లాడారు. స్కాంలో దొరికిన దొంగతో జైలులో ములాఖత్ అయ్యి పొత్తు గురించి ప్రకటించారంటేనే పవన్‌కు ఎంత మొత్తంలో ప్యాకేజీ అందిందో అర్థమవుతోందన్నారు. పవన్‌కళ్యాణ్ తన సినిమాలో 'నాకు తిక్క ఉంది, దానికో లెక్క ఉంది' అంటూ డైలాగ్ చెబుతారని, తిక్క జనసైనికులైతే, లెక్క ప్యాకేజీ అని మంత్రి రోజా అభివర్ణించారు. లోకేశ్, భువనేశ్వరిలకు ధైర్యం ఉంటే ఢిల్లీలో సీబీఐ, ఈడీ కార్యాలయాలకు వెళ్లి.. టీడీపీ హయాంలో ఏ తప్పు జరగలేదని, విచారణకు సిద్ధమని చెప్పాలన్నారు. నారావారిపల్లెలో రెండు ఎకరాల భూమి ఉన్న తండ్రికి పుట్టిన చంద్రబాబు ఇన్ని వేల కోట్ల రూపాయలకు అధిపతి ఎలా అయ్యాడో ప్రజలకు తెలుసన్నారు.

విద్యుత్ రంగం బలోపేతమే లక్ష్యం

ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

సాక్షి, అమరావతి: విద్యుత్ రంగాన్ని సాంకేతికంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ తెలిపారు. భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శుక్రవారం విజయవాడలోని విద్యుత్ సౌధలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థల్లో నూతన సాంకేతికతను ప్రవేశపెట్టడం, విద్యుత్ ఉత్పత్తి, ప్రసార, పంపిణీ వ్యవస్థల్ని బలోపేతం చేయడం వంటి అనేక చర్యలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని వినియోగదారులకు భవిష్యత్‌లోను నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు పూర్తిస్థాయి భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏపీ జెన్‌కో ఎండీ, ట్రాన్స్‌కో జేఎండీ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని చెప్పారు. వారి సహకారంతోనే విద్యుత్ సంస్థలు డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ చేయగలుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ జేఎండీ బి.మల్లారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పూతరేకులు.. వెరీ స్పైసీ గురూ..!



కాకరకాయ, వెల్లుల్లి కారంపొడితో తయారీ

షుగర్ వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక పూతరేకులు

విశాఖలో మార్కెట్లోకి విడుదల చేసిన ఆత్రేయపురం తయారీదారులు

సాక్షి, విశాఖపట్నం: పూతరేకు ఏంటీ... స్పైసీగా ఉండటమేంటి...? విడ్డూరం కాకపోతేనూ...! అని అనుకుంటున్నారా... లేదండీ.... నిజమే.. ఇక నుంచి స్పైసీ పూతరేకులు మార్కెట్‌లో హాట్ హాట్‌గా కనిపించనున్నాయి. ప్రత్యేకంగా మధుమేహ వ్యాధిగ్రస్తుల కోసం కాకరకాయ, వెల్లుల్లి కారంతో పూతరేకులను రూపొందించారు ఆత్రేయపురానికి చెందిన తయారీదారులు. పూతరేకుల తయారీ అనేది ఆత్రేయపురం ప్రజలకు తరతరాలుగా వారసత్వంగా వస్తోంది. తొలినాళ్లలో పంచదారతోనే పూతరేకులు తయారు చేసేవారు. కాలానుగుణంగా మారుతున్న అభిరుచుల మేరకు పూతరేకుల్లోనూ అనేక రకాలు వచ్చేశాయి. బెల్లం, నెయ్యి, డ్రై ఫ్రూట్స్ వంటి వాటితో రకరకాల పూతరేకులు తయారు చేస్తున్నారు. ఇప్పుడు పూతరేకుల తయారీదారులు ట్రెండ్ మార్చారు. స్పైసీ పూతరేకులు సిద్ధం చేశారు. కాకరకాయ, వెల్లుల్లి కారంపొడితో పూతరేకు చుడతారు. డయాబెటిక్‌తో ఉన్నవారికి ఇది ఒక ఔషధంలా పనిచేస్తుంది. ఈ పూతరేకులు తింటే రక్తశుద్ధి, ఇన్సులిన్ సామర్థ్యం పెరిగే అవకాశాలు ఉన్నాయని తయారీదారులు చెబుతున్నారు.

మార్కెట్‌లోకి స్పైసీ బిట్టర్‌గార్డ్, గార్లిక్ పూతరేకులు

ఇన్నాళ్లూ పూతరేకులు తీయని రుచితో నోరూరిస్తూ.. మధుమేహ బాధితులకు మాత్రం శత్రువుగా ఉండేవి. షుగర్ ఫ్రీ పూతరేకులు అందుబాటులోకి వచ్చినా వాటిపై డయాబెటిక్ రోగులు అంతగా ఆసక్తి చూపించలేదు. అందుకే ఇప్పుడు స్వీట్‌ని హాట్‌గా తింటూ... మధుమేహాన్ని కంట్రోల్ చేసుకునేందుకు ఆత్రేయపురం వాసులు తయారుచేసిన కొత్త తరహా పూతరేకులను శుక్రవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఆత్రేయపురానికి చెందిన సర్ ఆర్థర్ కాటన్ పూతరేకుల సహకార సంఘం ప్రతినిధులు తీసుకువచ్చిన స్పైసీ బిట్టర్‌గార్డ్, గార్లిక్ పూతరేకులను దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ శ్రీసుధ మార్కెట్‌లోకి విడుదల చేశారు.


కాకరకాయ, వెల్లుల్లి కారం పొడితో చేసిన పూతరేకులు

ప్రతి ఒక్కరూ ఆస్వాదించేలా..



ఆత్రేయపురం పూతరేకులు అంటే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. మా పూతరేకు ప్రతి ఒక్కరూ ఆస్వాదిస్తూ తినాలన్నదే తయారీదారులందరి కోరిక. పంచదారతో తయారు చేయడం వల్ల తినలేకపోతున్నామంటూ చాలామంది మధుమేహం ఉన్న వారు మా ఊరు వచ్చినప్పుడు చెప్పి బాధపడేవారు. అందుకే భౌగోళిక గుర్తింపు వచ్చిన తర్వాత మంచి రోజు చూసుకుని స్పైసీ పూతరేకులను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాం.

– గాదిరాజు ప్రసాదరాజు, ఆత్రేయపురం

ఎల్‌ఐసీ పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలి

- లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు రణవీర్ శర్మ
- విజయవాడలో నేటి నుంచి మూడు రోజులపాటు జాతీయ మహాసభలు


మాట్లాడుతున్న రణవీర్ శర్మ, గజపతిరావు, మార్కండేయులు తదితరులు

లబ్బీపేట (విజయవాడతూర్పు): ఎల్‌ఐసీ పాలసీలపై జీఎస్టీని రద్దు చేయాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు రణవీర్ శర్మ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఎల్‌ఐసీ ఏజెంట్స్ జాతీయ మహాసభలు శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న మూడు వేల మంది ఏజెంట్లు ఈ సభల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విజయవాడ లబ్బీపేటలోని ఓ హోటల్లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎల్‌ఐసీ సంస్థ అభివృద్ధికి, ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి సంబంధించిన పలు అంశాలపై ఈ జాతీయ మహాసభల్లో చర్చించి భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఎల్‌ఐసీ ఆదాయంలో సింహభాగం ఏజెన్సీల ద్వారానే వస్తోందని, అయితే ఏజెంట్లకు సరిగా రిటర్న్స్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి గజపతిరావు, సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు మార్కండేయులు, ఫెడరేషన్ ప్రతినిధులు కె.బి.ఎస్.శాస్త్రి, ఎస్.రాంబాబు, రవీందర్ రెడ్డి, పద్మనాభుడు, వేణుగోపాల రెడ్డి శ్రీనివాస్ కుమార్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జీతాల పెంపుపై సీఎంకు కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విజ్ఞప్తి మేరకు సమగ్రశిక్షలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల ఉద్యోగులకు పీఆర్సీకి అనుగుణంగా ప్రభుత్వం 23 శాతం జీతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 2019లో జీతాలు పెంచిన కేటగిరీలను మినహాయించి మిగిలిన కేటగిరీలైన ఐఈఆర్టీ, పీటీఐ, సిస్టం అనలిస్ట్, సైట్ ఇంజినీర్స్, డ్రైవర్లకు పీఆర్సీకి అనుగుణంగా వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం 23 శాతం జీతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు ఫెడరేషన్ తరఫున వెంకటరామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

క్షమాపణ చెప్పకపోతే 'ఏబీఎన్' వద్ద ఆందోళనలు

సాక్షి, అమరావతి: రజకులను కించపరిచేలా ఏబీఎన్ చానల్‌లో లైవ్ టెలికాస్ట్ చేయడం దుర్మార్గమని, వేమూరి రాధాకృష్ణ రజకులకు క్షమాపణ చెప్పకపోతే ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ చానల్‌ను బహిష్కరిస్తామని రజక సంఘం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రజక కులాన్ని కించపరిచేలా చాకలి అనే పదంతో పిలవకూడదని రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చిందని, ఇవేమీ పట్టించుకోకుండా ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో రజకులను కించపరిచేలా ప్రసారాలు చేశారని అంజిబాబు మండిపడ్డారు. చంద్రబాబును విడుదల చేయాలని నిర్వహించిన ఆందోళనలో ఒక మహిళ లైవ్‌లో రజకులను కించపరిచేలా 'చాకలి వెధవలు చెబితే మీరు వింటారా' అని సంబోధిస్తూ మాట్లాడితే ఏబీఎన్‌లో టెలికాస్ట్ చేసి తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అడ్వాన్స్ టెక్నాలజీతో ప్రజల ప్రాణాలను కాపాడాలి

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జీ


సదస్సును ప్రారంభిస్తున్న హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జీ, డాక్టర్ గుణశీలన్ రాజన్

గన్నవరం రూరల్: ఓరల్ మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ (దవడ ఎముకల శస్త్ర చికిత్స)లో అడ్వాన్స్ టెక్నాలజీతో ప్రజల ప్రాణాలు రక్షించాలని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జీ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలంలోని చిన అవుటపల్లిలో ఉన్న డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో శుక్రవారం 15వ వార్షిక రాష్ట్రస్థాయి అసోసియేషన్ ఆఫ్ ఓరల్ మ్యాక్సిలో ఫేషియల్ సర్జన్స్ సదస్సును ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రాణాల రక్షణకు ట్రామా కేర్ సెంటర్లు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిందని చెప్పారు. వీటిలో సైతం ఓరల్ మ్యాక్సిలో ఫేషియల్ సర్జన్స్‌ను నియమించాలన్నారు. ఈ రంగంలో మహిళల భాగస్వామ్యం పెరగడం గర్వించాల్సిన విషయమన్నారు. ఏషియన్ అసోసియేషన్ ఆఫ్ ఓరల్ మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ అధ్యక్షుడు డాక్టర్ గుణశీలన్ రాజన్ మాట్లాడుతూ.. అతి చిన్న దేశమైన కొరియా ఇంప్లాంటేషన్స్ ఉత్పత్తిలో ముందుందని తెలిపారు. వారియర్స్ ఆఫ్‌ది ఫేస్ అనే థీమ్‌తో ఈ కాన్ఫరెన్స్‌లో ముఖానికి సంబంధించిన ఆధునాతన శస్త్ర చికిత్సలపై, ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం వచ్చిన నూతన సర్జరీ పద్ధతులపై, ప్రమాదాల్లో ముఖాలకు గాయాలు, నోటి క్యాన్సర్ వంటి వాటికి శస్త్ర చికిత్స, అనాదిగా ఉన్న గ్రహణం మొర్రిని పూర్తిగా నిర్మూలించడంపై నిపుణులు రెండు రోజుల పాటు చర్చిస్తారు. ఏవోఎంఎస్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు ఆర్.మణికందన్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కె.వై.గిరి, ఏవోఎంఎస్ఐ అధ్యక్షుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్.కోటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, ఏవోఎంఎస్ఐ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మహబూబ్ షేక్, రాష్ట్ర మాజీ చైర్మన్ శివనాగేందర్‌రెడ్డి, డాక్టర్ సుధానాగేశ్వరరావు దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.రామోజీరావు, ఏవో వై.మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.

18న కోర్టులకు సెలవు

గుంటూరు లీగల్: వినాయక చవితిని పురస్కరించుకుని ఈ నెల 18న రాష్ట్ర హైకోర్టుతోపాటు ఏపీ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ, మీడియేషన్, ఆర్బిట్రేషన్ సెంటర్, జ్యుడిషియల్ అకాడమీ, జిల్లా కోర్టులు, జిల్లా కోర్టు పరిధిలోని అన్ని న్యాయస్థానాలకు సెలవు ప్రకటిస్తూ ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ డాక్టర్ వై.లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 19న వినాయక చవితి సెలవుగా హైకోర్టు క్యాలెండర్‌లో గతంలో ప్రకటించారు. అయితే రాష్ట్రంలో 18న వినాయక చవితి పండగ జరుపుకుంటున్న నేపథ్యంలో ఆ రోజున సెలవుగా ప్రకటించారు. 19న హైకోర్టు సహా అన్ని కోర్టులు యథావిధిగా విధులు నిర్వర్తించనున్నాయి.

27న వక్ఫ్ బోర్డ్ సభ్యుల ఎన్నికలు

ముస్లిం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల కోటాలో ఇద్దరు సభ్యుల ఎన్నిక

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనసభ, శాసన మండలి సభ్యుల కోటాలో ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డుకు ఇద్దరు సభ్యుల ఎన్నికకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. వివరాలను వక్ఫ్ బోర్డు ఎన్నికల అధికారి, మైనారిటీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ మస్తాన్ వలీ శుక్రవారం విడుదల చేశారు. రాష్ట్రంలోని ముతవల్లీ కోటాలో ఒక సభ్యుడి ఎన్నికకు ఈ నెల 9న పోలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. ముస్లిం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల కోటాలో ఇద్దరు సభ్యుల ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేశారు. అసెంబ్లీలో నలుగురు, మండలిలో ఐదుగురు ముస్లిం సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరి ఓటర్ల జాబితాను ఇప్పటికే ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) కార్యాలయం, అన్ని జిల్లాల మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ల కార్యాలయాల వద్ద ప్రదర్శించారు. అక్కడి సభ్యులు ఈ ఎన్నికల్లో ఇద్దరు సభ్యుల ఎన్నికకు ఓటు వేయాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 22వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 26న నామినేషన్ ఉపసంహరణకు గడువు ఇచ్చారు. 27న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య తాడేపల్లిలోని మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో వక్ఫ్ బోర్డు సభ్యుల ఎన్నికలను నిర్వహిస్తారు.

ప్రకాశం ఎస్పీకి ఫిక్కీ స్మార్ట్ పోలీసింగ్ అవార్డు


మలికా గర్గ్ (ఫైల్)

ఒంగోలు టౌన్: పోలీసు శాఖలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫిక్కీ) అవార్డు-2022కు ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్ ఎంపికయ్యారు. ఈ అవార్డులకు జాతీయ స్థాయిలో గత ఏడాది డిసెంబరులో దరఖాస్తులు ఆహ్వానించగా, 17 రాష్ట్రాల పోలీసు శాఖలకు చెందిన వివిధ విభాగాలు, కేంద్ర ఏజెన్సీల నుంచి 117 ఎంట్రీలు వచ్చాయి. అందులో మన రాష్ట్రంలో ఐదుగురికి అవార్డులు వచ్చాయి. మిస్సింగ్, మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ విభాగంలో ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఢిల్లీలోని ఫిక్కీ ఫెడరేషన్ హౌస్‌లో శుక్రవారం జరిగిన 'హోంలాండ్ సెక్యూరిటీ-2023' కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేశారు.

రాష్ట్రంలోనే తొలిసారి ప్రకాశంలో....

రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రకాశం జిల్లాలో పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన సెల్‌ఫోన్లను గుర్తించి తిరిగి వాటిని అప్పగించేందుకు మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్‌ను ఎస్పీ మలికా గర్గ్ ప్రవేశపెట్టారు. ఒక ప్రత్యేక ప్రొఫార్మాను రూపొందించి ప్రజలకు అందుబాటులో ఉంచారు. దీంతో నవంబర్ 2021 నుంచి ఆగస్టు 2023 వరకు మొత్తం 8,042 ఫిర్యాదులు రాగా, 3,879 మొబైళ్లను రికవరీ చేశారు. 2,391 రికవరీ చేయాల్సి ఉండగా, 1,772 ఫోన్ల ఐఎంఈఐ నంబర్లను గుర్తించారు. ఇప్పుడు రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

కడప పూర్వ మునిసిపల్ కమిషనర్ లవన్నకు జైలు శిక్ష, జరిమానా

కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారన్న హైకోర్టు



సాక్షి, అమరావతి/కడప కార్పొరేషన్ : కోర్టు ధిక్కార కేసులో వైఎస్సార్ కడప జిల్లా పూర్వ మునిసిపల్ కమిషనర్, ప్రస్తుత శ్రీశైల దేవస్థానం ఈవో ఎస్.లవన్నకు హైకోర్టు నెల రోజుల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం తీర్పు వెలువరించారు. ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళ్లేందుకు తీర్పు అమలును మూడు వారాల పాటు నిలుపుదల చేస్తున్నట్టు న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. మునిసిపల్ అధికారులు తన షాపులను, ఇంటిలోని పైభాగాన్ని కూల్చేస్తున్నారంటూ కడప జిల్లా, హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పి.పద్మావతిబాయి హైకోర్టులో 2020లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు, కూల్చివేతల విషయంలో చట్ట ప్రకారం నడుచుకోవాలని అధికారులను ఆదేశించింది. అయితే అధికారులు చట్ట నిబంధనలకు విరుద్ధంగా కూల్చివేశారంటూ పద్మావతి హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో అప్పటి మునిసిపల్ కమిషనర్ లవన్నను ప్రతివాదిగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ సుబ్బారెడ్డి విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి శుక్రవారం తీర్పు వెలువరిస్తూ లవన్న కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని తేల్చారు. ఆస్తి హక్కు ప్రాథమిక హక్కు కాకున్నా.. రాజ్యాంగ హక్కు అని తెలిపారు. కౌంటర్‌లో లవన్న తాను చేసిన పనికి క్షమాపణ కోరలేదని న్యాయమూర్తి ఆక్షేపించారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడం ద్వారా సమాజంలో కోర్టు ప్రతిష్టను దిగజార్చారంటూ పైవిధంగా తీర్పు చెప్పారు.

రైవాడ జలాశయాన్ని సందర్శించిన సాంకేతిక బృందం


ప్రత్యేక బోటులో ప్రయాణిస్తూ సర్వే చేస్తున్న కేంద్ర సాంకేతిక బృందం సభ్యులు

దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా): ఢిల్లీ నుంచి వచ్చిన సాంకేతిక బృందం శుక్రవారం రైవాడ జలాశయాన్ని సందర్శించింది. గౌరవ్ భగత్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యులతో కూడిన ఈ బృందం ప్రత్యేక బోటులో ప్రయాణించి సర్వే నిర్వహించింది. బోటులో అమర్చిన ల్యాప్‌టాప్‌తో పాటు కెమెరాల ఆధారంగా సర్వేను చేపట్టారు. డ్యామ్ రీహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (డ్రిప్)లో రైవాడ జలాశయం పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు రూ.252 కోట్లతో గతంలో సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ)కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదనలు పంపారు. 1990లో వచ్చిన భారీ వరద దృష్ట్యా ఎటువంటి తుపాన్లు సంభవించినా ఎదుర్కొనేలా కొత్త స్పిల్‌వే గేట్లు అమర్చాలని డ్రిప్ పథకంలో ప్రతిపాదించారు. జలాశయం స్థితిగతులపై సమగ్ర సర్వే చేపట్టాలన్న సీడబ్ల్యూసీ ఆదేశాల మేరకు సాంకేతిక అధికారుల బృందం ఇక్కడికి వచ్చింది. అధునాతన సాంకేతికత ఆధారంగా జలాశయంలో ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం, ఎంతమేర పూడిక ఉంది, జలాశయం విస్తీర్ణం, జలాశయం గర్భంలో ఎక్కడైనా నిర్మాణాలు జరిగాయా తదితర అంశాలపై సర్వే చేస్తున్నారు.15 రోజులపాటు ఈ సర్వే జరుగుతుందని, అనంతరం సర్వే రిపోర్టును ఢిల్లీలోని సెంట్రల్ వాటర్ కమిషన్‌కు అందజేస్తామని బృంద సభ్యులు తెలిపారు. వీరికి జలాశయం డీఈ సత్యంనాయుడు, జేఈలు నంద కిశోర్, రవిప్రకాష్ తదితరులు జలాశయ స్థితిగతులను వివరించారు.

వలకు చిక్కిన 'మిలట్రీ మౌస్'



అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం సీలేరు రిజర్వాయర్‌లో శుక్రవారం ఓ మత్స్యకారుని వలకు 24 కిలోల మిలట్రీ మౌస్ రకం చేప చిక్కింది. హిమాలయ పరివాహక ప్రాంతంలో లభించే ఈ చేప సీలేరు, డొంకరాయి జలాశయాల్లో కూడా ఉన్నట్లు జాలర్లు తెలిపారు. ఈ చేపలో 68 శాతం అధిక ప్రొటీన్లు ఉంటాయని ఏయూ జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఆచార్యులు తెలిపారు. దీని జీవ వైవిధ్యం, పోషకాహారం పరంగా ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. ఒమెగా ఫ్యాటీ యాసిడ్స్, ఆరోగ్య విలువలు కలిగిన కొలాజిన్ కూడా చేపలో ఉంటుందని చెప్పారు.

– సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

రాత పరీక్షలకు ఏపీపీఎస్సీ షెడ్యూల్

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో పలు రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు కమిషన్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ శుక్రవారం పేర్కొన్నారు. ఏపీ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు, ఏపీ ఫిషరీస్ సబ్ సర్వీస్‌లో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్, ఏపీ గ్రౌండ్ వాటర్ సబ్ సర్వీస్‌లో టెక్నికల్ అసిస్టెంట్ (జియోఫిజిక్స్) పోస్టులకు ఈ నెల 27న, అక్టోబర్ 3న ఆన్‌లైన్ పరీక్ష (సీబీటీ) నిర్వహించనున్నట్లు తెలిపారు.

సొమ్మసిల్లి పడిపోయిన ఎస్‌ఐ అభ్యర్థి మృతి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో అపశృతి చోటు చేసుకుంది. శుక్రవారం అభ్యర్థులకు 1,600 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ క్రమంలో గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెంకు చెందిన నేలటూరి మోహన్‌కుమార్ (32) పరుగు పోటీలకు హాజరై, పూర్తి చేశారు. అనంతరం వాంతులై, ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. పోలీస్ అధికారులు వెంటనే ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యసేవలు నిమిత్తం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

క్లుప్తంగా...

'నోబెల్' నగదు పురస్కారం భారీగా పెంపు

స్టాక్‌హోమ్: నోబెల్ బహుమతి గ్రహీతలకిచ్చే నగదు మొత్తాన్ని ప్రస్తుతమున్న 1 మిలియన్ క్రోనార్ల(రూ.74.80 లక్షల) నుంచి 11 మిలియన్ క్రోనార్ల (రూ.8.15 కోట్ల)కు పెంచుతున్నట్లు నోబెల్ ఫౌండేషన్ శుక్రవారం ప్రకటించింది. ఇటీవలి కాలంలో స్వీడన్ కరెన్సీ క్రోనార్ విలువ పడిపోవడమే ఇందుకు కారణమని ఒక సంక్షిప్త ప్రకటనలో వివరించింది. అమెరికా డాలర్, యూరోలతో పోలిస్తే క్రోనార్ విలువ ఇంత దిగువకు పడిపోవడం ఇదే మొదటిసారి. స్వీడన్‌లో ద్రవ్యోల్బణం ఆగస్టులో 7.2 శాతంగా ఉంది. నోబెల్ బహుమతులను 1901లో మొదటిసారి ప్రదానం చేసినప్పుడు ఒక్కో కేటగిరీకి 1.50 లక్షల క్రోనార్లు అందజేసింది. అప్పటి నుంచి నోబెల్ ఫౌండేషన్ క్రమంగా ఈ మొత్తాన్ని పెంచుకుంటూ వస్తోంది. ఈ ఏడాది నోబెల్ విజేతలను అక్టోబర్‌లో ప్రకటించనుంది.

ప్రిన్సెస్ డయానా స్వెటర్ ధర రూ. 9.14 కోట్లు

లండన్: దివంగత బ్రిటిష్ యువరాణి డయానా ధరించిన స్వెటర్ ఒకటి వేలంలో రికార్డు స్థాయిలో రూ.9.14 కోట్లు పలికింది. రాజ కుటుంబానికి చెందిన వస్తువుకు అంచనాకు మించి ఇంతటి ధర పలకడం ఇదే మొదటిసారి. ప్రముఖ సోథ్‌బీ సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ ఫ్యాషన్ ఐకాన్ సేల్ వేలంలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు రూ.9,14,58,510కి ఈ స్వెటర్‌ను సొంతం చేసుకున్నారు. గురువారం ఆఖరి రోజు చివరి 15 నిమిషాల వరకు ఈ స్వెటర్‌కు అత్యధికంగా 1.90 లక్షల డాలర్ల వరకు పలికింది. చివరి నిమిషాల్లో ఒక్కసారిగా 11 లక్షల డాలర్లకు బిడ్ వేశారని సోథ్‌బీ తెలిపింది. జనవరిలో సోథ్‌బీ సంస్థ నిర్వహించిన డయానా ధరించిన బాల్ గౌన్ సైతం రూ.5 కోట్లకు పైగా పలకడం గమనార్హం.

యుద్ధ విమానాల ప్లాంట్‌ను సందర్శించిన కిమ్

సియోల్: రష్యా పర్యటనలో ఉన్న ఉత్తర కొరియా పాలకుడు కిమ్ జొంగ్ ఉన్ శుక్రవారం యుద్ధ విమానాల ఫ్యాక్టరీని సందర్శించారు. కొమ్సొమొల్‌స్క్ ఆన్ అముర్‌లోని ఫ్యాక్టరీలో అత్యంత ఆధునిక ఫైటర్ జెట్ ఎస్‌యూ–57ను ఆయన ఆసక్తికరంగా పరిశీలిస్తున్నట్లుగా ఉన్న వీడియోను రష్యా కేబినెట్ విడుదల చేసింది. ఒక ఎస్‌యూ–35 ఫైటర్ జెట్ ల్యాండ్ అయినప్పుడు కిమ్ చప్పట్లు కొడుతున్నట్లుగా ఉంది. కిమ్ సుఖోయ్ ఎస్‌జే–100 ప్యాసింజర్ విమానాల ప్లాంట్‌ను కూడా సందర్శించారని తెలిపింది. కిమ్ వెంట రష్యా ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ ఉన్నారు. బుధవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కిమ్ భేటీ అయ్యారు.



మరో అద్భుతం 'యశోభూమి'

ఢిల్లీలో ప్రపంచ స్థాయి కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్

ఎనిమిది అంతస్తుల్లో కన్వెన్షన్ హాళ్లు, బాల్‌రూమ్, మీటింగ్ రూమ్‌లు

8.9 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన కేంద్ర ప్రభుత్వం

ప్రాచీన కట్టడాలు, దర్శనీయ క్షేత్రాలకు నిలయమైన దేశ రాజధాని ఢిల్లీ కీర్తికిరీటంలో మరో మణిహారం చేరబోతోంది. చూపు తిప్పుకోనివ్వని సుందరమైన, విశాలమైన ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్(ఐఐసీసీ) యశోభూమి ప్రారంభానికి సిద్ధమైంది. దేశంలో సభలు, సమావేశాలు, ఎగ్జిబిషన్ల కోసం ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్న ప్రధానమంత్రి సంకల్పం మేరకు కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోని ద్వారక ప్రాంతంలో యశోభూమిని అత్యాధునిక పరిజ్ఞానం, అద్భుతమైన వసతులతో నిర్మించింది. ప్రధాన ఆడిటోరియం, కన్వెన్షన్ హాళ్లు, బాల్‌రూమ్, మీటింగ్ రూమ్‌లతో యశోభూమి సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్లలో ఒకటిగా నిలువనుంది. ఎనిమిది అంతస్తుల యశోభూమిలో మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్(ఎంఐసీఈ) సదుపాయాలన్నీ ఉన్నాయి. ఐఐసీసీ మొదటి దశను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 17వ తేదీన స్వయంగా ప్రారంభించనున్నారు. అలాగే జాతికి అంకితం ఇస్తారు.

– సాక్షి, నేషనల్ డెస్క్









విశేషాలివీ..

1. యశోభూమి కన్వెన్షన్ సెంటర్ ప్రాజెక్టు ఏరియా 8.9 లక్షల చదరపు మీటర్లు, బిల్ట్–అప్ ఏరియా 1.8 లక్షల చదరపు మీటర్లు. కన్వెన్షన్ సెంటర్‌ను 73,000 చదరపు మీటర్లకుపైగా వైశాల్యంలో నిర్మించారు.
2. మొత్తం ప్రాజెక్టులో ప్రధాన ఆడిటోరియంతో సహా మొత్తం 15 కన్వెన్షన్ హాళ్లు, ఒక బాల్‌రూమ్, 13 మీటింగ్ రూమ్‌లు ఉన్నాయి.
3. అన్ని గదుల్లో కలిపి ఏకకాలంలో 11,000 మంది ఆసీనులు కావొచ్చు.
4. 6,000 మంది అతిథులు సౌకర్యవంతంగా కూర్చునేలా ప్రధాన ఆడిటోరియం(ప్లీనరీ హాల్) నిర్మించారు. ఆటోమేటెడ్ సీటింగ్ సిస్టమ్ ఉంది.
5. అందమైన సీలింగ్‌తో ఆకట్టుకుంటున్న బాల్‌రూమ్ సీటింగ్ సామర్థ్యం 2,500. ఇక్కడే మరో 500 మంది కోసం ఓపెన్ ఏరియా ఉంది.
6. అలాగే 1.07 లక్షల చదరపు మీటర్ల వైశాల్యంలో ఎగ్జిబిషన్ హాళ్లు ఉన్నాయి.
7. మీడియా రూమ్‌లు, వీవీఐపీ గదులు, విజిటర్ ఇన్ఫర్మేషన్ సెంటర్, టికెటింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు.
8. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఇక్కడ వర్షం నీటిని, మురుగు నీటిని శుద్ధి చేసుకొని మళ్లీ ఉపయోగించుకునే ఏర్పాట్లున్నాయి.
9. సౌర విద్యుత్ కోసం రూఫ్‌టాప్ సోలార్ ప్యానళ్లు బిగించారు. ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణంలో భారతీయ సంస్కృతి, కళలకు పెద్దపీట వేశారు.
10. యశోభూమి కన్వెన్షన్ సెంటర్ భారత పరిశ్రమల సమాఖ్యకు చెందిన ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) నుంచి గ్రీన్ సిటీస్ ప్లాటినమ్ సర్టిఫికేషన్ పొందింది.

జాహ్నవికి న్యాయం జరగాల్సిందే

భారత అమెరికన్ చట్ట సభ్యుల డిమాండ్

వాషింగ్టన్: అమెరికాలో పోలీసుల నిర్లక్ష్యంతో జరిగిన కారు ప్రమాదానికి బలైపోవడమే గాక మరణానంతరం కూడా వాళ్ల చేతుల్లో జాత్యహంకార హేళనకు గురైన తెలుగు యువతి జాహ్నవి కందుల ఉదంతాన్ని అక్కడి భారతీయ చట్ట సభ్యులు సీరియస్‌గా తీసుకున్నారు. వాషింగ్టన్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేట్ స్టూడెంట్ అయిన 23 ఏళ్ల జాహ్నవి గత జనవరిలో సియాటిల్‌లో రోడ్డు దాటుతుండగా పోలీసు వాహనం ఢీ కొని మరణించడం తెలిసిందే. 25 మైళ్ల స్పీడ్ లిమిట్ ఉన్న చోట సదరు వాహనం ఏకంగా 74 మైళ్ల వేగంతో దూసుకురావడమే ప్రమాదానికి కారణమని తేలింది. కానీ డేనియల్ ఆడరర్ అనే సియాటెల్ పోలీసు అధికారి ఈ ఉదంతంపై చేసిన అత్యంత అనుచిత వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. 'అయితే ఏమయిందిప్పుడు?! ఆమెకు ఆల్రెడీ 26 ఏళ్లు. అంత విలువైనదేమీ కాదు. ఏ 11 వేల డాలర్లకో ఓ చెక్కు రాసి పారేయండి' అంటూ అతనన్న మాటలు బాడీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. అతనిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి, సియాటిల్ సిటీ కౌన్సిల్ సభ్యురాలు క్షమా సావంత్ తదితరులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అమెరికా పోలీసుల్లో జాత్యహంకారం ఎంతగా జీర్ణించుకుపోయిందో చెప్పేందుకు ఈ ఉదంతం మరో నిదర్శనమని వారన్నారు. డేనియల్‌పై ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం డిమాండ్ చేశారు. 'జాహ్నవి దుర్మరణానికి కారకులైన పోలీసులే ఆమె జీవితం విలువే లేనిదంటూ అంత నీచంగా మాట్లాడటం వింటే చెప్పరానంత జుగుప్స కలుగుతోంది. జాతి విద్వేషం, జాత్యహంకారం అమెరికాలో ఆమోదనీయత పొందుతున్నాయనేందుకు ఇది సంకేతం. ఈ చెడు ధోరణికి తక్షణం అడ్డుకట్ట పడాలి' అని కృష్ణమూర్తి అన్నారు. ఈ ఉదంతం మీద పూర్తి అధికారాలతో కూడిన పౌర సంఘ సభ్యుల కమిటీ వేసి స్వతంత్రంగా విచారణ జరిపించాలని సావంత్ కోరారు. డేనియల్ మీద 2014 నుంచి కనీసం 18 విచారణలు జరిగితే అతన్ని ఒక్క దాంట్లోనూ శిక్షించకపోవడం దారుణమన్నారు. పోలీసులే ఇంతటి నోటి దురుసుతో జాత్యహంకార వ్యాఖ్యలకు పాల్పడ్డ ఇలాంటి హై ప్రొఫైల్ కేసులో కూడా విచారణను ఆర్నెల్లు సాగదీయడం, రివ్యూ పేరిట ఏడాది దాకా లాగడం క్షమించరానిదని సౌత్ సియాటిల్ సిటీ కౌన్సిల్ సభ్యుడు టామీ జె.మోరల్స్ ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అమెరికన్ అసోసియేషన్స్ కూడా ఒక ప్రకటనలో కోరింది. వందలాది మంది గురువారం సియాటిల్‌లో నిరసన ప్రదర్శన కూడా చేశారు. దోషులైన పోలీసులకు శిక్ష పడి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు.

జాహ్నవికి మరణానంతరం డిగ్రీ

అమెరికాలో పోలీసు వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన తెలుగు విద్యార్థిని కందుల జాహ్నవికి మరణానంతరం డిగ్రీ ప్రదానం చేయనున్నట్లు నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ప్రకటించింది. మాస్టర్స్ డిగ్రీ పట్టాను జాహ్నవి కుటుంబ సభ్యులకు అందజేస్తామని వెల్లడించింది. జాహ్నవి మృతి పట్ల నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ చాన్సలర్ సంతాపం తెలియజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

నివేదిక ఇవ్వడం నేరం కాదు

ఎడిటర్స్ గిల్డ్ కేసులో సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మణిపూర్ హింసపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా(ఈజీఐ) సభ్యులిచ్చిన నివేదికలోని అంశాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ నివేదికలో వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించే అంశం ఏమీ కనిపించడం లేదని పేర్కొంది. ఒక తప్పుడు ప్రకటన రాజ్యాంగంలో 153ఏ ప్రకారం నేరం కాదని స్పష్టం చేసింది. అది భావ ప్రకటన స్వేచ్ఛ కిందికి వస్తుందని వివరించింది. దేశంలో ఎందరో జర్నలిస్టులు నిత్యం ఇలాంటి అసత్య ప్రకటనలు చేస్తుంటారు. వారందరిపైనా అభియోగాలు మోపుతారా అని పోలీసులను ప్రశ్నించింది. ఈ కేసులో ఈజీఐకి చెందిన నలుగురు సభ్యులకు పోలీసు అరెస్ట్ నుంచి ఇచ్చిన రక్షణను మరో రెండు వారాలు పొడిగిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈజీఐ సభ్యులపై నమోదైన కేసును ఎందుకు కొట్టివేయరాదని మణిపూర్ పోలీసులను ఆయన ప్రశ్నించారు. జర్నలిస్టులకు తమ అభిప్రాయాలను వెలిబుచ్చే హక్కు ఉంటుందన్నారు. మణిపూర్ హింసపై నిజ నిర్ధారణలో భాగంగా నలుగురు సభ్యుల ఈజీఐ అక్కడికి వెళ్లి సెప్టెంబర్ 2న ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ఘర్షణలను ప్రేరేపించేదిగా ఉందంటూ పోలీసులు ఈజీఐకి చెందిన నలుగురు సభ్యులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

లిబియా మరణాలు..11 వేలకు పైనే

డెర్నా: లిబియాలోని డెర్నాలో సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతుల సంఖ్య శుక్రవారానికి 11 వేలు దాటింది. జాడ తెలియకుండా పోయిన మరో 10 వేల మంది కోసం అన్వేషణ ముమ్మరంగా సాగుతోంది. నివాస ప్రాంతాలను తుడిచిపెట్టిన మట్టి, బురద తొలగింపు పనులు సాగుతున్నాయి. సోమవారం సంభవించిన భారీ వర్షాలు, వరదలతో ఎగువనున్న రెండు జలాశయాలు బద్దలై ఒక్కసారిగా డెర్నా నగరాన్ని నీటి ప్రవాహం ముంచెత్తిన విషయం తెలిసిందే.



నాన్న నీకు ఇదే నా జోహార్, తండ్రి పార్థివ దేహానికి సెల్యూట్ చేస్తున్న కబీర్

జై హింద్ పాపా!

- వీర జవానుకు కొడుకు తుది సెల్యూట్
- అశ్రు నయనాల నడుమ కల్నల్ మన్ ప్రీత్ సింగ్ అంత్యక్రియలు
- యుద్ధ వీరుని యూనిఫాంలో పాల్గొన్న ఆరేళ్ల కొడుకు కబీర్
- అంతులేని దుఃఖాన్ని అదిమిపెట్టి మరీ తండ్రికి వీరోచితంగా వీడ్కోలు
- బరువెక్కిన హృదయాలు, కంటతడి పెట్టిన నయనాలు

చండీగఢ్: వయసు నిండా ఆరేళ్లే. ఇంకా ముక్కు పచ్చలే ఆరలేదు. కళ్లెదుట కన్న తండ్రి పార్థివ దేహం. అయినా సరే, వీర మరణం పొందిన తండ్రికి అంతే వీరోచితమైన వీడ్కోలు ఇవ్వాలని నిర్ణయించుకున్నాడో ఏమో.. అంతటి అంతులేని దుఃఖాన్నీ పళ్ల బిగువున అదిమిపెట్టాడు. యుద్ధానికి సిద్ధమయ్యే సైనిక వీరుల యూనిఫాం ధరించాడు. త్రివర్ణ పతాకం కప్పి ఉన్న తండ్రి శవపేటికను మౌనంగా సమీపించాడు. ఆ పేటికనే చిట్టి చేతులతో బిగియారా కౌగిలించుకున్నాడు. ఆ సమయాన ఆ చిన్ని మనసులో ఎన్ని అగ్ని పర్వతాలు బద్దలయ్యాయో! ఎన్నెన్ని భావాలు చెలరేగాయో! ఎంతటి దుఃఖం పొంగుకొచ్చిందో! అవేవీ పైకి కనిపించనీయలేదు. కన్నీటిని కనీసం కంటి కొసలు కూడా దాటి రానివ్వలేదు. తండ్రి పార్థివ దేహం ముందు సగౌరవంగా ప్రణమిల్లాడు. రుద్ధమైన కంఠంతోనే, 'జైహింద్ పాపా' అంటూ తుది వీడ్కోలు పలికాడు. అందరినీ కంట తడి పెట్టించాడు...!

చండీగఢ్: కశ్మీర్ లోయలో ఉగ్ర ముష్కరులను ఏరిపారేసే క్రమంలో వీర మరణం పొందిన సైనిక వీరులు కల్నల్ మన్ ప్రీత్ సింగ్, మేజర్ ఆశిష్ దోంచక్ అంత్యక్రియలు శుక్రవారం అశ్రు నయనాల నడుమ ముగిశాయి. పంజాబ్‌లోని మొహాలీ జిల్లాలో మన్‌ప్రీత్ స్వగ్రామం బహరౌన్ జియాన్‌లో ఉదయం నుంచే సందర్శకుల ప్రవాహం మొదలైంది. చూస్తుండగానే జనం ఇసుకేస్తే రాలనంతగా పెరిగిపోయారు. వారందరి సమక్షంలో పూర్తి సైనిక లాంఛనాల నడుమ మన్ ప్రీత్ అంత్యక్రియలు ముగిశాయి. ఈ సందర్భంగా కుమారుడు కబీర్ సింగ్ కనబరిచిన గుండె దిటవు, 'జైహింద్ పాపా' అంటూ తండ్రికి తుది సెల్యూట్ చేసిన తీరు అందరినీ కంట తడి పెట్టించింది. గవర్నర్ భన్వారీలాల్ పురోహిత్ తో పాటు రాష్ట్ర మంత్రులు, మాజీ సైనికాధిపతి వేదప్రకాశ్ మాలిక్, సైనిక ఉన్నతాధికారులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మేజర్ ఆశిష్ అంత్యక్రియలు కూడా హరియాణాలోని పానిపట్‌లో పూర్తి సైనిక లాంఛనాలతో జరిగాయి. బుధవారం కశ్మీర్‌లోని కోకెర్ నాగ్ ప్రాంతంలో ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కల్నల్ మన్ ప్రీత్, మేజర్ ఆశిష్‌తో పాటు మొత్తం ముగ్గురు సైనిక సిబ్బంది, ఒక డీఎస్పీ అసువులు బాయడం తెలిసిందే.

గుండెలవిసేలా రోదించిన భార్య

మన్ ప్రీత్ అంత్యక్రియల సందర్భంగా గుండెలవిసేలా రోదించిన ఆయన భార్యను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. గవర్నర్, మంత్రులు తదితరులు మన్ ప్రీత్ భార్య, తల్లి తదితరులను ఓదార్చారు. అంత్యక్రియల సందర్భంగా భారత్ మాతా కీ జై నినాదాలతో ఊరంతా మారుమోగింది. మన్ ప్రీత్ చిన్నప్పటి నుంచే అసాధారణ ప్రతిభావంతుడని ఆయన చిన్ననాటి గురువులు గుర్తు చేసుకున్నారు. తమ అభిమాన శిష్యుని అంత్యక్రియల సందర్భంగా వారంతా వెక్కి వెక్కి రోదించారు. 'మేము వర్ణనాతీతమైన బాధ అనుభవిస్తున్నాం. అదే సమయంలో, దేశం కోసం ప్రాణాలను ధార పోసిన మా శిష్యుణ్ణి చూసి గర్వంగానూ ఉంది' అని మన్‌ప్రీత్‌కు ఒకటో తరగతిలో పాఠాలు చెప్పిన ఆశా చద్దా అనే టీచర్ చెప్పారు.

మూడో తరం సైనిక వీరుడు

మన్‌ప్రీత్ తన కుటుంబంలో మూడో తరం సైనిక వీరుడు. ఆయనత తాత సైన్యంలో పని చేశారు. ఆయన తండ్రి సైన్యం నుంచి రిటైరయ్యాక తొమ్మిదేళ్ల క్రితం మరణించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న తల్లి తన కుమారుని పార్థివ దేహం కోసం ఉదయం నుంచే ఇంటి ముందు వేచి చూస్తూ గడిపింది. సైనిక వాహనం నుంచి శవపేటిక దిగగానే కుప్పకూలింది!

ఏబీసీ చైర్మన్‌గా శ్రీనివాసన్ కె. స్వామి ఎన్నిక



న్యూఢిల్లీ: 2023–24 సంవత్సరానికి గాను ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్(ఏబీసీ) చైర్మన్‌గా ఆర్.కె.స్వామి హంస గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీనివాసన్ కె.స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం ఆసియన్ ఫెడరేషన్ ఆఫ్ అడ్వర్టైజింగ్ అసోసియేషన్స్ చైర్మన్‌గా పని చేస్తున్నారు. గతంలో ఇంటర్నేషనల్ అడ్వర్టైజింగ్ అసోసియేషన్(ఐఏఏ)–ఇండియా చాప్టర్ ప్రెసిడెంట్/చైర్మన్‌గా సేవలందించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆసియన్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీ అసోసియేషన్స్, అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేసన్, మద్రాస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ చైర్మన్‌గాను పనిచేశారు. శ్రీనివాసన్ కె.స్వామిని అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించింది. ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ డిప్యూటీ చైర్మన్‌గా రియాద్ మాథ్యూ, గౌరవ కార్యదర్శిగా మోహిత్ జైన్, గౌరవ కోశాధికారిగా విక్రమ్ సఖూజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బహిష్కరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

'ఇండియా' కూటమికి ఎన్‌బీడీఏ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: వివిధ టీవీ చానళ్లకు చెందిన కొందరు జర్నలిస్టులు/యాంకర్లు నిర్వహించే కార్యక్రమాలకు, వేదికలకు తమ ప్రతినిధులను పంపించకూడదని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి మీడియా కమిటీ తీసుకున్న నిర్ణయం పట్ల న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్(ఎన్‌బీడీఏ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలాంటి నిర్ణయం ఆందోళనకరమని ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా నడుచుకోవడం సరైంది కాదని పేర్కొంది. గతంలో ఇలాంటి పరిణామం ఎనాడూ సంభవించలేదని గుర్తుచేసింది. ప్రమాదకరమైన ఈ ధోరణిని మానుకోవాలని ఇండియా కూటమికి విజ్ఞప్తి చేసింది. మీడియా స్వేచ్ఛను గౌరవించాలని కోరింది. కొందరు జర్నలిస్టులను/యాంకర్లను బహిష్కరించడం అనేది దేశాన్ని అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ) నాటి రోజుల్లోకి తీసుకెళ్తుందని ఎన్‌బీడీఏ స్పష్టం చేసింది. మీడియాపై విరుచుకుపడితే స్వతంత్ర భావాల వ్యక్తీకరణను, గొంతుకలను అణచివేసినట్లే అవుతుందని తెలియజేసింది. ఈ బహిష్కరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఇండియా కూటమికి సూచించింది.

ఆదిత్య -ఎల్1 కక్ష్య దూరం మళ్లీ పెంపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈనెల 2న ప్రయోగించిన ఆదిత్య -ఎల్1 ఉపగ్రహానికి శుక్రవారం నాలుగో విడత కక్ష్య దూరాన్ని పెంచారు. బెంగళూరులోని ఇస్రో టెలీమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్(ఇస్ట్రాక్), మారిషస్, అండమాన్ నికోబార్ దీవుల్లోని పోర్టుబ్లెయిర్ గ్రౌండ్‌స్టేషన్ల నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ఉపగ్రహంలో అపోజి ఇంధనాన్ని మండించి కక్ష్య దూరాన్ని విజయవంతంగా పెంచారు. మూడో విడతలో 296×71,767 కిలోమీటర్ల దీర్ఘవృత్తాకార కక్ష్యలో భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న సమయంలో నాలుగో విడుతలో భూమికి దగ్గరగా ఉన్న 296 కిలోమీటర్ల దూరాన్ని 256 కిలోమీటర్లకు తగ్గిస్తూ భూమికి దూరంగా ఉన్న 71,767 దూరాన్ని 1,21,973 కిలోమీటర్లకు పెంచారు. ఈనెల 19న అయిదోసారి కక్ష్య దూరం పెంపుదలలో భాగంగా ఆదిత్య -ఎల్1 ఉపగ్రహాన్ని భూ మధ్యంతర కక్ష్యనుంచి సూర్యుడికి దగ్గరగా లాంగ్రేజియన్ పాయింట్–1 వద్ద హాలో కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

లిఫ్ట్ కుప్పకూలి నలుగురు కార్మికులు మృతి

నోయిడా: గ్రేటర్ నోయిడాలోని నిర్మాణంలో ఉన్న భవనంలో లిఫ్టు కుప్పకూలి నలుగురు కార్మికులు మృత్యువాతపడ్డారు. మరో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆమ్రపాలి డ్రీమ్ వ్యాలీ సొసైటీలో శుక్రవారం ఉదయం 8.30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సర్వీస్ లిఫ్టు గ్రౌండ్ ఫ్లోర్ నుంచి కార్మికులతో బయలుదేరి వెళ్తూ 14వ ఫ్లోర్ నుంచి అకస్మాత్తుగా జారుకుంటూ వచ్చి వేగంగా నేలను ఢీకొట్టింది. దీంతో లిఫ్టులోని నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా మరో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా యూపీ, బిహార్‌లకు చెందిన వలసకార్మికులని పోలీసులు తెలిపారు.

మణిపూర్ హింసాకాండలో 175 మంది బలి

- 32 మంది అదృశ్యం..
  1,108 మందికి గాయాలు
- 4,786 ఇళ్లు దహనం..
- మణిపూర్ పోలీసుల ప్రకటన

ఇంఫాల్: జాతుల మధ్య ఘర్షణలతో ఈశాన్య రాష్ట్రం మణిపూర్ అట్టుడుకుతోంది. ఈ ఏడాది మే నెలలో హింసాకాండ మొదలైంది. రాష్ట్రంలో హింసాత్మక ఘటనల్లో ఇప్పటిదాకా 175 మంది మరణించారని, 32 మంది అదృశ్యమయ్యారని, 1,108 మంది గాయపడ్డారని మణిపూర్ పోలీసు శాఖ వెల్లడించింది. మరణించిన 175 మందిలో 96 మృతదేహాలను వారి కుటుంబ సభ్యులు ఇంకా తీసుకెళ్లలేదని, అవి వివిధ ఆసుపత్రుల్లో మార్చురీలోనే ఉన్నాయని పేర్కొంది. అలాగే 9 మృతదేహాలను గుర్తించలేదని వివరించింది. దాడులు, ప్రతి దాడుల్లో 4,786 ఇళ్లు దహనమయ్యాయని తెలియజేసింది. మణిపూర్‌లో హింస మొదలైనప్పటి నుండి ఆయుధగారాల నుంచి 5,668 ఆయుధాలను దుండగులు ఎత్తుకెళ్లారు. వీటిలో 1,329 ఆయుధాలను భద్రతా బలగాలు మళ్లీ స్వాధీనం చేసుకున్నాయి. అల్లరి మూకల నుంచి భారీగా మందుగుండు సామగ్రి, బాంబులను కూడా అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. గృహ దహనాలకు సంబంధించి పోలీసులు 5,172 కేసులు నమోదు చేశారు. హింసాకాండకు సంబంధించి మొత్తం 9,332 కేసులు నమోదు చేశారు. 325 మందిని అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులను పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నామని మణిపూర్ పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

అస్సాం రైఫిల్స్‌ను ఉపసంహరించాలి

తమ రాష్ట్రం నుంచి అస్సాం రైఫిల్స్ దళాలను వెంటనే ఉపసంహరించాలని మణిపూర్ పౌర సమాజ సంస్థలతో కూడిన మణిపూర్ సమగ్రతపై సమన్వయ కమిటీ(కాకోమీ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. అస్సాం రైఫిల్స్ జవాన్లు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాకోమీ ప్రతినిధులు తాజాగా ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు.

కరోనా కంటే నిఫాతోనే మరణాల రేటు ఎక్కువ

ఐసీఎంఆర్ డీజీ రాజీవ్ బహల్ వెల్లడి

న్యూఢిల్లీ: కోవిడ్–19 ఇన్ఫెక్షన్‌తో పోలిస్తే నిఫా వైరస్‌తో మరణాల రేటు చాలా ఎక్కువగా ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బహల్ చెప్పారు. నిఫా వైరస్ కేసుల్లో మరణాల రేటు 40 శాతం నుంచి 70 శాతం దాకా ఉంటోందన్నారు. అదే కోవిడ్‌లో అయితే 2–3 శాతం మధ్యనే ఉందని వివరించారు. కేరళలో నిఫా కేసుల్లో పెరుగుదల నమోదు అవుతుండటంతో ఈ వైరస్‌ను కట్టడి చేసేందుకు ఆస్ట్రేలియా నుంచి మోనోక్లోనల్ యాంటీబాడీ 20 డోసులు తెప్పించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. జంతువుల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకుతుంది. కలుషిత ఆహారం లేక ఒకరి నుంచి మరొకరికి కూడా ఇది సోకుతుంది. నిఫా వైరస్‌తో ఇప్పటికే కేరళలో ఇద్దరు చనిపోయారు. మరో ఆరుగురు బాధితులు చికిత్స పొందుతున్నారు. యాంటీబాడీ డోసుల కొనుగోలుపై రాజీవ్ బహల్ స్పందిస్తూ..ఆస్ట్రేలియా నుంచి 2018లో తెప్పించిన కొన్ని డోసులు ఇప్పటికీ ఉన్నాయనీ, అవి 10 మంది బాధితులకు మాత్రమే సరిపోతాయని వివరించారు. భారత్ కాకుండా విదేశాల్లో ఇప్పటి వరకు 14 మందికి మాత్రమే ఈ వైరస్ సోకిందన్నారు. వీరికి మోనోక్లోనల్ యాంటీబాడీలను ఇవ్వగా అందరూ సురక్షితంగా బయటపడ్డారని చెప్పారు. 'అయితే, ఈ యాంటీబాడీలను ప్రారంభదశలో ఉన్న వారికే వాడుతున్నారు. వీటితో చికిత్సపై నిర్ణయాన్ని కేరళ ప్రభుత్వం, వైద్యులు, వైరస్ బాధితుల కుటుంబాలకే వదిలేశాము. మోనోక్లోనల్ యాంటీబాడీలతో విదేశాల్లో భద్రతను నిర్ధారించే ఫేజ్–1 ట్రయల్ మాత్రమే జరిగింది. సామర్థ్యాన్ని నిర్ధారించే ట్రయల్స్ జరగలేదు. అందుకే దీనిని 'కారుణ్య వినియోగ ఔషధం'గా మాత్రమే వాడుతున్నారు' అని రాజీవ్ వివరించారు.

ముగిసిన ఈడీ డైరెక్టర్ పదవీకాలం

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్‌గా సంజయ్‌కుమార్ మిశ్రా పదవీకాలం శుక్రవారం ముగిసింది. ఆయన స్థానంలో రాహుల్ నవీన్‌ను ఇంఛార్జి డైరెక్టర్‌గా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 1993 ఐఆర్ఎస్ ఆఫీసర్ అయిన రాహుల్ నవీన్ ఈడీకి రెగ్యులర్ డైరెక్టర్ నియమితులయ్యే దాకా పదవిలో కొనసాగుతారని వెల్లడించింది. రాహుల్ నవీన్ ప్రస్తుతం ఈడీలోనే స్పెషల్ డైరెక్టర్ హోదాలో కొనసాగుతున్నారు. సంజయ్‌కుమార్ మిశ్రాకు గతంలో రెండు పర్యాయాలు కేంద్ర ప్రభుత్వం ఏడాది చొప్పున పొడగింపు ఇవ్వగా సుప్రీంకోర్టు తప్పుపట్టిన విషయం తెలిసిందే. మరోసారి పొడగింపు కుదరదని తేల్చిచెబుతూ సెప్టెంబరు 15 దాకా గడువిచ్చింది. అది పూర్తి కావడంతో శుక్రవారం రాహుల్ నవీన్‌ను ఇంఛార్జిగా నియమిస్తూ కేంద్రం ఆదేశాలు వెలువరించింది.

కర్ణాటకలో ఘనంగా రాజ్యాంగ పీఠిక పఠనం

బెంగళూరు: అంతర్జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని కర్ణాటక ప్రభుత్వం శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ పీఠికను చదివే కార్యక్రమంలో దేశ విదేశాల నుంచి ఏకకాలంలో లక్షలాది మంది పాల్గొన్నారు. బెంగళూరు విధానసౌధ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోపాటు ఇతర అతిథులు రాజ్యాంగ పీఠికను కన్నడ భాషలో స్వయంగా పఠించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో నిత్యం ఉదయం ప్రార్థన సమయంలో రాజ్యాంగ పీఠికను తప్పనిసరిగా చదవాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జూన్‌లో ఉత్తర్వులు జారీ చేసింది.

మన మహిళ పొదుపులో అగ్రగామి

దేశంలోనే అత్యధికంగా ఏపీ స్వయం సహాయక సంఘాల పొదుపు రూ.18,606 కోట్లు

అన్ని రాష్ట్రాల పొదుపులో మన సంఘాల వాటా 31 శాతం



సాక్షి, అమరావతి: మహిళా పొదుపు సంఘాలకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని తు.చ. తప్పకుండా అమలు చేయడం వల్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగేళ్లుగా అద్భుతమైన ఫలితాలను రాబట్టారు. మన స్వయం సహాయక సంఘాలు పొదుపు విషయంలో, క్రెడిట్ లింకేజీలో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచాయి. దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ కార్యక్రమం, పొదుపు సంఘాల పనితీరుపై నాబార్డు 2022 - 23 వార్షిక నివేదికను శుక్రవారం విడుదల చేసింది. దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో పొదుపు సంఘాల పొదుపు నమోదైందని, ఈ విషయంలో రాష్ట్ర పొదుపు సంఘాలు అగ్రగామిగా నిలిచాయని నివేదిక వెల్లడించింది. అంతకు ముందు మూడు ఆర్థిక సంవత్సరాల పాటు కూడా ఏపీ స్వయం సహాయక సంఘాలు పొదుపులో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.

గాడిన పడ్డ సంఘాలు

చంద్రబాబు హయాంలో నిర్వీర్యమైన స్వయం సహాయక సంఘాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో గత నాలుగేళ్లుగా ఆర్థికంగా గాడిన పడటమే కాకుండా దేశంలోనే ఉత్తమ పనితీరును కనపరుస్తున్నాయి. దేశంలో మొత్తం అన్ని రాష్ట్రాల్లో కలిపి పొదుపు సంఘాల సొమ్ము (2022 - 23 మార్చి నాటికి) రూ.58,892.68 కోట్లుగా ఉంది. ఇందులో దక్షిణాది రాష్ట్రాల్లో అత్యధికంగా పొదుపు సంఘాల పొదుపు రూ.28,968.44 కోట్లు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో పొదుపు సంఘాల పొదుపు రూ.18,606.18 కోట్లు ఉందని నివేదిక పేర్కొంది. దేశంలో అన్ని రాష్ట్రాల సంఘాల పొదుపులో ఏపీ స్వయం సహాయక సంఘాల పొదుపే 31 శాతం కావడం విశేషం.

సగటు పొదుపు ఏపీలోనే అత్యధికం

2022-23లో దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సగటు పొదుపులో కూడా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నట్లు నాబార్డు నివేదిక వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కో సంఘం సగటు పొదుపు అత్యధికంగా రూ.1,72,124 కాగా తెలంగాణలో రూ.85 వేలుగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. తెలుగు రాష్ట్రాలను మినహాయిస్తే దేశంలోని మిగతా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అంతకు ముందు ఆర్థిక ఏడాదితో పోల్చితే 2022-23లో ఒక్కో సంఘం సగటు పొదుపు రూ.43,940 నుంచి రూ.30 వేలకు పడిపోయిందని నివేదిక స్పష్టం చేసింది.

2021-22తో పోలిస్తే 2022-23లో ఏపీ పొదుపు సంఘాల పొదుపు రూ.6,938 కోట్లు పెరగడం గమనార్హం. 2021-22 నాటికి రాష్ట్ర పొదుపు సంఘాల పొదుపు రూ.11,668 కోట్లు కాగా ఇప్పుడు రూ.18,606 కోట్లకు పెరిగింది.

పరపతి పెరిగింది

చంద్రబాబు పాలనలో రుణమాఫీ దగాతో పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మల పరపతి క్షీణించింది. స్వయం సహాయక సంఘాల అప్పులు పెరిగిపోవడంతో రుణాల మంజూరుకు బ్యాంకులు వెనకాడాయి. దీంతో సంఘాలు సి, డి గ్రేడ్‌లకు పడిపోయాయి. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చాక ఎన్నికల తేదీ నాటికి పొదుపు సంఘాలకు ఉన్న అప్పులను నాలుగు విడతల్లో తిరిగి ఇస్తామన్న మాటను నిలబెట్టుకుంటూ ఇప్పటికే వైఎస్సార్ ఆసరా ద్వారా మూడు విడతల్లో రూ.19,178.17 కోట్లు చెల్లించారు. అంతేకాకుండా చంద్రబాబు ఎగనామం పెట్టిన సున్నా వడ్డీని కూడా పునరుద్ధరించారు. దీంతో రాష్ట్రంలో పొదుపు సంఘాల పరపతి పెరిగింది. ఆసరా, సున్నా వడ్డీతో పొదుపు సంఘాల మహిళల్లో ఆర్థిక క్రమశిక్షణ పెరిగి ఇప్పుడు దేశంలోనే అత్యధిక క్రెడిట్ లింకేజీ గల పొదుపు సంఘాలుగా నిలిచాయి. చంద్రబాబు హయాంలో పొదుపు సంఘాల క్రెడిట్ లింకేజీ 43.6 శాతం ఉండగా ఇప్పుడు 89 శాతం సాధించడం గమనార్హం. వరుసగా నాలుగేళ్లుగా రాష్ట్రంలోని పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాల మంజూరు పెరుగుతూనే ఉంది. 2022-23లో వాణిజ్య, రీజనల్ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు కలిపి ఏపీ పొదుపు సంఘాలకు దేశంలోనే అత్యధికంగా రూ.40,230.63 కోట్ల రుణాలను మంజూరు చేశాయి.

దక్షిణాదిలో 2022-23 స్వయం సహాయక సంఘాల పొదుపు సొమ్ము రూ.కోట్లలో

రాష్ట్రం	సంఘాల సంఖ్య	పొదుపు సొమ్ము
ఆంధ్రప్రదేశ్	1080977	18,606.18
కర్నాటక	870636	1665.53
కేరళ	487053	1232.23
తమిళనాడు	1070167	2273.74
తెలంగాణ	609319	5156.74

దక్షిణాదిలో 2022-23 పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాల మంజూరు రూ.కోట్లలో

రాష్ట్రం పేరు	సంఘాల సంఖ్య	రుణం మంజూరు
ఆంధ్రప్రదేశ్	526732	40,230.63
కర్నాటక	744027	20,559.57
కేరళ	113730	6315.63
తమిళనాడు	255198	13,403.53
తెలంగాణ	240478	14,589.07

భారీగా తగ్గిన నిరర్థక ఆస్తులు

నాడు చంద్రబాబు రుణమాఫీ చేస్తానని మోసగించడంతో స్వయం సహాయక సంఘాలు అప్పుల్లో కూరుకుపోవడమే కాకుండా వాటి నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) పెరిగిపోయాయి. ఇప్పుడు గత నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో నిరర్థక ఆస్తులు గణనీయంగా తగ్గాయి. పొదుపు సంఘాలకు సంబంధించి చంద్రబాబు హయాంలో 5.86 శాతం నిరర్థక ఆస్తులుండగా 2022 - 23 నాటికి ప్రభుత్వ రంగ వాణిజ్య బ్యాంకుల రుణాల్లో నిరర్థక ఆస్తులు 0.41 శాతానికి, ప్రైవేట్ వాణిజ్య బ్యాంకుల్లో 0.25 శాతానికే పరిమితమైనట్లు నివేదిక తెలిపింది.

సున్నా వడ్డీతో సంఘాలు బలోపేతం

సకాలంలో రుణాలను చెల్లించే పొదుపు సంఘాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సున్నా వడ్డీ (వడ్డీ లేని రుణాలు) రుణాలను అమలు చేస్తోందని నాబార్డు నివేదిక తెలిపింది. సకాలంలో రుణాలు చెల్లించే పొదుపు సంఘాలకు క్రమం తప్పకుండా సున్నా వడ్డీని రీయింబర్స్‌మెంట్ చేయడంతో పొదుపు సంఘాలు బలోపేతం కావడమే కాకుండా గ్రామీణ కుటీర పరిశ్రమలు పరిపుష్టి సాధించాయని పేర్కొంది. పొదుపు మహిళల జీవనోపాధిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని ప్రస్తావించింది. ఆసరా ద్వారా అందిస్తున్న డబ్బులతో వ్యాపారాలు నిర్వహిస్తూ పొదుపు సంఘాలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు వీలుగా ప్రముఖ సంస్థలతో ఒప్పందాలను చేసుకుని బ్యాంకు రుణాలతో తోడ్పాటు అందిస్తోంది.

క్లుప్తంగా...

పలువురు సీనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతులు

గుంటూరు లీగల్: పలువురు సీనియర్ సివిల్ జడ్జిలకు జిల్లా జడ్జిలుగా పదోన్నతులు, పలువురు జిల్లా జడ్జిలను బదిలీ చేస్తూ ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్(విజిలెన్స్) వి.శ్రీనివాసశివరామ్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. మంగళగిరిలోని జ్యుడీషియల్ అకాడమిలో సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్-1గా పని చేస్తున్న జి.చక్రపాణిని పదోన్నతిపై అకాడమి అడిషనల్ డైరెక్టర్‌గా నియమించారు. అకాడమిలో సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్-2గా ఉన్న ఆర్.శ్రీలత పదోన్నతిపై మెంబర్-1గా నియమితులయ్యారు. తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వై.బెన్నయ్యనాయుడు పదోన్నతిపై రాజమహేంద్రవరంలోని 8వ అడిషనల్ జిల్లా కోర్టుకు, గుంటూరు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.చంద్రమౌళీశ్వరి పదోన్నతిపై పెద్దాపురంలోని ఏడో అడిషనల్ జిల్లా కోర్టుకు, బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి.సాధుబాబు పదోన్నతిపై అనంతపురంలోని 8వ అడిషనల్ జిల్లా కోర్టుకు జిల్లా జడ్జిలుగా నియమితులయ్యారు. పదోన్నతులు, బదిలీలు పొందిన న్యాయమూర్తులు 29లోగా బాధ్యతలు స్వీకరించాలని పేర్కొన్నారు.

టీడీపీతో పెయిడ్ ఆర్టిస్ట్ పవన్‌కు పొత్తు ఎప్పడో కుదిరింది

రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి



చిత్తూరు అగ్రికల్చర్: టీడీపీ, జనసేన కలవడం ఆశ్చర్యకరమైన విషయం కాదని రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పెయిడ్ ఆర్టిస్ట్ పవన్ కళ్యాణ్ లోపాయికారి ఒప్పందాన్ని చంద్రబాబుతో ఎప్పుడో కుదుర్చుకున్నారన్నారు. అయితే బీజేపీని కూడా కలుపుకోవాలన్న ఆలోచనతోనే ఇన్నాళ్లు బుకాయిస్తూ వచ్చారన్నారు. ప్రస్తుతం బీజేపీ కలిసే పరిస్థితి కానరాకపోవడంతో బహిరంగంగా పొత్తులను ప్రకటించారన్నారు. ఈ రెండు పార్టీలు కలవడం వల్ల తమకు నష్టమేమి లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అవినీతి పరులు.. ప్యాకేజీ స్టార్లు ఒక్కటయ్యారు

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఫైర్



కార్వేటినగరం (చిత్తూరు జిల్లా)/చిత్తూరు అగ్రికల్చర్: 'అవినీతికి అడ్డాగా సాగుతున్న టీడీపీ జెండా.. ప్యాకేజీ కోసం పాటుపడుతున్న జనసేన రాజమండ్రి వేదికగా ఒక్కటై ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యాయి' అని ఉప ముఖ్యమంత్రి కే. నారాయణస్వామి ధ్వజమెత్తారు. శుక్రవారం కార్వేటినగరం మండలం, ఎర్రమరాజుపల్లెలో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ జీవితమంతా పదవి కోసం ఒకరిని అడ్డుపెట్టుకోవడమేనని విమర్శించారు. ఎన్ని పార్టీలు ఒక్కటైనా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరో మారు రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించి 175 స్థానాల్లో రికార్డు విజయాన్ని అందుకోవడం ఖాయమన్నారు. కాగా, చిత్తూరులో మీడియా సమావేశంలో నారాయణ స్వామి మాట్లాడుతూ.. అన్నీ నేనే కనిపెట్టానని చెప్పే చంద్రబాబు అవినీతిని కూడా కనిపెట్టిన దిట్ట అని ఆయన విమర్శించారు. అవినీతి కేసును వాదించే న్యాయవాది లూథ్రాకు రూ. కోట్లలో ఫీజులు చెల్లించే డబ్బు చంద్రబాబుకు ఎక్కడిదన్నారు. దేశంలో చంద్రబాబుకు మించిన ఆర్థిక నేరస్తుడు మరెవ్వరు లేరన్నారు.

సూర్యనారాయణకు ముందస్తు బెయిలు

సాక్షి, న్యూఢిల్లీ: వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణకు సుప్రీం కోర్టు ముందస్తు బెయిలు మంజూరు చేసింది. వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాకు రూ.100 కోట్ల నష్టం కలిగించారంటూ విజయవాడ పోలీసులు రామసూర్యనారాయణపై కేసు నమోదు చేసిన విషయం విదితమే. తనకు ముందస్తు బెయిలు ఇవ్వాలని రామసూర్యనారాయణ హైకోర్టును ఆశ్రయించగా నిరాకరించింది. దీంతో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌ను విచారించింది. హైకోర్టు ఆదేశాలపై స్టే విధించి ముందస్తు బెయిలు మంజూరు చేస్తూ తదుపరి విచారణ నవంబరు 11కు వాయిదా వేసింది.

సునీల్‌యాదవ్‌కు బెయిల్ నిరాకరణ

వివేకా హత్యకేసులో బెయిల్ పిటిషన్ కొట్టేసిన తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ-2) సునీల్‌యాదవ్‌కు బెయిల్ ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. ఈ దశలో బెయిల్ ఇవ్వలేమని చెబుతూ.. పిటిషన్‌ను కొట్టేసింది. వివేకా హత్యకేసులో 2021 ఆగస్టు 2 నుంచి జైల్లో ఉంటున్నానని, చార్జిషీట్ కూడా దాఖలు చేసిన నేపథ్యంలో బెయిల్ ఇవ్వాలని కోరుతూ సునీల్‌యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారించిన జస్టిస్ కె.లక్ష్మణ్.. పిటిషన్‌ను కొట్టేస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. పిటిషనర్ తరఫున నయన్‌కుమార్ వాదించారు.

కిట్ల పేరుతో రూ.కోట్లు కొట్టేశారు!

- రూ.50 వేలు ఉండే ఒక్కో ల్యాబ్ కిట్‌ను రూ.6 లక్షల పైన చూపుతూ ఇన్‌వాయిస్‌ల సృష్టి
- ఈ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఖర్చు చేసింది రూ.70 కోట్లే.. రూ.364.26 కోట్లు ఖర్చు పెట్టామంటూ బిల్లులు
- ఒప్పందం తర్వాత డొల్ల కంపెనీ ఏర్పాటు.. నగదు తరలింపు
- ఫోరెన్సిక్ ఆడిట్‌లో బయటపడ్డ బాబు 'స్కిల్స్'

సాక్షి, అమరావతి: విద్యార్థులకు నైపుణ్య శిక్షణ పేరుతో రూ.కోట్లు కొట్టేసిన చంద్రబాబు స్కిల్స్ ఒక్కొక్కటి వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. అడ్డగోలుగా ధరలు పెంచేసి ల్యాబ్ కిట్లు పేరుతో రూ.వందల కోట్లు మింగేశారు. బహిరంగమార్కెట్లో రూ.40-50 వేలు ఉండే పరికరాలను బిగించి దానికి 12 రెట్లు అదనంగా ఒక్కో కిట్‌కు రూ.6 లక్షలు పైన వ్యయం చేసినట్లు ఇన్‌వాయిస్‌లు జారీ చేసి భారీగా దండుకున్నారు. స్కిల్స్ కుంభకోణంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో ఈ వాస్తవాలన్నీ బయటపడ్డాయి. రూ.3,281.4 కోట్ల ప్రాజెక్టుగా లెక్కల్లో చూపి కేవలం సాఫ్ట్‌వేర్‌కు రూ.58 కోట్లు, హార్డ్‌వేర్ పరికరాలకు మరో రూ.70 కోట్లవరకు వ్యయం చేసి మిగిలిన మొత్తం డొల్ల కంపెనీల ద్వారా తరలించిన వైనం ఆధారాలతో బయటపడింది. ఒక్కో క్లస్టర్‌కు రూ. 546.84 కోట్ల చొప్పున వ్యయమవుతుందని.. ఇలా ఆరుక్లస్టర్లను ఏర్పాటుకు రూ.3,281.4 కోట్లు వ్యయమవుతుందని చంద్రబాబు ప్రభుత్వం ప్రాజెక్టు లెక్కల్లో చూపింది. అయితే వాస్తవానికి ఆరు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలు, 34 టీఎస్‌డీఐల ఏర్పాటుకు రూ.130 కోట్లవరకు మాత్రమే వ్యయం చేశారు. అయితే రూ.364.26 కోట్లు ఖర్చు చేసినట్లు ఇన్‌వాయిస్‌లు జారీచేసి చంద్రబాబు నిధులు విడుదల చేసేశారు. ఇందుకోసం డిజైన్ టెక్ సంస్థ.. స్కిల్లర్ పేరుతో 2015లో డొల్ల కంపెనీని సృష్టించి దానిద్వారా నగదును తరలించింది. భారీ కాంట్రాక్టుల అనుభవంలేని కంపెనీ పేరిట 700కు పైగా ఇన్‌వాయిస్‌లు జారీ చేసి రూ.కోట్లు దోచుకున్నారు.

ఉపాధి కల్పిస్తామన్న హామీ లేదు

ఈ కేంద్రాల్లో శిక్షణ తీసుకున్నవారికి ఉపాధి కల్పిస్తామన్న ఒప్పందం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. టీఎస్‌డీఐ కేంద్రాల్లోని కోర్సుల్లో చాలావరకు ఐదు నుంచి వారం రోజులు శిక్షణ ఇచ్చేవేనని.. ఇవన్నీ బేసిక్ కోర్సులేనని వెల్లడించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, స్కూటర్స్, ఫోర్ వీలర్స్ రిపేర్స్, ఆటో క్యాడ్ వంటివాటికి బయట ఇన్‌స్టిట్యూట్లలోనూ రూ.450 నుంచి రూ.3,000 లోపే తీసుకుంటున్నారని చెప్పారు. ఈ కోర్సులు పూర్తిచేసిన వెంటనే రూ.లక్షల్లో జీతాలిచ్చే ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు. ఇంజనీరింగ్ చదివినవారు ప్రతిభతో ఉద్యోగం సంపాదించుకుంటే ఈ శిక్షణద్వారా ఉపాధి పొందినట్లు పచ్చమీడియా ప్రసారం చేస్తోందని వృత్తినిపుణులు మండిపడుతున్నారు. ఖరీదైన రోబోటిక్స్, ఏఐ వంటి వాటికి శిక్షకులనే నియమించలేదని ఏపీఎస్ఎస్‌డీసీ అధికారులు తెలిపారు.

సాష్టాంగపడి.. ప్యాకేజీ మాట్లాడుకుని

పవన్‌పై ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఫైర్



తాడేపల్లిగూడెం: లోకేశ్ ఢిల్లీ వెళ్లినంత మాత్రాన రాష్ట్ర రాజకీయాలు ఏమైనా మారిపోతాయా అని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో మీడియాతో మాట్లాడారు. పవన్ కళ్యాణ్ జైలుకు వెళ్లి సాష్టాంగ నమస్కారంతో ప్యాకేజీ మాట్లాడుకొని వచ్చాడని మంత్రి విమర్శించారు. పవన్ ఇంతకాలం పెళ్లి ఒకరితో సంసారం ఒకరితో అన్నట్లుగా చేశాడని చెప్పారు. చంద్రబాబుకు సేవ చేయండని జనసైనికులకు చెప్పగానే నీకు, నీ పార్టీకి దండం పవన్ అని సగం మంది జారిపోయారన్నారు. జనసేనతో టీడీపీ కలవడం వల్ల కూడా చాలామంది టీడీపీ నుంచి బయటకు పోయేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ అనేది చనిపోయిన పార్టీ కింద లెక్క అని మంత్రి చెప్పారు.

స్కిల్ స్కాంలో పవన్ భాగస్వామి

రూ.371 కోట్లలో పవన్‌కు ఎంత ముట్టిందో చెప్పాలి

- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఫైర్
- టీడీపీ, జనసేన కొత్తగా పొత్తు అనడం ఓ డ్రామా
- కలిసే ఉన్న బాబు, పవన్‌లది ప్యాకేజీ ఫెవికాల్ బంధం



సాక్షి, అమరావతి: చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి 2014 ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని గెలిచిన తర్వాతే స్కిల్ స్కాం జరిగింది కాబట్టి ఆ స్కాంలో పవన్ కూడా భాగస్వామేనని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ చెప్పారు. స్కిల్ స్కాంలో తన భాగస్వామి పవన్‌కు.. కొట్టేసిన రూ. 371 కోట్లలో ఎంతిచ్చారో చంద్రబాబు చెప్పాలన్నారు. ఈ స్కాంలో పవన్ వాటా కూడా బయటకు రావాలన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జైలుకు వెళ్లి చంద్రబాబును కలిసి వచ్చి కొత్తగా పొత్తు పెట్టుకున్నట్లు పవన్ డ్రామాలాడటం ఎందుకని, ఇప్పటివరకూ కలిసే ఉన్న వారిది ప్యాకేజీ ఫెవికాల్ బంధం అని ప్రజలకు తెలుసని మంత్రి విమర్శించారు. ఒకవైపు బీజేపీతో సంసారం చేస్తూనే మరోవైపు టీడీపీతో తాళి కట్టించుకున్నారని మండిపడ్డారు. రాజమండ్రి సెంట్రల్ జైల్ వద్ద మీడియా సమావేశంలో ఇద్దరు మెంటల్ కేసుల మధ్య పిచ్చి పవన్ కళ్యాణ్ ఉన్నారన్నారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిపై పవన్ యుద్ధం చేస్తానంటున్నాడని, సీఎం జగన్‌పై యుద్ధం అంటే ఐదు కోట్ల మంది ఏపీ ప్రజలపై యుద్ధమేనని మంత్రి స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్న ప్రజలపై యుద్ధం చేస్తావా అని ప్రశ్నించారు. నిజానికి యుద్ధం ఇప్పటికే మొదలైందని, చంద్రబాబు, పవన్‌ల పతనమే ఇక మిగిలుందని చెప్పారు. ఇక లోకేశ్ గురించి ప్రస్తావిస్తూ.. ఎవరి కాళ్లు పట్టుకోవడానికి ఢిల్లీ వెళ్లావ్ అని నిలదీశారు. ఢిల్లీ వెళ్లి మా నాన్న రూ. 371 కోట్లు కొట్టేశారు అని చెప్తావా లోకేశ్ అని ప్రశ్నించారు. గజదొంగ లోపలుంటే.. పిల్ల దొంగ ఢిల్లీ వెళ్లారని ఎద్దేవా చేశారు. జాతీయ మీడియాని కలుస్తాను.. కేంద్ర పెద్దల కాళ్లు పట్టుకుంటాను అని చెప్పి.. చివరికి లోకేశ్ ఓ బ్రోకర్ విగ్గు గాడిని కలిశాడని విమర్శించారు.

పోలీసులపై రెచ్చిపోయిన పచ్చమూక



భీమడోలు సీఐ వెంకటేశ్వరరావుపై దౌర్జన్యం చేస్తున్న టీడీపీ నేత





కిందపడిపోయిన సీఐ వెంకటేశ్వరరావు (వృత్తంలో), హెడ్‌కానిస్టేబుల్ అమీర్

- అనుమతిలేకుండా టీడీపీ శ్రేణుల పాదయాత్ర
- అడ్డుకోబోయిన పోలీసులపై దాడులు, దౌర్జన్యాలు
- సీఐ, హెడ్‌కానిస్టేబుల్‌ను కిందపడేసి దూసుకెళ్లిన వైనం
- ఏలూరు జిల్లా తిరుమలంపాలెం వద్ద తీవ్ర ఉద్రిక్తత

ద్వారకాతిరుమల: పచ్చమూక మరోసారి రెచ్చిపోయింది. పోలీసులపై దాడులకు తెగబడింది. పోలీసుల్ని కిందకు తోసేసింది. తెలుగుదేశం వర్గీయులు విచక్షణారహితంగా ప్రవర్తించడంతో శుక్రవారం ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెం శివారులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడికి బెయిల్ రావాలని కోరుతూ టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు మారంపల్లి నుంచి పాదయాత్రగా ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి బయల్దేరారు. 144 సెక్షన్ అమలులో ఉండటంతో తిరుమలంపాలెం శివారులో ద్వారకాతిరుమల, భీమడోలు పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనుమతి లేకుండా ర్యాలీలు, పాదయాత్రలు వంటివి చేయకూడదని హెచ్చరించారు. అయినా టీడీపీ వర్గీయులు పోలీసులను నెట్టుకుంటూ దాడులు, దౌర్జన్యాలు చేస్తూ, బెదిరిస్తూ దూసుకెళ్లారు. ఎవరడ్డొచ్చినా ఆగేది లేదంటూ.. పోలీసులను నోటికొచ్చినట్లు తిడుతూ ముందుకెళ్లారు. వారు తోసేయడంతో భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావు, ద్వారకాతిరుమల హెడ్ కానిస్టేబుల్ అమీర్ కింద పడిపోయారు. అక్కడ పలువురు పలువురు టీడీపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం తిమ్మాపురం శివారులో టీడీపీ పాదయాత్రకు జనసేన నాయకులు మద్దతిచ్చి, వారితో కలసి ద్వారకా తిరుమల చేరుకున్నారు.

పథకం ప్రకారం మహిళలను ముందుపెట్టి..

టీడీపీ నేతలు పథకం ప్రకారం మహిళలను ముందుపెట్టి వెనుక వారొచ్చారు. మహిళలను అడ్డుకుంటారా.. అంటూ పోలీసులను తోసుకుంటూ దౌర్జన్యంగా దూసుకెళ్లారు. పోలీసులపై దాడులు, దౌర్జన్యాలకు తెగబడ్డారు. పోలీసులు మధ్యలో అడ్డుకుంటారని తెలిసినా, అల్లర్లు సృష్టించి, గొడవలు పెట్టుకోవాలనే వారు ఈ పాదయాత్రను చేపట్టినట్టు తెలిసింది. పోలీసుల పట్ల తెలుగుదేశం వర్గీయుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

పలువురు టీడీపీ నాయకులపై కేసు

పోలీసులపై దౌర్జన్యం చేసి, 144 సెక్షన్ నిబంధనలను ఉల్లంఘించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన పలువురు టీడీపీ నాయకులపై ద్వారకాతిరుమల ఎస్‌ఐ టి.సుధీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ జి.దుర్గారావు తెలిపారు. ఇప్పటికే 13 మందిని అదుపులోకి తీసుకున్నామని, వారికి 41 నోటీసులు ఇచ్చి విడుదల చేశామని చెప్పారు. మరికొంతమందిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందన్నారు.

రిమాండ్ ఖైదీలకు వారానికి రెండే ములాఖత్‌లు

- చంద్రబాబుకు రెండు ములాఖత్‌లు ముగిశాయి
- అందుకే మూడో ములాఖత్ కోసం భువనేశ్వరి దరఖాస్తు తిరస్కరణ
- జైళ్ల శాఖ ప్రకటన

సాక్షి, రాజమహేంద్రవరం/సాక్షి, అమరావతి: రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబుకు వారానికి గరిష్ట పరిమితి మేరకు రెండుసార్లు ములాఖత్‌లకు అవకాశం ఇచ్చామని జైళ్ల శాఖ తెలిపింది. అందుకే భువనేశ్వరి ఈ వారంలోనే మూడోసారి ములాఖత్ కోసం చేసిన దరఖాస్తును తిరస్కరించినట్లు వెల్లడించింది. చంద్రబాబుతో ఆయన సతీమణి భువనేశ్వరి ములాఖత్‌కు జైళ్ల శాఖ ఏకపక్షంగా తిరస్కరించినట్లు టీడీపీ విమర్శించడం నిరాధారమని శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. రిమాండ్ ఖైదీలకు వారానికి గరిష్టంగా రెండుసార్లు ములాఖత్‌కు అవకాశం ఇస్తామని, ప్రతి ములాఖత్‌లో గరిష్టంగా ముగ్గురు వ్యక్తులు రిమాండ్ ఖైదీని కలిసేందుకు అవకాశం ఉంటుందని జైళ్ల శాఖ పేర్కొంది. ఆ ప్రకారం చంద్రబాబుతో ఈ వారంలోనే మొదట ములాఖత్‌గా 12వ తేదీన ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి కలిసి వెళ్లారని తెలిపింది. రెండో ములాఖత్‌గా ఈ నెల 14న లోకేశ్, బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ ఆయనతో భేటీ అయ్యారని వెల్లడించింది. దాంతో ఈ వారంలో రెండు ములాఖత్‌లు పూర్తయినట్టు స్పష్టంచేసింది. అందుకే శుక్రవారం (15న) ములాఖత్ కోసం భువనేశ్వరి చేసిన దరఖాస్తును తిరస్కరించామని వివరించింది. అదే విషయాన్ని భువనేశ్వరికి లిఖితపూర్వకంగా తెలిపామని జైళ్ల శాఖ వెల్లడించింది.

బాబు రిమాండ్ ఐదు రోజులు పూర్తి

చంద్రబాబు జైలు జీవితం ఐదు రోజులు పూర్తయింది.ఎప్పటిలాగే శుక్రవారం కూడా జైలులో ఆయన దినచర్య సాగింది. జైలులో చంద్రబాబును హైకోర్టు న్యాయవాది లక్ష్మీనారాయణ కలిశారు. కేసుకు సంబంధించిన విషయాలపై చర్చించినట్లు సమాచారం.

బాబు బెయిల్ పిటిషన్‌లో కౌంటర్ వేయండి

సీఐడీకి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశం

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు వేసిన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది.

ఆ పిటిషన్‌కు విచారణార్హతే లేదు : సీఐడీ పీపీ

చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీఐడీ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వైఎస్ వివేకానంద వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతున్నారని తెలిపారు. ఈ మేర ఆయన దాఖలు చేసిన పిటిషన్‌కు అసలు విచారణార్హతే లేదన్నారు. సీఆర్‌పీసీ సెక్షన్ 437, సెక్షన్ 439 కింద బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చునని.. అయితే, ఈ సెక్షన్ల కింద మధ్యంతర బెయిల్ ఇవ్వడమన్న ప్రశ్నే తలెత్తదన్నారు. ఈ సెక్షన్లలో ఎక్కడా కూడా మధ్యంతర బెయిల్ ప్రస్తావనేలేదని ఆయన తెలిపారు. మధ్యంతర బెయిల్ తమ హక్కు అన్నట్లు చంద్రబాబు న్యాయవాదులు వాదిస్తున్నారని.. ఇప్పటికే అరెస్టయి జైలులో ఉన్న వ్యక్తి మధ్యంతర బెయిల్ ఇవ్వడం ఎంతమాత్రం సరికాదన్నారు. తాము ఇప్పటికే పోలీసు కస్టడీ పిటిషన్ దాఖలు చేశామని, అందులో కౌంటర్లు దాఖలు చేయాలని ఈ కోర్టు ఆదేశించినా చంద్రబాబు న్యాయవాదులు దాఖలు చేయలేదని వివేకానంద కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పైపెచ్చు హైకోర్టును ఆశ్రయించి, ఈ కోర్టు (ఏసీబీ కోర్టు) కౌంటర్ కోసం ఒత్తిడి చేస్తోందన్నట్లు హైకోర్టుకు చెప్పి, పోలీసు కస్టడీ పిటిషన్‌లో ఈ కోర్టు (ఏసీబీ కోర్టు)ను ముందుకెళ్లకుండా నియంత్రిస్తూ ఉత్తర్వులు తెచ్చారని తెలిపారు. వాస్తవానికి పోలీసు కస్టడీ పిటిషన్‌లో తామే కౌంటర్ కోసం ఒత్తిడి చేశామే తప్ప, ఈ కోర్టు ఎవరినీ ఒత్తిడి చేయలేదన్నారు. హైకోర్టు ఉత్తర్వులతో తమ పోలీసు కస్టడీ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు విచారించలేని పరిస్థితిలో ఉండటంతో, దానిని అడ్డంపెట్టుకుని బెయిల్ కోసం పిటిషన్ వేసి మధ్యంతర బెయిల్ కోరుతున్నారని వివేకానంద తెలిపారు. వాస్తవాలను కోర్టు ముందుంచాలన్న ఉద్దేశంతోనే ఇవన్నీ చెబుతున్నామన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని విచారణను వాయిదా వేయాలని వివేకానంద కోరారు.


మధ్యంతర బెయిల్‌పై విచారణ సబబేనా?

అనంతరం.. చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ, ప్రధాన బెయిల్ కౌంటర్ దాఖలు చేసి, వాదనలు విని దాన్నితేల్చేలోపు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ సమయంలో న్యాయస్థానం స్పందిస్తూ.. సీఐడీ కేసు కొట్టేయాలని కోరుతూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, ఇదే సమయంలో చంద్రబాబు కస్టడీ కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ తమ ముందు పెండింగ్‌లో ఉందని, ఈ పరిస్థితుల్లో బెయిల్‌పై విచారణ జరపడంపై స్పష్టత కావాలని తేల్చిచెప్పింది. పోలీసు కస్టడీ పిటిషన్‌లో ముందుకెళ్లకుండా హైకోర్టు ఉత్తర్వులున్నాయని గుర్తుచేసింది. అందువల్ల ఈ దశలో మధ్యంతర బెయిల్‌పై వాదనలు వినడం సబబా? కాదా? అన్న సందేహం కలుగుతోందని ఏసీబీ తెలిపింది. కానీ, మధ్యంతర బెయిల్‌పై నిర్ణయం తీసుకునే విచక్షణాధికారం ఏసీబీ కోర్టుకుందని దమ్మాలపాటి తెలిపారు. హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశాం కాబట్టి, మధ్యంతర బెయిల్‌పై కింది కోర్టు విచారణ జరపకూడదన్న నిషేధం ఏదీలేదన్నారు. న్యాయస్థానం స్పందిస్తూ.. మంగళవారం హైకోర్టులో విచారణ జరుగుతున్నందున, క్వాష్ పిటిషన్‌లో విచారణ తరువాత హైకోర్టులో వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఈ బెయిల్‌పై తదుపరి విచారణ జరుపుతామని స్పష్టం చేస్తూ విచారణను 19కి వాయిదా వేసింది.

క్లుప్తంగా...

శాసనసభ సమావేశాల్లో ప్రతి అంశంపైనా సమగ్ర చర్చ

అసెంబ్లీ సమావేశాల ఏర్పాట్లపై మంత్రి బుగ్గన సమీక్ష



సాక్షి, అమరావతి : శాసనసభ సమావేశాల్లో ప్రతి అంశంపై సమగ్రంగా చర్చించాలని ఆర్థిక, శాసన వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. **ఈ నెల 21న** ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల ఏర్పాట్లపై అసెంబ్లీలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశాల నిర్వహణకు సంబంధించిన అంశాలు, భద్రత, వసతులు, ఏర్పాట్లు తదితర అంశాలపై చీఫ్ విప్, విప్‌లతో చర్చించారు. అదే రోజు శాసనసభ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఎన్ని రోజులు నిర్వహించాలి, ఏ ఏ అంశాలపై చర్చ జరగాలన్న అంశాలపై నిర్ణయం జరుగుతుందన్నారు. శాసనసభ సమావేశాల హుందాతనాన్ని, ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ ప్రతి అంశంపై సమగ్రంగా చర్చించాలని బుగ్గన తెలిపారు. సమీక్షలో చీఫ్ విప్ ముదునూరి నాగరాజ వరప్రసాదరాజు, విప్‌లు జంగా కృష్ణమూర్తి, కాపు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానం అమలులో ఏపీ అగ్రగామి

- పాఠశాల విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ రాష్ట్ర సభ్యుడు బి.ఈశ్వరయ్య



కురబలకోట: జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమలులో దేశంలో ఏపీ అగ్రగామిగా ఉందని పాఠశాల విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ రాష్ట్ర సభ్యుడు బి.ఈశ్వరయ్య అన్నారు. అన్నమయ్య జిల్లా కురబలకోటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించిందని గుర్తు చేశారు. విద్యా సంస్కరణల్లో కూడా ఏపీ దేశంలోనే ముందు వరుసలో ఉందన్నారు. విద్యార్థులకు ఉదయం టిఫిన్ అందించాలన్న మరో ప్రతిపాదన, ఫిన్‌ల్యాండ్‌లో టీచర్లకు శిక్షణ ఇప్పించాలన్న ఆలోచన కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు. సీఎం జగన్ రాష్ట్రంలోని విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు సరికొత్త బాటలు వేస్తున్నారని ప్రశంసించారు.

ఎంబీబీఎస్ రెండో దశ కౌన్సెలింగ్‌కు వెబ్ ఆప్షన్‌ల నమోదు

సాక్షి, అమరావతి: ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ బీ-కేటగిరి, ఎన్ఆర్ఐ కోటా సీట్లు, ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీలో భాగంగా రెండో విడత కౌన్సెలింగ్‌కు వెబ్ ఆప్షన్‌ల నమోదు కోసం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి ఆప్షన్‌ల నమోదు ప్రారంభించారు. శనివారం రాత్రి 10 గంటలు ఆప్షన్‌ల నమోదుకు చివరి గడువు విధించారు. https://ugmq.ysruhs.com వెబ్‌సైట్‌లో విద్యార్థులు వెబ్ ఆప్షన్‌లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

'విమ్స్'లో 43 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- 21న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(విమ్స్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన 43 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 21వ తేదీన విశాఖలోని విమ్స్‌లో వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టులను భర్తీ చేస్తామని ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు స్వయంగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. పూర్తి నోటిఫికేషన్ కోసం http://dme.ap.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

బోధనాస్పత్రి, కళాశాలకు కలిపి ఇద్దరు ఏడీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రులకు రెండింటికి కలిపి ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)లను రీ-డిసిగ్నేట్ చేసి వారికి విధులను కేటాయిస్తూ వైద్యశాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు వైద్య కళాశాల, బోధనాస్పత్రికి ఒక్కొక్కరు చొప్పున ఏడీలు వేర్వేరుగా ఉండేవారు. అలా కాకుండా ఆస్పత్రి, కళాశాలను ఒక యూనిట్‌గా చేసి ఏడీ పోస్టులను హెచ్ఆర్, అడ్మిన్‌లుగా రీ-డిసిగ్నేట్ చేశారు. ఈ మేరకు వీరి జాబ్ చార్ట్స్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉద్యోగుల వేతనాలు, అలవెన్స్‌లు డ్రాయింగ్, డిస్బర్స్‌మెంట్, మానవ వనరుల నిర్వహణ, నియామకాలు, హాజరు పర్యవేక్షణ, ఇతర విధులను హెచ్ఆర్ ఏడీ చూసుకోవల్సి ఉంటుంది. హెచ్‌డీఎస్, ఆరోగ్యశ్రీ, ఇతర బడ్జెట్‌ల నిర్వహణ, పెస్ట్ కంట్రోల్, శానిటేషన్, సెక్యూరిటీ, ఇతర కాంట్రాక్ట్‌లు, ఆస్పత్రి, బోధనాస్పత్రి నిర్వహణ బాధ్యతలు అడ్మిన్ ఏడీ నిర్వహించాల్సి ఉంటుంది.



అంబాజీపేట మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నాఫెడ్ కేంద్రంలో కొబ్బరి కొనుగోలు (ఫైల్)

షెడ్యూలు ప్రకారం కొనుగోలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్బీకే స్థాయిలో కొబ్బరి కొనుగోలు చేస్తాం. రైతులు మార్కెట్ యార్డుల వద్దకు వచ్చి కొబ్బరి ఎండబెట్టి అమ్మకాలు చేయాల్సిన అవసరం ఉండదు. మేం కొనుగోలు చేసిన తరువాత సమీపంలో యార్డుకు తరలిస్తే సరిపోతోంది. సీఎం యాప్‌లో నమోదును బట్టి ఆయా ఆర్బీకేలకు ఒక షెడ్యూలు పెట్టుకుని కొబ్బరి కొనుగోలు చేస్తాం.

– యు. సుధాకరరావు, మేనేజర్, ఆయిల్‌ఫెడ్

ధాన్యంలాగే కొబ్బరీనూ..

ఆర్బీకేల ఆధ్వర్యంలో కళ్లాల వద్దే కొనుగోళ్లు ● రైతులపై తగ్గనున్న రవాణా, కూలీల భారం

- దళారీ వ్యవస్థకు పూర్తిగా చెక్
- కోనసీమలో నేటి నుంచి నాఫెడ్ కేంద్రాలు ప్రారంభం
- కొబ్బరి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశం

ఆర్బీకేల ద్వారా కళ్లాల్లోనే కొనుగోలు..

- నాఫెడ్ కేంద్రాలు సేకరించిన కొబ్బరిని ఆర్బీకేల ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- రైతులు ముందుగా ఆర్బీకేల్లో పేరు, ఇతర వివరాలు నమోదు చేయించుకోవాలి.
- ఎకరాకు నెలకు రెండు కొబ్బరి బస్తాల (క్వింటాల్) చొప్పున కొనుగోలుకు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌లు రైతులకు ధ్రువీకరణ పత్రాలిస్తారు.
- రైతుల వివరాలతో పాటు, కొబ్బరి విక్రయాలకు సంబంధించి కంటిన్యూస్ మోనిటరింగ్ ఆఫ్ అగ్రికల్చర్ ప్రైసెస్ అండ్ ప్రొక్యూర్‌మెంట్ (సీఎం యాప్)లో నమోదు చేస్తారు.
- దీని ఆధారంగా నాఫెడ్‌కు ఇంప్లిమెంట్ ఏజెన్సీగా ఉన్న ఆయిల్‌ఫెడ్ అధికారులు రైతుల వద్దకు వెళ్లి కొబ్బరి కొనుగోలు చేస్తారు.

సాక్షి అమలాపురం/ అంబాజీపేట : కొబ్బరి కొనుగోలులో దళారుల వ్యవస్థను తొలగించడంతోపాటు రైతులకు రవాణా, కూలి ఖర్చుల భారం తగ్గేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొబ్బరి ధరలు తగ్గిన నేపథ్యంలో నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్) ఆధ్వర్యంలో శనివారం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనుంది. ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లుగానే ఈ కేంద్రాల్లో కూడా కొబ్బరి కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. గతంలో మార్కెట్ యార్డుల కేంద్రంగా కొబ్బరి కొనుగోలు చేయగా, ఈసారి ఆర్బీకే స్థాయిలో కొబ్బరి కొనుగోలు చేయాలని తీసుకున్న నిర్ణయంతో రైతులకు మేలు జరగనుంది.

గతంలో ఇలా..

గతంలో రైతులు మార్కెట్ యార్డులకు ఎండు కొబ్బరిని తీసుకువెళ్లాల్సి వచ్చేది. రోజంతా అక్కడే కళ్లాలలో ఎండబెట్టేవారు. నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే కొనేవారు. లేదంటే వెనక్కి తెచ్చుకోవాల్సిందే. ఇది రైతులకు నష్టాన్ని కలగజేసేది. ఒకవేళ కొనుగోలు చేసినా నాఫెడ్‌కు తీసుకు వెళ్లడానికి రవాణా ఖర్చుతోపాటు ఎండబెట్టడం, మూటలు కట్టడానికి ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకురావాల్సి వచ్చేది. ప్రస్తుతం రోజుకు కూలి ఖర్చు రూ.600లు కాగా.. యార్డు వరకు తీసుకొస్తే రూ.వెయ్యి వరకు కూలి ఇవ్వాల్సి వచ్చేది. అధికారులే కళ్లాలు వద్దకు వచ్చి నాణ్యత నిర్ధారించి, అక్కడే కొనుగోలు చేయనున్నారు. ఇలా కొన్న కొబ్బరిని రైతులే సమీపంలోని నాఫెడ్ కేంద్రాలకు తరలించాల్సి ఉంది. రైతులపై ఈ భారం మాత్రమే పడనుంది. కూలి ఖర్చులు కలిసి రావడం అంటే రైతులకు క్వింటాల్‌కు రూ.500ల నుంచి రూ.800లు వరకు మిగలనుంది. రైతులే సొంతంగా ఎగుమతి చేస్తే కూలి ఖర్చులు కూడా కలిసివస్తాయి. ఈ విధానంవల్ల దళారుల పాత్ర దాదాపు లేనట్లే. గతంలో ఈ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన కొబ్బరి 90 శాతం దళారులదే. ఇప్పుడు రైతులు నేరుగా లబ్ధిపొందనున్నారు.

సర్కారు ప్రత్యేక చొరవతో కేంద్రం అనుమతి..

రాష్ట్రంలో మూడు లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుండగా, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 1.78 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. ఇక్కడ సగటున 106.90 కోట్ల కాయలు దిగుబడిగా వస్తాయని అంచనా. తమిళనాడు, కేరళ, కర్ణాటకల నుంచి పోటీవల్ల ఉత్తరాదికి ఎగుమతులు క్షీణించడంతో కొబ్బరి ఉత్పత్తుల ధరలు తగ్గాయి. వెయ్యి కాయల ధర రూ.7 వేలు ఉంది. ధరలు పతనం కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని నాఫెడ్ కేంద్రాల ద్వారా కొబ్బరి కొనుగోలుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి తీసుకొచ్చింది. జిల్లాలో తొలుత అంబాజీపేటలోను, తరువాత కొనుగోలు సామర్థ్యాన్ని బట్టి ముమ్మిడివరం, తాటిపాక, రావులపాలెం, నగరం మార్కెట్ యార్డుల్లో వీటిని ప్రారంభించనున్నారు. మిల్లింగ్ కోప్రా (ఎండు కొబ్బరి)ని క్వింటాల్‌కు రూ.10,860లు, బాల్‌కోప్రా (కురిడీ కొబ్బరి గుడ్డు) క్వింటాల్ రూ.11,750 చొప్పున కొనుగోలు చేయనున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో ఎండు కొబ్బరి ధర రూ.8 వేలు, కురిడీ కొబ్బరి గుడ్డు రూ.తొమ్మిది వేల నుంచి రూ.12 వేల వరకు ఉంది. ఈ కేంద్రాల ఏర్పాటువల్ల బహిరంగ మార్కెట్‌లో కొబ్బరికాయకు ధర వస్తోందని, స్థానికంగా నిల్వ ఉన్న కొబ్బరి మార్కెట్‌కు వెళ్తే వచ్చే దసరా, దీపావళికి డిమాండ్ వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

ప్లస్ 2 హెచ్‌ఎంలకు ప్రిన్సిపల్ హోదా

- 8 నుంచి ప్లస్ 2 వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు పీజీటీ గ్రేడ్
- 2025 నాటికి సీబీఎస్ఈ సిలబస్‌తోనే పదోతరగతి పరీక్షలు
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో 8 నుంచి ప్లస్ 2 వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు పీజీటీ గ్రేడ్, ప్లస్ 2 స్కూల్ హెచ్‌ఎంలకు ప్రిన్సిపల్‌గా త్వరలో హోదా మారుస్తామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఈమేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారన్నారు. విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయసంఘ ప్రతినిధులు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో 'సీబీఎస్ఈ సిలబస్ అమలు విధానాల'పై ప్రాథమిక సమీక్ష సమావేశం నిర్వహిచారు. ఈ సమావేశంలో మంత్రి బొత్స మాట్లాడుతూ త్వరలోనే పీజీటీ, ప్రిన్సిపల్ హోదా మార్పు ప్రకటిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ పరీక్ష విధానాన్ని అనుసంధానించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. 2025 నాటికి పదోతరగతి విద్యార్థులు సీబీఎస్ఈ సిలబస్‌తోనే పరీక్షలు రాసేలా సన్నద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అందుకనుగుణంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. ఈ అంశంపై నవోదయ, కేంద్రీయ విద్యాలయ యాజమాన్యాలతో కూడా చర్చిస్తామని, అన్ని అంశాలు పరిశీలించాక తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ అమలు దిశగా చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో సీబీఎస్ఈ పరీక్ష విధానం, అకడమిక్ కేలెండర్ (వేసవి సెలవులు), లాంగ్వేజీల ఎంపిక, సబ్జెక్టులు, సీబీఎస్ఈ అనుసంధానం చేసిన రాష్ట్ర పాఠశాలల్లో విద్యావిధానం అమలు తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా 8వ తరగతి నుంచి ప్లస్ 2 వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులు, హెచ్ఎంల హోదా మార్పుపై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

న్యాయవాదుల సంక్షేమానికి.. బార్ కౌన్సిల్ చర్యలు భేష్



హైకోర్టులో అడ్వొకేట్స్ వెల్ఫేర్ స్టాంప్స్ విడుదల చేస్తున్న సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

- హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ కితాబు
- అడ్వొకేట్స్ వెల్ఫేర్ స్టాంపు విడుదల

సాక్షి, అమరావతి :వృత్తి జీవితాన్ని ఆరంభించిన కొత్తలో దాదాపు ప్రతీ న్యాయవాది కూడా వృత్తిపరమైన అనిశ్చితిని, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ తెలిపారు. ప్రతీ అవసరానికీ తన సీనియర్‌పై ఆధారపడాల్సి ఉంటుందన్నారు. ఇవన్నీ కూడా వృత్తిలో సహజమేనన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం చట్టం తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇందుకు కృషిచేసిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర బార్ కౌన్సిల్, హైకోర్టు న్యాయవాదుల సంఘాలను ఆయన అభినందించారు. న్యాయవాదుల సంక్షేమం కోసం రాష్ట్ర బార్ కౌన్సిల్ చేస్తున్న కృషిని కూడా ఆయన కొనియాడారు. కోవిడ్ సమయంలో న్యాయవాదులకు బార్ కౌన్సిల్ అందించిన సాయాన్ని సీజే వివరించారు. ఆ సమయంలో బాధితులకు అందించిన సాయం భారీ మొత్తం కాకపోయినా, అది బాధిత కుటుంబాల్లో సంతోషం నింపే మొత్తమని జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ తెలిపారు.

వెల్ఫేర్ స్టాంపులతో నిధుల కొరతకు చెక్

అనంతరం.. బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు మాట్లాడుతూ, కరోనా సమయంలో న్యాయవాదులను ఆదుకునేందుకు సంక్షేమ నిధికి చెందిన నిధుల మొత్తాన్ని ఖర్చుచేశామన్నారు. మరో 100 కుటుంబాలకు పరిహారం చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చిన వెల్ఫేర్ స్టాంపులతో నిధుల కొరతను అధిగమిస్తామన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఈ స్టాంపులను తీసుకురావడంలో న్యాయశాఖ, అడ్వొకేట్ జనరల్ ఎంతో కృషిచేశారని, వారి కృషిని మరువలేమన్నారు. అడ్వొకేట్స్ వెల్ఫేర్ స్టాంపును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శుక్రవారం విడుదల చేశారు. హైకోర్టులో బార్ కౌన్సిల్ ఏర్పాటుచేసిన అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్. ద్వారకనాథ్‌రెడ్డి, చిదంబరం, రామిరెడ్డి, రోళ్ల మాధవి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమోహన్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె. జానకిరామిరెడ్డి, హైకోర్టు న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వ విద్యార్థులకు వైట్‌హౌస్ ఆహ్వానం

- గురువారం అమెరికా వెళ్లిన ప్రభుత్వ విద్యార్థుల బృందం
- నేడు యూఎన్‌వో, కొలంబియా వర్సిటీ కార్యక్రమాల్లో ప్రసంగం



న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్ కెన్నడీ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ఏపీ విద్యార్థులు

సాక్షి, అమరావతి: ఐక్యరాజ్యసమితి (యూఎన్‌వో)లో జరిగే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్డీజీ) సదస్సుకు వెళ్లిన మన రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థుల ప్రతినిధి బృందానికి అమెరికా అధ్యక్ష భవనం సందర్శించాల్సిందిగా ఆహ్వానం అందింది. శుక్రవారం నుంచి ఈ నెల 27 వరకు అమెరికాలో వివిధ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇప్పటివరకు వైట్‌హౌస్ బయటి ప్రాంతాలను చూసేందుకు మాత్రమే అనుమతినిచ్చే ఆ దేశ అధికారులు తొలిసారి మన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వైట్‌హౌస్ లోపలి ప్రదేశాలను సందర్శించే అవకాశం కల్పించడం విశేషం. యునైటెడ్ నేషన్స్‌లోని స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్‌కుమార్ సమన్వయంతో సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ బి.శ్రీనివాసరావు నేతృత్వంలో 10 మంది విద్యార్థుల బృందం గురువారం అమెరికా వెళ్లిన విషయం తెలిసిందే.

26 వరకు సదస్సులు, సమావేశాలు

మన రాష్ట్ర బృందంలోని విద్యార్థులు శనివారం ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలి (యునెస్కో)లో జరిగే సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్డీజీ) సదస్సులో పాల్గొంటారు. 17న కొలంబియా యూనివర్సిటీలో జరిగే గ్లోబల్ స్కూల్స్ సమ్మిట్‌లో రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలపై ప్రసంగిస్తారు. 20న జర్నలిస్ట్ అండ్ రైటర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూయార్క్‌లోని జాన్ జే కాలేజ్ ఆఫ్ క్రిమినల్ జస్టిస్‌లో జరిగే ఎస్‌డీఎస్ సర్వీస్ సదస్సులో పాల్గొంటారు. 22న యునైటెడ్ నేషన్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గ్లోబల్ కమ్యూనికేషన్స్‌లో జరిగే ఇంటర్నేషనల్ యూత్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు. 25న ప్రపంచబ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉన్నత ప్రతినిధులతో జరిగే సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న 'నాడు-నేడు' కార్యక్రమంపై ప్రసంగిస్తారు. 26వ తేదీన అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్స్ ఆధ్వర్యంలో జరిగే బ్యూరో ఆఫ్ సౌత్ అండ్ సెంట్రల్ ఆసియన్ అఫైర్స్‌లో పాల్గొంటారు. 27వ తేదీన అమెరికా అధ్యక్ష భవనాన్ని సందర్శించి 28న భారత్‌కు బయలుదేరతారు.

బ్రహ్మోత్సవ నవ గోవింద..!

- సెప్టెంబర్ 18 నుంచి 26 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు



పూర్తయిన క్యూలైన్ల నిర్మాణ ఏర్పాట్లు

తిరుమల: తిరుమలలో సెప్టెంబర్ 18 నుంచి 26వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను టీటీడీ శరవేగంగా పూర్తి చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే మాడ వీధుల్లో రంగవల్లులను టీటీడీ తీర్చిదిద్దింది. గ్యాలరీల్లో ఉండే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచింది. బ్రహ్మోత్సవాలు జరిగే రోజుల్లో బ్రేక్ దర్శనాలకు, సిఫారసు లేఖలను అనుమతించబోమని టీటీడీ స్పష్టం చేసింది. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులను మాత్రమే దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రివిలైజ్డ్ దర్శనాలనూ రద్దు చేసింది. బ్రహ్మోత్సవాల రోజుల్లో ఉదయం 8-10 గంటల వరకు, రాత్రి 7-9 గంటల వరకు వాహన సేవలు నిర్వహించనుంది. సెప్టెంబర్ 22న గరుడ సేవ కారణంగా ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలను టీటీడీ రద్దు చేసింది.

17న అంకురార్పణ..18న ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 17న రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వైఖానస ఆగమ శాస్త్రాన్ని అనుసరించి అంకురార్పణం జరగనుంది. ఇందులో భాగంగా శ్రీవారి తరపున సేనాధిపతి అయిన శ్రీవిష్వక్సేనుల వారు మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. అనంతరం ఆలయంలో భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్నులో నవధాన్యాలను నాటి వాటికి మొలకలొచ్చేవరకు నీరు పోస్తారు. ఆ తరువాత రంగనాయకుల మండపంలో ఆస్థానం నిర్వహిస్తారు. 18న సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. సాయంత్రం 6.15 నుండి 6.30 గంటల మధ్య మీన లగ్నంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి.

వాహన సేవల వివరాలివీ..

18న రాత్రి 9 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు 7 తలల స్వర్ణ శేషవాహనంపై (పెద్ద శేషవాహనం) మాడ వీధుల్లో భక్తులను అనుగ్రహిస్తారు. 19న ఉదయం 8 గంటలకు 5 తలల చిన్నశేష వాహనంపై, రాత్రి 7 గంటలకు శ్రీమలయప్పస్వామి వారు వీణాపాణియై హంస వాహనంపై సరస్వతిమూర్తి అవతారంలో దర్శనమివ్వనున్నారు. 20న ఉదయం 8 గంటలకు సింహ వాహనంపై, రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి వాహనంపై ఊరేగుతారు. 21న ఉదయం 8 గంటలకు శ్రీమలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై, రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహనంపై భక్తులకు అభయమిస్తారు. 22న ఉదయం 8 గంటలకు శ్రీవారు మోహినీరూపంలో శృంగారరసాధి దేవతగా దర్శనమిస్తారు. రాత్రి 7 గంటలకు గరుడ వాహనంలో ఊరేగుతారు. 23న ఉదయం 8 గంటలకు శేషాచలాధీశుడు రాముని అవతారంలో తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగుతారు. సాయంత్రం 4 గంటలకు శ్రీనివాసుడు స్వర్ణరథంపై, రాత్రి 7 గంటలకు గజవాహనంపై తిరువీధుల్లో విహరిస్తారు. 24న ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. 25న ఉదయం 6:55 గంటలకు శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. అదే రోజు రాత్రి 7 గంటలకు స్వామివారు అశ్వ వాహనంపై విహరిస్తారు. 26న ఉదయం 6 గంటలకు చక్రస్నానాన్ని, రాత్రి 7గంటలకు బంగారు తిరుచ్చి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం ధ్వజావరోహణాన్ని శాస్త్రోక్తంగా చేపడతారు. దీంతో తొమ్మిది రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ఎల్లలు దాటనున్న మాడుగుల హల్వా!

దీనినో 'బ్రాండ్'గా తీర్చిదిద్దనున్న రాష్ట్ర ప్రభుత్వం

- భౌగోళిక గుర్తింపు కోసం దామోదరం సంజీవయ్య లా వర్సిటీతో ఒప్పందం
- ఇప్పటి దాకా చిరు వ్యాపారం.. ఇకపై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్
- విదేశాలకు సైతం ఎగుమతులు
- కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం



సాక్షి, విశాఖపట్నం : నోట్లో వేసుకోగానే మైమరపించే మాడుగుల హల్వా రుచిని ప్రపంచానికి పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో దీనిని ప్రత్యేక పరిశ్రమగా అభివృద్ధి చేయడంతో పాటు.. భౌగోళిక గుర్తింపు తీసుకొచ్చేందుకు అడుగులేస్తోంది. ఇందుకోసం దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయంతో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఒప్పందం కుదుర్చుకుంది. జీడి పప్పు.. బాదం పలుకులు.. కవ్వంతో చిలికిన ఆవు నెయ్యి, ఎండు ఖర్జూరం నీళ్లు, తేనే.. గోధుమ పాలు.. వీటన్నింటినీ రాతి రుబ్బు రాయితో గంటల పాటు సానబెట్టి.. ఆపై కట్టెల పొయ్యిలో తగిన ఉష్ణోగ్రతలో తగిన పాకంతో పదునుపెట్టగానే పుట్టుకొస్తుందీ హల్వా. మాడుగులలో 1890వ సంవత్సరంలో దంగేటి ధర్మారావు కుటుంబం మాత్రమే దీనిని తయారు చేసేది. ప్రస్తుతం ఈ వ్యాపారంపై అక్కడ ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 5 వేల మందికి పైగా నిరుపేద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

మొట్టమొదటిగా 'మాడుగుల హల్వా' ఎంపిక

మాడుగుల హల్వా వ్యాపారాన్ని మరింత వృద్ధిలోకి తేవడమే కాకుండా విదేశాల్లో దర్జాగా విక్రయించేందుకు అవసరమైన చేయూతనందించేందుకు ఇకపై రాష్ట్ర ప్రభుత్వం కీలకంగా వ్యవహరించనుంది. కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ)లో భాగంగా ఈ పరిశ్రమని అభివృద్ధి చేయనుంది. ఇందుకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు సమకూరుస్తాయి. యంత్రాల్ని సమకూర్చడం, స్కిల్స్ అప్‌గ్రేడ్‌చేయడం, ప్రాసెసింగ్ ఫెసిలిటీస్ వంటివి కల్పిస్తారు. వీటితో పాటు.. మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తుంది. ఇందుకోసం రాష్ట్రంలో తొలిసారి మాడుగుల హల్వాని ఎంపిక చేశారు. ఇకపై ఈ హల్వా.. ఒక బ్రాండెడ్ ప్రొడక్ట్‌గా మార్కెట్‌లో లభించనుంది. ఇందుకు కావాల్సిన వసతుల్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుంది. పథకంలో భాగంగా ఏడాది పాటు ప్యాకేజింగ్ మెటీరియల్, గోదాముల్లో నిల్వ చేసుకునేందుకు అద్దె, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే అందిస్తుంది. ఎలాంటి పెట్టుబడి భారం లేకుండా హల్వాని విదేశాలకు ఎగుమతి చేసుకునేందుకు అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన వ్యయంలో 50 శాతం వరకూ గ్రాంట్ కింద ప్రభుత్వం సమకూరుస్తుంది.

భౌగోళిక గుర్తింపునకు ఒప్పందం..

వందేళ్ల చరిత్ర గల మాడుగుల హల్వాకు భౌగోళిక గుర్తింపు తెచ్చేందుకు దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయంతో ఏపీ ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ శుక్రవారం ఎంవోయూను కుదుర్చుకుంది. ఈ గుర్తింపు కోసం అవసరమయ్యే రుసుములు, ఇతర ఖర్చులకు సంబంధించి రూ.3 లక్షల వరకూ ప్రభుత్వమే భరించనుంది. వచ్చే ఆరు నెలల్లోపు మాడుగుల హల్వాకు కూడా భౌగోళిక గుర్తింపు వచ్చే అవకాశాలున్నాయి. ఈ గుర్తింపు వస్తే ఇక ఈ పేరుతో ఇక్కడి నుంచి తప్ప మరెవరూ, ఎక్కడా మాడుగుల హల్వాను తయారు చేయలేరు.

వారసత్వ సంపదగా గుర్తింపు



వందల ఏళ్ల చరిత్ర కలిగిన అనేక తినుబండారాలు తయారు చేసే పరిశ్రమలు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. అవన్నీ చిరు వ్యాపారం మాదిరిగానే మిగిలిపోయాయి. వాటన్నింటినీ అభివృద్ధి చేసి.. వారసత్వ సంపదగా గుర్తింపు తెచ్చేందుకు ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే మాడుగుల హల్వాకు భౌగోళిక గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకుంది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మాదిరిగా దీని అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నాం. ఆ తర్వాత మిగిలినవాటిపైనా దృష్టిపెడతాం.

– కేజే మారుతి, ఏపీ ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ మేనేజర్

రబీ ప్రణాళిక సిద్ధం చేయండి

- వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది

సాక్షి, అమరావతి: రబీ 2023-24 సీజన్ కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది అధికారులను ఆదేశించారు. ఈ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. మంగళగిరిలోని వ్యవసాయశాఖ క్యాంప్ కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ నుంచి పురుగుమందులను కూడా ఆర్బీకేల ద్వారా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సస్యరక్షణ మందులతో పాటు జిప్సం, జింక్ సల్ఫేట్ తదితర సూక్ష్మ పోషకాలు, పిచికారీకి అనువుగా ఉండే.. నీటిలో కరిగే ఎరువులను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వీటిని మార్కెట్ ధర కంటే తక్కువకు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంపిణీ చేసేముందు తప్పనిసరిగా అగ్రిటెస్టింగ్ ల్యాబ్స్‌లో పరీక్షించాలని చెప్పారు. అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలని ఆయన సూచిచారు. ఈ కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్, ఏపీ విత్తనాభివృద్ధిసంస్థ ఎండీ డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, ఎస్ఐసీ అధికారి ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'కాపు నేస్తం' నాలుగో విడత

నిడదవోలు సభలో బటన్ నొక్కి జమ చేయనున్న సీఎం జగన్ / కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన 3,57,844 మందికి లబ్ధి / నాలుగేళ్లలో అక్కచెల్లెమ్మలకు అందించిన ఆర్థిక సాయం రూ.2,029 కోట్లు

సాక్షి, అమరావతి: పార్టీ మేనిఫెస్టోలో లేకున్నా.. ఎన్నికల్లో ఎలాంటి హామీ ఇవ్వకపోయినప్పటికీ కాపు సామాజిక వర్గానికి అండగా నిలుస్తూ వరుసగా నాలుగో ఏడాదీ 'వైఎస్సార్ కాపు నేస్తం' ద్వారా ఆర్థిక సాయాన్ని అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో శనివారం జరిగే కార్యక్రమంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా నగదు జమ చేయనున్నారు. అర్హులైన 3,57,844 మంది అక్కచెల్లెమ్మలకు రూ.536.77 కోట్ల మేర ఆర్థిక సాయాన్ని విడుదల చేయనున్నారు. 'వైఎస్సార్ కాపు నేస్తం' ద్వారా 45 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన మహిళలకు ప్రభుత్వం ఏటా రూ.15,000 చొప్పున ఐదేళ్లలో మొత్తం రూ.75 వేలు ఆర్థిక సాయాన్ని అందచేస్తోంది. నేడు అందచేసే సాయంతో కలిపితే ఇప్పటివరకు పథకం ద్వారా మొత్తం రూ.2,029 కోట్లు ఆర్థిక సాయాన్ని అందించినట్లవుతోంది.



కాపులను దగా చేసిన టీడీపీ సర్కారు

టీడీపీ సర్కారు కాపులను అన్ని రకాలుగా దగా చేసింది. కాపు రిజర్వేషన్ల విషయంలో మోసం చేసింది. సంవత్సరానికి రూ.వెయ్యి కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.ఐదు వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకుండా వంచించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 52 నెలల్లో 77,00,628 మంది కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల లబ్ధిదారులకు డీబీటీ, నాన్–డీబీటీతో రూ.39,247 కోట్ల మేర లబ్ధి చేకూర్చడం గమనార్హం. కాపు కార్పొరేషన్ ద్వారా ఏడాదికి రూ.2 వేల కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొనగా అంతకంటే మిన్నగా మేలు చేయడం గమనార్హం.

నేడు నిడదవోలుకు సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి నిడదవోలు చేరుకుంటారు. అక్కడ సెయింట్ ఆంబ్రోస్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో వైఎస్సార్ కాపునేస్తం ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

నేటి నుంచి ఆరోగ్య సురక్ష సర్వే

- ఇంటింటికీ వెళ్లి వాకబు
- సమస్యలతో ఇబ్బందిపడే వారి గుర్తింపు
- సర్వేలో ఏడు రకాల పరీక్షల నిర్వహణ
- వీటి ఫలితాలు మొబైల్ యాప్‌లో నమోదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శనివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను వైద్యశాఖ ప్రారంభించనుంది. ఈ నెల 30న తొలి హెల్త్ క్యాంప్ నిర్వహించే గ్రామాలు, పట్టణాల్లో ఈ సర్వేకు శ్రీకారం చుట్టనుంది. ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలు తెలుసుకుని పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపడుతోంది. ఐదు దశల్లో ఈ కార్యక్రమం ఉంటుంది. ఈ నేపథ్యంలో.. శుక్రవారం వలంటీర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. రెండో దశలో భాగంగా సీహెచ్ఓ నేతృత్వంలో ఆశావర్కర్, వలంటీర్ ప్రజల ఇళ్లను సందర్శిస్తారు. ఈ సందర్భంగా బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, స్పూటమ్ (కఫం)టెస్ట్‌తో పాటు జ్వరం కేసులుంటే మలేరియా, డెంగ్యూ వంటి ఏడు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ టెస్టుల ఫలితాల ఆధారంగా మొబైల్ యాప్‌లో ప్రజల ఆరోగ్య వివరాలు నమోదు చేస్తారు.

30 నుంచి హెల్త్ క్యాంపుల ద్వారా వైద్య సేవలు

రాష్ట్రవ్యాప్తంగా 1.60 కోట్లకు పైగా గృహాలున్నాయి. వీటన్నింటినీ వైద్య సిబ్బంది జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్యాలపై వాకబు చేస్తారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తిస్తారు. వీరికి 30వ తేదీ నుంచి హెల్త్ క్యాంపుల ద్వారా వైద్యసేవలు అందిస్తారు. సర్వే నిర్వహణ కోసం వైద్యశాఖ యాప్‌ను రూపొందించింది. వైద్య పరీక్షలు నిర్వహణతో పాటు, పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడం ద్వారా ప్రజల ఆరోగ్య వివరాలు సిబ్బంది సేకరిస్తారు. కమిషనర్ నివాస్ అన్ని జిల్లాల డీఎంహెచ్ఓలతో శుక్రవారం కాన్ఫరెన్స్ నిర్వహించి సర్వేపై దిశా నిర్దేశం చేశారు.

జనాభా పెరుగుదలకు తగ్గట్లుగా ఓటర్లు పెరగలేదు

- ఈ విషయంపై ఎన్నికల కమిషన్ విచారణ జరపాలి
- నకిలీ ఓట్ల అంశంపై కూడా దర్యాప్తు చేయాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి పేర్ని నాని ఫిర్యాదు

2014లో మొత్తం ఓటర్లు	3,68,26,744
2019లో మొత్తం ఓటర్లు	3,98,34,776
2014కు 2019కి మధ్య పెరిగిన ఓట్లు	30,08,032
2023లో మొత్తం ఓటర్లు	3,97,96,678
2019తో పోలిస్తే 2023లో తగ్గిన ఓట్లు	38,098

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఓటర్ల పెరుగుదల నమోదు కాలేదని.. ఈ విషయంపై ఎన్నికల కమిషన్ విచారణ జరపాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ సీనియర్ నేత, మాజీమంత్రి పేర్ని నాని సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో 2014 నుండి 2019 వరకు, 2019 నుండి 2023 వరకు రాష్ట్రంలో నమోదైన ఓటర్ల సంఖ్య హెచ్చుతగ్గులకు సంబంధించిన వివరాలను ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకూ ఓటర్ల జాబితాలో 30,08,032 ఓట్లు పెరిగాయని.. కానీ, 2019 నుంచి 2023 కాలంలో 38 వేల ఓట్లు తగ్గాయని వివరించారు. అదే విధంగా.. ఓటర్ల వృద్ధి చూసినట్లయితే 2014–19 మధ్య కాలంలో 8.1 శాతం మేర వృద్ధి నమోదైందని.. 2019 నుంచి 2023 మధ్య 0.09 శాతం క్షీణత నమోదైందని తెలిపారు. గతేడాది కంటే 2023లో నికర ఓట్ల సంఖ్య తగ్గిందని, దీనిని బట్టి నకిలీ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని స్పష్టమవుతోందన్నారు. 2019 ఓటర్ల జాబితా నుండి నకిలీ ఓట్లను తొలగించే అంశాన్ని పరిశీలించి, నకిలీ ఓట్ల విషయంపై సమగ్ర విచారణ జరపాలని పేర్ని నాని కోరారు. అలాగే, 2014–2023 మధ్య జనాభా వృద్ధి రేటు 1.1 శాతం వుందని, ఈ విధంగా చూస్తే నికర ఓటర్ల సంఖ్య పెరగాలి కానీ తగ్గడంపై తమకు అనుమానాలున్నాయన్నారు. దీనికి కారణం 2014–19 సమయంలో తెలుగుదేశం పార్టీ పెద్దఎత్తున దొంగ ఓట్లను చేర్చడమే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు.

నేడు జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం

పొత్తు విషయంలో అసంతృప్త నేతలను బుజ్జగించేందుకేనని పార్టీలో చర్చ

సాక్షి, అమరావతి: టీడీపీతో పొత్తు ప్రకటన అనంతరం పార్టీలో పెరుగుతున్న అసంతృప్తి నేపథ్యంలో.. జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం శనివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జరగనుంది. పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని మీడియాకు ఆ పార్టీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఒకవైపు బీజేపీతో పొత్తు కొనసాగుతుండగానే, సొంత పార్టీ ముఖ్యనేతలెవరితోనూ చర్చించకుండా పవన్ గురువారం టీడీపీతో పొత్తు ప్రకటన చేయడం పట్ల చాలామంది అసంతృప్తి వెలిబుచ్చుతున్నారని సమాచారం. దీంతో ఆ అసంతృప్త నేతలందరినీ బుజ్జగించేందుకే హడావుడిగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు పార్టీలో అంతర్గతంగా చర్చ సాగుతోంది. గతంలో తెలుగుదేశం, చంద్రబాబుకు అనుకూలంగా పవన్‌కళ్యాణ్ ప్రకటనలు చేసినప్పుడు కూడా పార్టీలోని కీలక కాపు నేతలు తమ అసంతృప్తిని బహిర్గత పరిచారని పార్టీ నేతలు చెబుతున్నారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో కొన్ని చోట్లయినా టీడీపీ నేతల చేరికల ద్వారా సొంత పార్టీ బలోపేతం అయ్యే అవకాశం ఉందని, ఈ సమయంలో పవన్ పొత్తు ప్రకటనతో అలాంటి అవకాశాలకు గండిపడినట్టేనని జనసేన నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొంటారు.

ఏపీ చొరవతో దేశవ్యాప్తంగా పరిశ్రమలకు మేలు



- దేశంలో రూ.12 వేలకోట్లతో పరిశ్రమలకు వడ్డీ రాయితీ పథకం
- ఇందులో సగం విద్యుత్ ఆదా చర్యలు చేపట్టే ఎంఎస్ఎంఈలకు
- హైదరాబాద్‌లో జరిగిన జాతీయ ఎనర్జీ ఎఫిషియెంట్ సమ్మిట్ –2023లో బీఈఈ ప్రకటన
- ఏపీ ప్రతిపాదనలతోనే ఈ పథకాన్ని రూపొందించినట్లు బీఈఈ డీజీ అభయ్ భాక్రే వెల్లడి
- దేశంలో తొలి ఇన్వెస్ట్‌మెంట్ బజార్ ద్వారా రూ.430 కోట్లు పెట్టుబడులు సాధించిన ఏపీ

సాక్షి, అమరావతి: పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మన రాష్ట్రం దేశానికి మార్గనిర్దేశం చేస్తోంది. ఇప్పటికే అనేక రంగాల్లో ఎన్నో జాతీయస్థాయి అవార్డులను, గుర్తింపును దక్కించుకున్న ఆంధ్రప్రదేశ్.. కేంద్రప్రభుత్వ నిర్ణయాలను సైతం ప్రభావితం చేస్తోంది. దీనికి ప్రత్యక్ష నిదర్శనమే తాజాగా కేంద్ర విద్యుత్‌శాఖ ప్రవేశపెడుతున్న పరిశ్రమలకు వడ్డీ రాయితీ పథకం. దేశవ్యాప్తంగా పరిశ్రమల్లో ఇంధన సామర్థ్య కార్యక్రమాలను ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా నూతన సాంకేతిక విధానాలను అవలంభించే పరిశ్రమలకు, అవి తీసుకున్న రుణాలపై చెల్లించే వడ్డీలో కొంత రాయితీగా ఇచ్చేందుకు కేంద్ర ఆర్థికశాఖ సహకారంతో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ)తో కలిసి కేంద్ర విద్యుత్‌శాఖ ఈ పథకాన్ని తీసుకొస్తోంది. ఇందుకోసం రూ.12 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు బీఈఈ డైరెక్టర్ జనరల్ (డీజీ) అభయ్ భాక్రే చెప్పారు. ఇందులో రూ.6 వేల కోట్లను విద్యుత్ పొదుపు చర్యలను అమలు చేసే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)లకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన జాతీయ ఎనర్జీ ఎఫిషియెంట్ సమ్మిట్–2023లో ఆయన మాట్లాడారు. రెండేళ్ల కిందట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాధనల ఆధారంగానే ఈ పథకానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఇంధన సామర్థ్యరంగంలో పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. దేశంలోనే తొలి ఇన్వెస్ట్‌మెంట్ బజార్‌ను విశాఖపట్నంలో నిర్వహించిన ఏపీ ఇంధన సామర్థ్య ప్రాజెక్టుల్లో రూ.430 కోట్ల పెట్టుబడులను సాధించిందన్నారు. ఏపీని ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాల్లోను అలాంటి సదస్సులు నిర్వహించగా మొత్తం రూ.2,500 కోట్ల పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడం పారిశ్రామిక రంగానికి ప్రత్యేక వడ్డీ రాయితీ పథకాన్ని ప్రవేశపెట్టడానికి బీజం వేసిందని, అలాగే ఏపీ ఇంధనశాఖ కూడా రెండేళ్ల కిందట వడ్డీ రాయితీ కోరుతూ ప్రతిపాదనల లేఖ రాసిందని తెలిపారు.

ఇంధనం ఆదా, తగ్గుతున్న కాలుష్యం

జీ–20 సమ్మిట్‌లో ప్రపంచదేశాల నేతలు ఆశించినట్లు.. దేశంలో 2050 నాటికి కర్బన ఉద్గారాలు లేకుండా చేయాలనే లక్ష్యానికి ఈ పథకం దోహదపడుతుందని చెప్పారు. 2021–22లో బీఈఈ చర్యలతో 27.75 ఎంటీవోఈ ఇంధనం ఆదా అయిందని, 130.21 బిలియన్ యూనిట్ల విద్యుత్ పొదుపు చేశామని తెలిపారు. 175.22 మెట్రిక్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగామన్నారు. పెర్ఫార్మ్, అచీవ్ అండ్ ట్రేడ్ (పాట్) పథకం ద్వారా ఈ ఏడాది మార్చి నాటికే 13 రంగాల్లో సుమారు 26 ఎంటీవోఈ ఇంధనాన్ని ఆదా చేయడమేగాక 70 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగామని ఆయన వివరించారు. ఈ సమ్మిట్‌లో ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సీఈవో విశాల్‌కపూర్ తరఫున ఈఈఎస్ఎల్ సౌత్ సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి ఏపీలో వివిధ రంగాల్లో ఇంధన సామర్థ్య చర్యలు, ప్రభుత్వ ప్రోత్సాహంపై నివేదిక సమర్పించారు.

ఖరీఫ్ ధాన్యం సేకరణకు సన్నాహాలు

తరలించడానికి 30వేల వాహనాల ఏర్పాటు

- ఆర్బీకేల్లో వాహనాల రిజిస్ట్రేషన్ ప్రారంభం
- జీపీఎస్ ట్రాకర్ ద్వారా మిల్లుకు చేరేలా పర్యవేక్షణ
- వారంలోగా రవాణా డబ్బులు చెల్లింపు
- ధాన్యం సేకరణకు తాత్కాలిక సిబ్బంది నియామక ప్రక్రియ షురూ
- మిల్లు వద్ద డిప్యూటీ తహసీల్దార్ కేడర్ అధికారి కస్టోడియన్ అధికారిగా నియామకం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఖరీఫ్ ధాన్యం సేకరణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ సీజన్‌లో దాదాపు 40 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు విస్తృత ఏర్పాట్లుచేస్తోంది. కల్లంలో పంట కొనుగోలు దగ్గర నుంచి మిల్లుకు తరలించే వరకు ఎక్కడా జాప్యం లేకుండా రైతుకు సంపూర్ణ మద్దతు ధర అందించడమే లక్ష్యంగా ప్రత్యేకంగా రోడ్ మ్యాప్‌ను సిద్ధంచేస్తోంది. రైతుభరోసా కేంద్రం (ఆర్బీకే) స్థాయిలో ధాన్యం రవాణాకు దాదాపు 30వేలకు పైగా వాహనాలను అందుబాటులో ఉంచనుంది. ప్రైవేటు కాంట్రాక్టు వాహనాలతో పాటు రైతుల సొంత వాహనాలకు భాగస్వామ్యం కల్పిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే ఆర్బీకేల్లో వాహనాల రిజిస్ట్రేషన్లను ప్రారంభించింది. నిజానికి.. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఖరీఫ్‌లో పంట ఆలస్యంగా సాగైంది. ఫలితంగా నవంబర్ రెండో వారం తర్వాత కోతలు పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఒక్కో ఆర్బీకే క్లస్టర్‌లో పది వాహనాలు..

రాష్ట్రవ్యాప్తంగా 3,500కు పైగా ఆర్బీకే క్లస్టర్లలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తోంది. సీజన్‌లో ఒక్కో ఆర్బీకే క్లస్టర్‌లో దాదాపు 10 వాహనాలను కేటాయించనుంది. కాంట్రాక్టర్ల నుంచి ముందస్తుగా కొంత సెక్యూరిటీ డిపాజిట్లు సేకరించిన అనంతరం వారికి ధాన్యం తరలింపు కాంట్రాక్టును ఇస్తోంది. రైతుల నుంచి సేకరించిన ధాన్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం నిర్దేశించిన మిల్లుకు మాత్రమే అవి చేరేలా ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకర్ అమర్చి పర్యవేక్షించనుంది. ఆ తర్వాత బఫర్ గోడౌన్లకు తరలిస్తారు.

ఆర్బీకేల వారీగా వివరాల సేకరణ..

ధాన్యం సేకరణలో ఎటువంటి టార్గెట్లు లేకుండా రైతుల నుంచి పూర్తిస్థాయిలో పంట కొనుగోలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పౌరసరఫరాల సంస్థ ఆర్బీకేల వారీగా పంట ఎంత ఉంది? రైతులు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోగా ఎంతమేరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తుంది? అన్నదానిపై జిల్లాల వారీగా సమగ్ర నివేదికను సిద్ధంచేస్తోంది. దీని ఆధారంగా ముందస్తుగానే గోతాలు, రవాణా, హమాలీలను సమకూర్చనుంది. అలాగే, 10వేల మందికిపైగా టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లను తాత్కాలిక ప్రాతిపదికపైన నియమిస్తోంది. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో కలిపి సుమారు 4–5 నెలల పాటు యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. ఆయా జిల్లాల వారీగా జేసీల ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియను చేపట్టింది. ఎంపికైన వారికి శిక్షణ ఇవ్వనుంది.

ముందస్తు ఏర్పాట్లలో నిమగ్నం

ఇక గతంలో పంట దిగుబడి అంచనా ఆధారంగా ఒక ఎకరాకు ఎన్ని ధాన్యం బస్తాలు వస్తాయో లెక్కించేవారు. అనంతరం..ఈ–క్రాప్‌లో రైతు నమోదు చేసిన పంట విస్తీర్ణ వివరాలను, దిగుబడి అంచనాను బేరీజు వేసుకుని పౌరసరఫరాల సంస్థ రైతు నుంచి నిర్దేశించిన సంఖ్యలో ధాన్యం బస్తాలను సేకరించేది. దీంతో కొనుగోలు కేంద్రాల పరిధిలో అవసరమైన గోనె సంచులు, రవాణా వాహనాలు, హమాలీలను వంటి మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం జరిగేది. ప్రస్తుతం పంట దిగుబడి అంచనాతో సంబంధంలేకుండా గడిచిన ఐదేళ్లలో ఏ సంవత్సరం ఎక్కువ దిగుబడి వచ్చిందో ఆ సంఖ్యను ప్రస్తుత సీజన్‌కు అన్వయించుకుని కొనుగోళ్లకు ముందస్తుగానే ఏర్పాట్లుచేస్తోంది. ప్రభుత్వం రైతుకు మద్దతు ధర కల్పించడంతో పాటు గోనె సంచులు, రవాణా, హమాలీ ఖర్చులను సైతం అందిస్తోంది. టన్నుకు గోనె సంచుల వినియోగానికి రూ.85, హమాలీల కూలి రూ.220, సగటున 25 కిలోమీటర్ల ధాన్యం రవాణాకు రూ.468 చొప్పున మొత్తం జీఎల్‌టీ (గన్నీ లేబర్ ట్రాన్స్‌పోర్టు) కింద టన్నుకు రూ.2,523 లబ్ధిచేకూరుస్తోంది.

రైతులు మిల్లుకు వెళ్లొద్దు..



రైతులు ఆర్బీకేలో ధాన్యం అప్పగించిన అనంతరం ఎఫ్‌టీఓ (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) అందిస్తాం. అందులో రైతు కొనుగోలు కేంద్రానికి ఇచ్చిన ధాన్యం బరువు, ప్రభుత్వ నుంచి వచ్చే మద్దతు ధర మొత్తం ఉంటుంది. ఒక్కసారి ఎఫ్‌టీఓ ఇచ్చిన తర్వాత రైతుకు ధాన్యం బాధ్యత ఉండదు. మిల్లుకు ఆర్బీకే సిబ్బందే తరలిస్తారు. ఏదైనా సమస్య వస్తే మిల్లు వద్ద డెప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారిని కస్టోడియన్ ఆఫీసర్‌గా నియమించి పరిష్కరిస్తాం. ఆర్బీకేలో పరీక్షించిన తేమ శాతాన్ని ఫైనల్ చేస్తాం. దీనిపై రైతులకు అవగాహన కల్పించేలా వీడియోలను రూపొందిస్తున్నాం.

– హెచ్. అరుణ్‌కుమార్, కమిషనర్, పౌరసరఫరాల శాఖ

మిల్లర్లు గోనె సంచులు ఇవ్వాల్సిందే..



ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, చౌకదుకాణాలతో పాటు మిల్లర్ల నుంచి పెద్దఎత్తున గోనె సంచులు సేకరిస్తున్నాం. వీటిని ముందస్తుగా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతాం. ధాన్యం కేటాయింపులకు తగినన్ని గోనె సంచులను ముందుగానే ఆర్బీకేలకు సమకూర్చేలా మిల్లర్లకు ఆదేశాలిచ్చాం. ఇప్పటికే జిల్లా జాయింట్ కలెక్టర్లు దీనిపై దృష్టిసారించారు. మిల్లర్లు సహకరించకుంటే వారిని కస్టమ్ మిల్లింగ్ నుంచి తొలగిస్తాం.

– వీరపాండియన్, పౌరసరఫరాల సంస్థ ఎండీ

ఉత్సాహంగా టిడ్కో గృహ ప్రవేశాలు

- కాకినాడలో 1,152 ఇళ్లు లబ్ధిదారులకు అందజేత
- పాల్గొన్న మంత్రి సురేష్, ఎంపీ, ఎమ్మెల్యేలు



టిడ్కో లబ్ధిదారులకు డాక్యుమెంట్లు, తాళాలు అప్పగిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు

కాకినాడ : టీడీపీ పాలనలో జరిగిన అసంపూర్ణ నిర్మాణాలు, లోపాలను సరిచేసి ప్రైవేటు లేఅవుట్లలో ఉండే బహుళ అంతస్తుల భవనాల తరహాలో రూపుదిద్దుకున్న టిడ్కో గృహాలను శుక్రవారం జిల్లా కేంద్రం కాకినాడలో లబ్ధిదారులకు అప్పగించారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా హాజరై తొలి విడత 1,152 మందికి ఇళ్ల పత్రాలు, తాళాలు అప్పగించారు. సకల సౌకర్యాలు, మౌలిక సదుపాయాలతో సర్వాంగ సుందరంగా నిర్మితమైన ఇళ్లను చూసుకుని లబ్ధిదారులు మురిసిపోయారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తీసుకున్న చొరవ వల్ల లబ్ధిదారుల సొంతింటి కల సాకారమైందన్నారు. ఎంపీ వంగా గీత, మాజీ మంత్రి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, టిడ్కో చైర్మన్ జె.ప్రసన్నకుమార్, ఎండీ శ్రీధర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, రూ.6 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సమకూర్చిన రెండు ఉచిత బస్సులను మంత్రి సురేష్ ప్రారంభించారు.

అవినీతిపరుడిని వెనుకేసుకొస్తున్న పవన్

టీడీపీ, జనసేన పొత్తుకు ఎలాంటి అజెండా లేదని, అధికారమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ అవినీతి కేసులో జైలుకెళ్లిన చంద్రబాబును పవన్‌కళ్యాణ్ వెనకేసుకురావడాన్ని మంత్రి తప్పుబట్టారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ తీసుకుంటున్న చర్యలను గుర్తుచేశారు. దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనంతగా రాష్ట్రంలో పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలిస్తున్నట్టు చెప్పారు. అమ్మఒడి వంటి ప్రయోజనాలు కల్పించేందుకు సైతం చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

ఐదు అంశాలే ఎజెండాగా!

హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశాలకు సర్వం సిద్ధం

- తాజ్ కృష్ణా హోటల్‌లో రెండు రోజుల పాటు కాంగ్రెస్ అతిరథ మహారథుల భేటీ
- లోక్‌సభ, ఐదు రాష్ట్రాల ఎన్నికలపై ప్రత్యేక ఫోకస్
- మరో విడత 'జోడో' యాత్ర.. 'ఇండియా' కూటమి సీట్ల పంపకాలు
- పార్లమెంటు ప్రత్యేక భేటీలో అనుసరించే వ్యూహంపై చర్చించనున్న నేతలు
- శుక్రవారమే వచ్చిన 52 మంది.. నేడు సోనియా, ఖర్గే, రాహుల్, మిగతా నేతల రాక



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక మండలి అయిన 'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)' సమావేశాలకు సర్వం సిద్ధమైంది. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో శని, ఆదివారాల్లో జరగనున్న ఈ సమావేశాల్లో కాంగ్రెస్ అతిరథ మహారథులంతా పాల్గొననున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని.. శనివారం మధ్యాహ్నం సీడబ్ల్యూసీ సభ్యులకు టీపీసీసీ విందు అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు సీడబ్ల్యూసీ భేటీ మొదలవుతుందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. శని, ఆదివారాల్లో జరిగే ఈ సమావేశాల్లో ఐదు కీలక అంశాలపై కాంగ్రెస్ పార్టీ చర్చించనుంది. 'త్వరలోనే జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, భారత్ జోడో యాత్ర–2 నిర్వహణ, 2024 లోక్‌సభ ఎన్నికలు, ఆ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని పార్టీల మధ్య సీట్ల పంపకాలు, ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వైఖరి'పై కాంగ్రెస్ కీలక నేతలు చర్చించి పలు నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇదే సమయంలో దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అదానీ వ్యవహారం, ఎన్డీయేకు వ్యతిరేకంగా ఇండియా కూటమి నేతృత్వంలో చేపట్టాల్సిన పోరాట కార్యాచరణ, ఇండియా కూటమిలో లేని ప్రాంతీయ పార్టీలను ఆయా రాష్ట్రాల్లో ఎదుర్కోవాల్సిన తీరు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

తెలంగాణ పార్టీలో జోష్‌కోసం

త్వరలో తెలంగాణతోపాటు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో హైదరాబాద్‌లోనే సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహించేందుకు కాంగ్రెస్ అధిష్టానం మొగ్గుచూపింది. తెలంగాణలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గెలుపు అవకాశాలు ఉన్నాయన్న అంచనాలు ఉన్నాయని.. ఈ క్రమంలో రాష్ట్ర కేడర్‌లో జోష్ నింపడం, బీఆర్‌ఎస్‌ను దీటుగా ఎదుర్కొంటామనే సంకేతాలను ఇవ్వడం కోసం ఇక్కడ సమావేశాలు పెట్టారని చర్చ జరుగుతోంది.

శుక్రవారమే చేరుకున్న 52 మంది

సీడబ్ల్యూసీలోని సాధారణ సభ్యులతోపాటు శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులు కలిపి మొత్తం 84మంది సమావేశాలకు హాజరుకానున్నారు. శుక్రవారమే 52 మంది హైదరాబాద్‌కు చేరుకున్నారు. వీరిలో హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్‌సింగ్ సుఖు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, సీడబ్ల్యూసీ సభ్యులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, ఏకే ఆంటోనీ, రమేశ్ చెన్నితాల, కొడుక్కునిల్ సురేశ్, శశిథరూర్, రణదీప్‌సింగ్ సూర్జేవాలా, రాజీవ్‌శుక్లా, పవన్‌ఖేరా, యశోమతి ఠాకూర్, దీపేందర్ సింగ్ హుడా, ఫూలోదేవి, లాల్జీదేశాయ్, తారిఖ్ అన్వర్, మీరా కుమార్, నెట్టా డిసౌజా, అల్కా లాంబా, బీకే హరిప్రసాద్, మాణిక్యం ఠాగూర్, ఇబోబిసింగ్, ప్రతిభా సింగ్, మనీశ్ తివారీ, గౌరవ్ గొగోయ్, భక్తచరణ్‌దాస్, సుప్రియా షినాటె, దిగ్విజయ్‌సింగ్, కుమారి షెల్జా తదితరులు ఉన్నారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు సోనియా, రాహుల్, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు అశోక్ గెహ్లాట్, సిద్దరామయ్య, భూపేశ్ భగేల్, మరికొందరు నేతలు శనివారం రానున్నారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. సీడబ్ల్యూసీ, విజయభేరి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన కాంగ్రెస్ జాతీయ నేతలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఇతర నేతలు స్వాగతం పలికారు. కాగా, సీడబ్ల్యూసీ సమావేశాలు ముగిశాక 17న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో కాంగ్రెస్ 'విజయభేరి' బహిరంగ సభ జరగనుంది. సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గేలతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, సీడబ్ల్యూసీ సభ్యులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు ఈ సభలో పాల్గొననున్నారు.

సాక్షి బిజినెస్

శనివారం
16-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	320	67,839
నిఫ్టీ ▲	89	20,192

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	13,700	▽ 224
డోజోన్స్	34,606	▽ 301
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,711	▲ 38
డాక్స్	15,894	▲ 88
షాంఘై	3,118	▽ 9
నికాయ్	33,533	▲ 365

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో ముంబై	
బంగారం (24 క్యారట్)	59,016
బంగారం (22 క్యారట్)	58,780
వెండి (కిలో)	71,853

ఫారెక్స్ రేట్లు రూ.లలో			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.29	83.96
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	101.57	104.93
€	యూరో	ఒకటి	86.97	90.07
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	52.66	57.25
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.10	54.96
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.06	62.00
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్	21.75	23.54
¥	చైనా యువాన్	ఫారెక్స్	10.31	12.38

వైభవ్ జ్యువెలర్స్ @ రూ. 204-215

ఈ నెల 22-26 మధ్య ఐపీవో

సాక్షి, విశాఖపట్టణం: బంగారు ఆభరణ విక్రయ కంపెనీ వైభవ్ జ్యువెలర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 204-215 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 22న ప్రారంభమై 26న ముగియనుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 210 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 28 లక్షల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి రూ. 270 కోట్లను సమకూర్చుకోవాలని ఆశిస్తోంది. 8 కొత్త స్టోర్ల ఏర్పాటు, వీటి ఇన్వెంటరీతోపాటు సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఈక్విటీ జారీ నిధులను వినియోగించనుంది. దక్షిణాది ప్రాంత


వైభవ్ జ్యువెలర్స్ ప్రతినిధులు

కంపెనీ ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 13 షోరూములను నిర్వహిస్తోంది. మార్చితో ముగిసిన గతేడాది ఆదాయం రూ. 2,027 కోట్లను అధిగమించగా.. ఈ ఏడాది(2023-24) ఏప్రిల్-జూన్‌లో రూ. 509 కోట్ల ఆదాయం, రూ. 19 కోట్లకుపైగా నికర లాభం సాధించింది.

మెర్సిడెస్ కొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ

ధర రూ.1.39 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ఈక్యూఈ 500 4మేటిక్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని భారత్‌లో విడుదల చేసింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.1.39 కోట్లు. బ్యాటరీపై 10 ఏళ్లు లేదా 2,50,000 కిలోమీటర్ల వరకు వారంటీ ఉంది. 90.56 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 465-550 కిలో మీటర్లు ప్రయాణిస్తుంది. గంటకు గరిష్ట వేగం 210 కిలోమీటర్లు. పొడవు 4,863 మిల్లీమీటర్లు ఉంది. సీమ్‌లెస్ గ్లాస్ కవర్‌తో 12.3 అంగుళాల డ్రైవర్ డిస్‌ప్లే, 17.7 అంగుళాల ఓలెడ్ సెంట్రల్ డిస్‌ప్లే, 12.3 అంగుళాల ఓలెడ్ ఫ్రంట్ ప్యాసింజర్ డిస్‌ప్లే ఏర్పాటు



చేశారు. థర్మోట్రానిక్ ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, యాక్టివ్ స్టీరింగ్ అసిస్ట్, యాక్టివ్ లేన్ కీపింగ్ అసిస్ట్, ట్రాన్స్‌పరెంట్ బానెట్, 360 డిగ్రీల కెమెరా వంటి హంగులు ఉన్నాయి. కాగా, మెర్సిడెస్‌కు చెందిన చార్జింగ్ కేంద్రాల్లో ఇతర బ్రాండ్ల కార్లకు సైతం చార్జింగ్ సదుపాయం కల్పిస్తారు.

ఏడోనెలా ఎగుమతులు రివర్స్

- ఆగస్టులో 6.86 శాతం డౌన్
- విలువలో 34.48 బిలియన్ డాలర్లు
- దిగుమతులు తొమ్మిదో నెలా క్షీణ బాట
- విలువలో 58.64 బిలియన్ డాలర్లు
- వాణిజ్యలోటు 24.16 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, మందగమన పరిస్థితులను ప్రతిబింబిస్తూ ఎగుమతి-దిగుమతి గణాంకాలు వెలువడుతున్నాయి. భారత్ వస్తు ఎగుమతులు వరుసగా ఏడవనెల వృద్ధిలేకపోగా క్షీణబాటనే నడిచాయి. దిగుమతుల విషయంలో ఈ క్షీణత తొమ్మిది నెలల నుంచి నమోదవుతోంది. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- ఆగస్టులో ఎగుమతులు 2022 ఇదే నెలతో పోల్చితే 6.86 శాతం తగ్గి 34.48 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- ఇదే నెల్లో దిగుమతులు 5.23 శాతం క్షీణించి 58.64 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- ఎగుమతులు-దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం- వాణిజ్యలోటు 24.16 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. జూలైలో ఈ విలువ 20.67 బిలియన్‌లు కావడం గమనార్హం.
- ఎగుమతుల రంగంలో తేయాకు, కాఫీ, బియ్యం, సుగంధ ద్రవ్యాలు, తోలు, రత్నాలు-ఆభరణాలు, జౌళి, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు పడిపోయాయి. అయితే ముడి ఇనుము, ఎలక్ట్రానిక్ గూడ్స్, ఆయిల్ సీడ్స్, జీడిపప్పు, తివాచీ, ఇంజనీరింగ్, ఫార్మా, సముద్ర ఉత్పత్తులుసహా మొత్తం 30 కీలక రంగాల్లో 15 సానుకూల వృద్ధి రేటును నమోదుచేసుకున్నాయి.

ఆర్థిక సంవత్సరం ఐదు నెలల్లో...

కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ ఐదు నెలల్లో ఎగుమతులు 11.9 శాతం క్షీణించి 172.95 బిలియన్ డాలర్లుగా నమోదుకాగా, దిగుమతుల విలువ 12 శాతం క్షీణించి 271.83 బిలియన్ డాలర్లుగా ఉంది. వెరసి వాణిజ్యలోటు 98.88 బిలియన్ డాలర్లు.

పసిడి దిగుమతులు రయ్...

పసిడి దిగుమతులు ఆగస్టులో 38.75% పెరిగి 4.93 బిలియన్ డాలర్లుగా నమోదవగా, ఆగస్టు-ఏప్రిల్ మధ్య 10.48% పెరుగుదలతో 18.13 బిలియన్ డాలర్లుగా పసిడి దిగుమతుల విలువ ఉంది.

రష్యా నుంచి దిగుమతులు రెట్టింపు

రష్యా నుంచి భారత్ దిగుమతులు ఏప్రిల్-ఆగస్టు మధ్య రెట్టింపయ్యాయి. క్రూడ్ ఆయిల్, ఎరువుల దిగుమతులు పెరగడం దీనికి ప్రధాన కారణమని వాణిజ్య మంత్రిత్వశాఖ గణాంకాలు వెల్లడించాయి. 2022 ఏప్రిల్-ఆగస్టు మధ్య రష్యా నుంచి దిగుమతుల విలువ 13.77 బిలియన్ డాలర్లుకాగా, తాజా సమీక్షా కాలంలో ఈ విలువ 25.69 బిలియన్ డాలర్లకు ఎగసింది. చైనా, అమెరికాల తర్వాత రష్యా చమురు కొనుగోలులో భారత్‌ది మూడవ స్థానం. ఇక చైనా నుంచి దిగుమతులు ఈ ఐదు నెలల కాలంలో 43.96 బిలియన్ డాలర్ల నుంచి 42 బిలియన్ డాలర్లకు తగ్గాయి.

జోస్ ఆలుక్కాస్ 'పరంపర' కలెక్షన్ ఆవిష్కరణ

చెన్నై: జోస్ ఆలుక్కాస్.., భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలతో స్ఫూర్తి పొందిన ఆభరణాల శ్రేణి 'పరంపర' కలెక్షన్‌ను విడుదల చేసింది. చెన్నైలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో దక్షిణాది నటి కీర్తి సురేష్ 'పరంపర'ను ఆవిష్కరించారు. ఎండీ వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కాల సమక్షంలో ఆవిష్కరణ జరిగింది. ఈ సిరీస్‌లో కృష్ణుడు, గణేశుడు తదితదిర దేవతామూర్తుల ప్రతిరూపాలతో సహా నెమళ్ళు, ఏనుగులు, హంసల లావణ్యం, ప్రతీకాత్మకల నుంచి ప్రేరణ పొందిన వజ్రాభరణాలు ఉన్నాయి. తక్కువ ఖర్చుతో కూడిన శ్రామిక శక్తిని వినియోగించడం ద్వారా అత్యంత తక్కువ ధరలకు వీటిని కస్టమర్లకు అందించగలుగుతామని కంపెనీ చైర్మన్ జోస్ ఆలుక్కాస్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-9-2023	
విశాఖ	510-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
15-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	480-00
వరంగల్	482-00
రిటైల్ ధర	4.85

బుల్ రికార్డుల పరుగు..

సరికొత్త శిఖరాలపై సూచీలు

- ఇంట్రాడే, ముగింపులోనూ తాజా గరిష్టాలు నమోదు
- 16 ఏళ్ల తర్వాత వరుస లాభాలతో సుదీర్ఘ ర్యాలీ చేసిన సెన్సెక్స్
- కలిసొచ్చిన ప్రపంచ పరిణామాలు, ఎఫ్‌ఐఐల తాజా కొనుగోళ్లు



సెన్సెక్స్ సూచీలో మైలురాళ్లు

- ఈ జూలై 18న తొలిసారి 67,000 స్థాయిని అందుకుంది. ఆ మరుసటి రోజు(జూలై 19న) తొలిసారి 67,000 స్థాయిపైన ముగిసింది.
- ఈ జూలై 13న తొలిసారి 66,000 స్థాయిని తాకింది. ఆ మరుసటి రోజు(జూలై 14) తొలిసారి 66,000 స్థాయిపైన ముగిసింది.
- ఆ జూలై 3న 65,000 స్థాయిని అధిరోహించడంతో పాటు ఈ కీలక స్థాయిపైన ముగిసింది.
- 2021 ఏడాది సెప్టెంబర్ 24న 60 వేల స్థాయిని ఛేదించడంతో పాటు అదే రోజున 60 వేల పాయింట్లపైన ముగిసింది.

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూలతలు, విదేశీ ఇన్వెస్టర్ల తాజా కొనుగోళ్ల అండతో శుక్రవారం స్టాక్ సూచీలు ఇంట్రాడే, ముగింపులోనూ జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. ఫైనాన్స్, బ్యాంకింగ్, ఐటీ, టెలికం షేర్లు రాణించి సూచీలకు ర్యాలీకి దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ 320 పాయింట్లు పెరిగి 67,839 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 408 పాయింట్లు బలపడి 67,927 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 89 పాయింట్లు పెరిగి 20,192 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 119 పాయింట్లు ఎగసి 20,222 స్థాయిని తాకింది. ఇంట్రాడే, ముగింపులు ఇరు సూచీలకి జీవితకాల గరిష్ట స్థాయి కావడం విశేషం. ఎఫ్‌ఎంసీజీ, మెటల్, మీడియా, రియల్టీ షేర్లు స్వల్పంగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.164 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,939 కోట్ల షేర్లను కొన్నారు. ఇటీవల విడుదలైన అమెరికా, చైనా ఆర్థిక గణాంకాలు మెప్పించడం, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ కీలక వడ్డీరేట్లు గరిష్టానికి చేరుకోవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 1,240 పాయింట్లు, నిఫ్టీ 372 పాయింట్లు పెరిగాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, ఆర్థిక సేవల సంస్థ క్రెడిట్ స్వీస్‌కి 1.5 మిలియన్ డాలర్ల చెల్లింపు ప్రక్రియ పూర్తి చేయడంతో స్పైస్‌జెట్ షేరు ట్రేడింగ్‌లో 4% ర్యాలీ చేసి రూ.40 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో చివరికి అరశాతం స్వల్పలాభంతో రూ.38.54 వద్ద వద్ద ముగిసింది.
- సెన్సెక్స్ 11 ట్రేడింగ్ సెషన్‌లో 3,008 పాయింట్లు(4.63%) ర్యాలీ చేయడంతో బీఎస్‌ఈలో మొత్తం రూ.14 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.323 లక్షల కోట్లకు చేరింది.
- పండుగ సీజన్ డిమాండ్, అధిక సంఖ్యలో ఆర్డులు పెరగొచ్చనే ఆశావహ అంచనాలతో ఆటో, ఐటీ షేర్లకు డిమాండ్ లభించింది. బీఎస్‌ఈ ఆటో ఇండెక్సు 1.50%, ఐటీ ఇండెక్సు ఒకశాతం లాభపడింది.
- చివరి రోజు నాటికి ఆర్ఆర్ కేబుల్స్ ఐపీవోకు 18.69 రెట్ల అధిక స్పందన లభించింది. ఇష్యూలో కంపెనీ 1.33 కోట్ల ఈక్విటీలు జారీ చేయగా 24.88 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 52.26 రెట్లు, సంస్థాగతేర విభాగం 13.23 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 2.13 రెట్లు సబ్‌స్క్రైబయ్యాయి. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల ద్వారా ఈ మంగవారం రూ.586 కోట్లు సమీకరించింది.

నీల్సన్ సీఈవోగా భారతీయుడు

కార్తీక్ రావు నియామకం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ దిగ్గజాలకు సారథ్యం వహిస్తున్న భారతీయుల సంఖ్య మరింతగా పెరుగుతోంది. తాజాగా అంతర్జాతీయ మార్కెట్ రీసెర్చ్ సంస్థ నీల్సన్‌కు సీఈవోగా కార్తీక్ రావు నియమితులయ్యారు. ఆయన నియామకం తక్షణం అమల్లోకి వచ్చింది. 2018 నుంచి సీఈవోగా ఉన్న డేవిడ్ కెన్నీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా పదోన్నతి పొందారు. కార్తీక్ రావు సుదీర్ఘకాలంగా నీల్సన్‌లోని వివిధ విభాగాల్లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తదితర హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. చెన్నైలనోని లయోలా యూనివర్సిటీలో డిగ్రీ (ఎకనామిక్స్) చదివిన కార్తీక్ రావు, అమెరికాలోని ఇలినాయిస్ స్టేట్ యూనివర్సిటీలో ఎంబీఏ పట్టా పొందారు.



సాక్షి స్పోర్ట్స్



అంతిమ్‌పైనే ఆశలు

బెల్‌గ్రేడ్: ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత పొందడమే లక్ష్యంగా నేటి నుంచి బెల్‌గ్రేడ్‌లో మొదలుకానున్న ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు బరిలోకి దిగనున్నారు. ఈనెల 24 వరకు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో మొత్తం 30 వెయిట్ కేటగిరీల్లో (పురుషుల ఫ్రీస్టయిల్ 10, గ్రీకో రోమన్ 10, మహిళల ఫ్రీస్టయిల్ 10) పోటీలు నిర్వహించనుండగా... ఇందులో 18 ఒలింపిక్ వెయిట్ కేటగిరీలు... 12 నాన్ ఒలింపిక్ కేటగిరీలు ఉన్నాయి. ఒలింపిక్ వెయిట్ కేటగిరీల్లో టాప్-5లో నిలిచిన రెజ్లర్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. భారత్ నుంచి మహిళల ఫ్రీస్టయిల్ 50 కేజీల విభాగంలో జూనియర్ ప్రపంచ చాంపియన్ అంతిమ్ పంఘాల్‌పైనే ఆశలు ఉన్నాయి. అంతర్గత వివాదాల కారణంగా భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ)పై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు తటస్థ క్రీడాకారులుగా పోటీపడుతున్నారు.


'హెచ్‌సీఏ' కమిటీపై ఉత్తర్వులు ఇవ్వవద్దు

తెలంగాణ హైకోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న జస్టిస్ (రిటైర్డ్) ఎల్.నాగేశ్వరరావు కమిటీకి సంబంధించి దిగువ కోర్టులు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వరాదని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధూలియాలతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది. హెచ్‌సీఏ కమిటీ రద్దయిన నేపథ్యంలో అసోసియేషన్ కార్యకలాపాలను చక్కదిద్దేందుకు గత ఫిబ్రవరిలో ఎల్. నాగేశ్వరరావుతో ఏకసభ్య కమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. అయితే హెచ్‌సీఏ ఎన్నికల అంశం వ్యవహారం సహా ఇతర అంశాల్లో పలువురు హెచ్‌సీఏ సభ్యులు పదే పదే వేర్వేరు కారణాలతో కోర్టును ఆశ్రయిస్తున్నారు. వీరి పిటిషన్ల తర్వాత హైకోర్టుతో పాటు జిల్లా కోర్టులు కూడా కొన్ని ఆదేశాలు జారీ చేశాయి. ఈ విషయం సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. హెచ్‌సీఏ ప్రస్తుత స్థితికి సంబంధించి సుప్రీంకోర్టులోనే పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై తీర్పు ఇచ్చే అధికారం అత్యున్నత న్యాయస్థానానికి ఉందని సుప్రీం అభిప్రాయపడింది. అసలు అలాంటి పిటిషన్‌లను అనుమతించడమే తప్పని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. హైకోర్టు లేదా జిల్లా కోర్టులు ఎలాంటి ఆదేశాలు ఇచ్చిన చెల్లవని కూడా స్పష్టం చేసిన సుప్రీంకోర్టు... తదుపరి విచారణను అక్టోబర్ 31కి వాయిదా వేసింది.

మెక్‌గిల్‌పై డ్రగ్స్ సరఫరా ఆరోపణలు



సిడ్నీ: ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ స్టువర్ట్ మెక్‌గిల్ డ్రగ్స్ సరఫరా ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. దీనికి సంబంధించి స్థానిక పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. 2021 ఏప్రిల్‌లో కొందరు వ్యక్తులు తనను కిడ్నాప్ నకు ప్రయత్నించి కొట్టారంటూ మెక్‌గిల్ ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు దర్యాప్తు చేయగా కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆరుగురు నిందితులను విచారించగా, డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిలో మెక్‌గిల్ కూడా ఒకడని... అందులో వచ్చిన విభేదాల వల్లే కిడ్నాప్ ఉదంతం జరిగిందని తెలిసింది. 52 ఏళ్ల ఈ లెగ్‌స్పిన్నర్ ఆస్ట్రేలియా తరఫున 44 టెస్టుల్లో 208 వికెట్లు పడగొట్టాడు.

భారత్‌కు బంగ్లా షాక్

- 6 పరుగులతో ఓడిన టీమిండియా
- గిల్ శతకం వృథా
- రేపు భారత్, శ్రీలంక ఫైనల్


శుబ్‌మన్ గిల్

కొలంబో: ఆసియా కప్‌లో అనూహ్య ఫలితం... 'సూపర్-4' దశలో రెండు ఘన విజయాలతో ముందే ఫైనల్ స్థానం ఖాయం చేసుకున్న భారత్‌కు చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ చేతిలో ఓటమి ఎదురైంది. ప్రాధాన్యత లేని మ్యాచ్‌లో ముగ్గురు ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి బరిలోకి దిగిన టీమిండియా చివరకు ఓటమి పక్షాన నిలిచింది. అయితే ఈ గెలుపు బంగ్లాదేశ్ ప్రదర్శనను తక్కువ చేసేది కాదు. ముందే ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించినా చివరి వరకు స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబర్చిన ఆ జట్టు చెప్పుకోదగ్గ విజయంతో స్వదేశానికి వెళ్లనుంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 6 పరుగుల తేడాతో భారత్‌పై గెలిచింది. ఆసియా కప్‌లో గతంలో ఒకే ఒకసారి భారత్‌ను (2012)ఓడించిన బంగ్లాకు ఇది రెండో విజయం.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. కెప్టెన్ షకీబ్ అల్ హసన్ (85 బంతుల్లో 80; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), తౌహీద్ హృదయ్ (81 బంతుల్లో 54; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), నసుమ్ అహ్మద్ (45 బంతుల్లో 44; 6 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. 49 పరుగులకే జట్టు 4 వికెట్లు కోల్పోగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబ్, తౌహీద్ ఐదో వికెట్‌కు 101 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. భారత బౌలర్లలో శార్దుల్ 3, షమీ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 49.5 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌటైంది. శుబ్‌మన్ గిల్ (133 బంతుల్లో 121; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెరీర్‌లో ఐదో సెంచరీతో చెలరేగాడు. ప్రతికూల పరిస్థితుల్లో స్పిన్‌కు బాగా అనుకూలిస్తున్న పిచ్‌పై అతను పట్టుదల కనబర్చి నిలబడ్డాడు. అయితే ఇతర బ్యాటర్ల వైఫల్యంతో జట్టుకు ఓటమి తప్పలేదు. చివర్లో అక్షర్ పటేల్ (34 బంతుల్లో 42; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడినా లాభం లేకపోయింది. ముస్తఫిజుర్ 3 వికెట్లు తీయగా... అరంగేట్ర బౌలర్ తన్‌జీమ్, మెహదీ హసన్ చెరో 2 వికెట్లు తీశారు. ఈ మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా ఆదివారం జరిగే ఫైనల్లో శ్రీలంకతో భారత్ తలపడనుంది. ఈ మ్యాచ్‌తో హైదరాబాదీ ఎడంచేతి వాటం బ్యాటర్ తిలక్ వర్మ వన్డేల్లోకి అడుగు పెట్టాడు. భారత్ తరఫున వన్డేలు ఆడిన 252వ ఆటగాడిగా తిలక్ నిలిచాడు. ఈ మ్యాచ్‌కు ముందే తిలక్ 7 టి20ల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.


షకీబ్, ముస్తఫిజుర్



స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తన్‌జీద్ (బి) శార్దుల్ 13; లిటన్ దాస్ (బి) షమీ 0; అనాముల్ (సి) రాహుల్ (బి) శార్దుల్ 4; షకీబ్ (బి) శార్దుల్ 80; మిరాజ్ (సి) రోహిత్ (బి) అక్షర్ 13; తౌహీద్ (సి) తిలక్ (బి) షమీ 54; షమీమ్ (ఎల్బీ) (బి) జడేజా 1; నసుమ్ (బి) ప్రసిధ్ 44; మెహదీ హసన్ (నాటౌట్) 29; తన్‌జీమ్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 265.** **వికెట్ల పతనం:** 1-13, 2-15, 3-28, 4-59, 5-160, 6-161, 7-193, 8-238. **బౌలింగ్:** షమీ 8-1-32-2, శార్దుల్ 10-0-65-3, ప్రసిధ్ 9-0-43-1, అక్షర్ పటేల్ 9-0-47-1, తిలక్ 4-0-21-0, జడేజా 10-1-53-1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) అనాముల్ (బి) తన్‌జీమ్ 0; గిల్ (సి) తౌహీద్ (బి) మెహదీ 121; తిలక్ (బి) తన్‌జీమ్ 5; కేఎల్ రాహుల్ (సి) షమీమ్ (బి) మెహదీ 19; ఇషాన్ కిషన్ (ఎల్బీ) (బి) మిరాజ్ 5; సూర్యకుమార్ (బి) షకీబ్ 26; జడేజా (బి) ముస్తఫిజుర్ 7; అక్షర్ (సి) తన్‌జీద్ (బి) ముస్తఫిజుర్ 42; శార్దుల్ (సి) మిరాజ్ (బి) ముస్తఫిజుర్ 11; షమీ (రనౌట్) 6; ప్రసిధ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (49.5 ఓవర్లలో ఆలౌట్) 259.** **వికెట్ల పతనం:** 1-2, 2-17, 3-74, 4-94, 5-139, 6-170, 7-209, 8-249, 9-254, 10-259. **బౌలింగ్:** తన్‌జీమ్ 7.5-1-32-2, ముస్తఫిజుర్ 8-0-50-3, నసుమ్ 10-0-50-0, షకీబ్ 10-2-43-1, మెహదీ హసన్ 9-1-50-2, మిరాజ్ 5-0-29-1.

బోపన్న చివరిపోరు...

నేటి నుంచి భారత్, మొరాకో డేవిస్ కప్ మ్యాచ్

లక్నో: ప్రపంచ పురుషుల టీమ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ డేవిస్ కప్‌లో తన ప్రస్థానాన్ని ముగించడానికి భారత డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న సిద్ధమయ్యాడు. మొరాకోతో నేడు మొదలయ్యే వరల్డ్ గ్రూప్-2 డేవిస్ కప్ మ్యాచ్‌లో భారత జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. 2002లో తొలిసారి డేవిస్ కప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 43 ఏళ్ల బోపన్న 32 మ్యాచ్‌లు ఆడి 22 మ్యాచ్‌ల్లో విజయం అందుకున్నాడు. తొలి రోజు శనివారం రెండు సింగిల్స్ జరుగుతాయి. యాసిన్ దిల్మీతో శశికుమార్ ముకుంద్, ఆడమ్ మౌన్‌డిర్‌తో సుమిత్ నగాల్ ఆడతారు. ఆదివారం ఒక డబుల్స్‌తోపాటు రెండు రివర్స్ సింగిల్స్‌ను నిర్వహిస్తారు. డబుల్స్ మ్యాచ్‌లో రోహన్ బోపన్న-యూకీ బాంబ్రీ జోడీ ఇలియట్ బెన్‌చిట్రి-యూనస్ లారూసి జంటతో ఆడుతుంది. రివర్స్ సింగిల్స్‌లో యాసిన్ దిల్మీతో సుమిత్ నగాల్, ఆడమ్ మౌన్‌డిర్‌తో శశికుమార్ ముకుంద్ తలపడతారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ మ్యాచ్‌కు సంబంధించి 'డ్రా' వివరాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డేవిస్‌కప్ కెరీర్‌ను ముగిస్తున్న రోహన్ బోపన్నను సన్మానించారు.




క్లాసెన్ విధ్వంసం

83 బంతుల్లో 13 ఫోర్లు, 13 సిక్స్‌లతో 174

సెంచూరియన్: ఆస్ట్రేలియాతో శుక్రవారం జరిగిన నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికా బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ తన విశ్వరూపం ప్రదర్శించాడు. 83 బంతుల్లో 13 ఫోర్లు, 13 సిక్స్‌లు బాది 174 పరుగులు సాధించాడు. 38 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న క్లాసెన్ 57 బంతుల్లో సెంచరీని అందుకున్నాడు. ఆ తర్వాత 26 బంతుల్లో మరో 74 పరుగులు సాధించాడు. మిల్లర్ (45 బంతుల్లో 82 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), డసెన్ (62; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా అదరగొట్టారు. దాంతో తొలుత దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 416 పరుగులు సాధించింది. ఈ క్రమంలో వన్డేల్లో అత్యధికంగా ఏడుసార్లు 400 అంతకంటే ఎక్కువ పరుగులు సాధించిన జట్టుగా దక్షిణాఫ్రికా రికార్డు నెలకొల్పింది. భారత్ ఆరుసార్లు ఈ ఘనత సాధించింది. మరోవైపు ఆస్ట్రేలియా స్పిన్నర్ ఆడమ్ జంపా 10 ఓవర్లలో 113 పరుగులిచ్చాడు. వన్డే మ్యాచ్‌లో అత్యధిక పరుగులిచ్చిన బౌలర్‌గా మిక్ లూయిస్ (10 ఓవర్లలో 113; ఆస్ట్రేలియా; 2006లో దక్షిణాఫ్రికాపై) పేరిట ఉన్న చెత్త రికార్డును జంపా సమం చేశాడు. 417 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 34.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. అలెక్స్ క్యారీ (77 బంతుల్లో 99; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ కోల్పోయాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు జట్లు 2-2తో సమంగా ఉన్నాయి. చివరిదైన ఐదో వన్డే ఆదివారం జరుగుతుంది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



Reliance
Growth is Life
Reliance digital
PERSONALISING TECHNOLOGY
మీరు వినాయకుడిని తెచ్చుకోండి మీ ఇంటికి, టెక్ డెలివరీ అవుతుంది సమయానికి.
#MakeFriendsWithTechnology
వినాయక చవితి స్పెషల్ ఆఫర్లు 16 నుండి 19 సెప్టెంబరు
10% వరకు ఇన్‌స్టెంట్ డిస్కౌంట్*
AU SMALL FINANCE BANK | Bank of Baroda Credit Card | HDFC BANK | ICICI Bank | IDFC FIRST Bank CREDIT CARDS | onecard
CREDIT CARD | EMI
₹ 5000 వరకు ఇన్‌స్టెంట్ డిస్కౌంట్*
ON ALL CREDIT & DEBIT CARDS
(On purchase of ₹60 000 & above)
*ఇవాళ కొనండి ఇక పొందండి డెలివరీ మరియు ఇన్‌స్టలేషన్‌ని వినాయక చవితినాడు 18 సెప్టెంబరు
*ఆఫర్ కేవలం మొదటి 100 కస్టమర్లకు మాత్రమే వర్తిస్తుంది
SIDE BY SIDE REFRIGERATORS
Starting from ₹51 990*
EMIs of ₹4333/-
7 Kg. TOP LOAD WASHING MACHINE
Starting from ₹13 990*
EMIs of ₹1166/-
4K UHD
140 CM (55) UHD TVs
Starting from ₹29 990
BPL | LG | SAMSUNG | SANSUI SONY | RECONNECT
Hisense VIVID TV
109 CM (43) HISENSE ANDROID TV 43A4G
₹34 990 ₹19 990
TCL Google TV P635
146 CM (58) ₹89 990 ₹35 490*
165 CM (65) ₹1 24 990 ₹46 990*
189 CM (75) ₹2 54 990 ₹74 990*
*Price after Cashback
LG NanoCell ULTRA BRIGHT PANEL
139CM (55) 55NANO83 ₹99 990 ₹59 990*
165CM (65) 65NANO83 ₹1 59 990 ₹89 990*
UP TO 10% CASHBACK MAX UP TO ₹7500/-* ON LEADING BANK
SAMSUNG Neo QLED
Starting from ₹99 990*
*Price after Cashback
BENEFITS GET 40% OFF ON SELECT SAMSUNG SOUNDBAR
NEW LAUNCH
VIVO V29E
• 50MP Front Camera
• 7.57 mm Slim body
₹31 999 Starting from ₹26 999*
Cashback upto 2500 in SBI CC
iPhone DEAL PRICE
13 128GB ₹69 900 Starting from ₹56 900
14 128GB ₹79 900 Starting from ₹65 900
NEW LAUNCH
SAMSUNG GALAXY FOLD 5/ FLIP 5
• Snapdragon 8 Gen 2
• Dynamic AMOLED Display
₹99 999 Starting from ₹85 999*
*price post upgrade and cashback
BENEFITS GET ₹5000 LOYALTY BONUS EXTRA ON CARD TRANSACTION
DEAL MODEL
SAMSUNG GALAXY S23 ULTRA
₹1 24 999 ₹1 06 999*
*Price post cashback & upgrade bonus
BENEFITS GET ₹5000 LOYALTY BONUS EXTRA ON CARD TRANSACTION
MULTITASKING
AMD R5 Starting at ₹43 990*
Intel Core i5 Starting at ₹46 990*
GAMING
GTX 1650 Starting at ₹44 990*
RTX 3050 Starting at ₹55 990*
PRICE POST PROMO, CASHBACK, EXCHANGE BENEFIT & STUDENT DISCOUNT AS PER APPLICABLE
AIRPODS PRO
1ST GEN
₹26 300 ₹15 990*
WATCH S8 41MM GPS
₹45 900 ₹39 009*
SOUNDBAR
Starting from ₹4999*
LG 3.1.2 CHANEL SOUNDBAR SP8A
₹59 990 ₹24 990*
PARTY SPEAKERS
30% OFF* *ON SELECT MODELS
FREE** TWS WORTH ₹4490 + MIC
8 Kg. TOP LOAD WASHING MACHINE ₹18 490*
8 Kg. FRONT LOAD WASHING MACHINE ₹35 490*
FROST FREE REFRIGERATORS
256 L ₹25 990*
363 L ₹36 990*
SIDE BY SIDE REFRIGERATORS
HAIER 630 L ₹59 990* EMIs of ₹4999/-
LG 655 L ₹74 990* EMIs of ₹6583/-
SAMSUNG 653 L ₹1 00 990* EMIs of ₹8416/-
FREE** 10 KG TOP LOAD WASHING MACHINES WORTH ₹32 500 (ON SELECT SAMSUNG SBS*)
BREAKFAST COMBO
KELVINATOR SANDWICH MAKER
PRESTIGE 1.5L KETTLE
BUTTERFLY HOT N COLD BOTTLE
₹5043 ₹2099*
CONVECTION MICROWAVES
SAMSUNG 28L CONVECTION ₹16 600*
LG 28L CONVECTION ₹19 900*
LG 28L WI-FI ENABLED ₹22 900*
SAMSUNG | LG | KELVINATOR | BPL | IFB | HAIER
*Prices are after bank cashback
అద్భుతమైన డీల్స్ మరియు క్యాష్‌బ్యాక్ ఆఫర్స్ | గ్యారంటీడ్ ఉత్తమ ధర | సాటిలేని ఎలక్ట్రానిక్స్ శ్రేణి | సజావుగా ఇన్‌స్టాలేషన్ మరియు డెలివరీ
NOW OPEN AT:
• VIJAYAWADA: ELURU ROAD {CHUTTUGUNTA}
• GUNTUR: KOTHAPET, OPP METRO THEATER
Reliance resQ వర్ధంటెల్లే రిపెయిన్ | సర్వీస్ | మెయింటెనెన్స్ 1800 889 1044
150+ టీవీలు | 100+ ల్యాప్‌టాప్స్ | 200+ స్మార్ట్‌ఫోన్స్ | 100+ ఏసీలు | 100+ వాషింగ్ మెషీన్లు | 80+ రిఫ్రిజిరేటర్స్ - మరెన్నో
ALSO SHOP ON: reliancedigital.in
SHOP ANY ELECTRONICS AT MY JIO STORE
Jio DIGITAL LIFE
VISIT US AT: VIJAYAWADA: PATAMATA, GROUND & FIRST FLOOR, SRI CHAKRA TOWERS, OPP DURGA MAHAL THEATER PH: 0866-2466000 | 6301970107 • VIJAYAWADA: LEPL CENTRO MALL, MG ROAD, OPP HOTEL FORTUNE MURALI, BACK SIDE OF LIFESTYLE, LABBIPET PH: 0866-2466603/2466604 • VIJAYAWADA: BHAVANIPURAM, ADJACENT TO SRIRASTU FUNCTION HALL, CHURCH CENTER PH: 0866-2417013/14 • VIJAYAWADA: TADEPALLI, NEAR PATHUR CROSSROADS, MAIN ROAD, TADEPALLI, PH: 6281113898 | 8074582587 • VIJAYAWADA: ENIKEPADU, NH 5 OPP: SRI SHAKTI PELLI PANDIRI PH: 9381387220 |6301104338 • VIJAYAWADA: ELURU ROAD, CHUTTUGUNTA PH: 9321997487 |9321997489 • GUDIVADA: ELURU ROAD, GUDIVADA, PH: 8247210092 |8247270023 • BHIMAVARAM: FIRST FLOOR, COASTAL CITY CENTRE MALL (AVG CINEMAS), UNDI ROAD, WEST GODAVARI PH: 8828932475 | 76 • ELURU: VISIT US AT 2ND & 3RD FLOOR, CENTRAL PLAZA, PATHEBAD MAIN ROAD, RR PETA PH: 9390705656 |8688231199 • TADEPALLIGUDEM: JUBILEE ROAD, OPPOSITE RAILWAY STATION, NEAR AXIS BANK, PH: 8591402698/8591402697 • NELLORE: LECTURERS COLONY, MINI BYPASS ROAD PH: 8591404512/13 • NELLORE: OPPOSITE KASTURIBA KALAKSHETRAM, BESIDE POLICE GROUNDS, DURGAMITTA PH: 8591402738/55 • CHIRALA: MUNTAVARI CENTER CHIRALA TOWN, PH: 08594 – 232211 • ONGOLE: 1ST FLOOR, PMK NAIDU PROPERTY, BESIDE NAVABARATH THEATRE, GUNTUR ROAD PH: 08592-283601/283603 • NARSARAOPET: BESIDE SRINIDHI HOTEL, ARUNDALPET PH: 8104982242 • GUNTUR: LAXMIPURAM MAIN ROAD, OPP GAYATRI COLLEGE PH: 8591404514 |15 • GUNTUR: OPPOSITE METRO THEATER, KOTHAPET PH: 8591404546 | 47 • PIDUGURALLA: BESIDES ANJI REDDY MULTI PITAL PH: 8928933277|78 | TO LOCATE YOUR NEAREST MYJIO STORE, SMS LOCATE <PINCODE> TO 561611

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



తిరుపతమ్మ సేవలో..

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మను శుక్రవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు సీఈ మంగేష్ కుమార్, పులిచింతల ఎస్ఈ దేశీయ నాయక్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు.



20,485 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 18,113 మిర్చి బస్తాలు వచ్చాయి. గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 20,485 బస్తాలు విక్రయించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సన్నిధిలో..



మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని 'కృష్ణా' నూతన డీఆర్వో శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

న్యూస్‌రీల్

యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలి



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యువత డ్రగ్స్‌కి దూరంగా ఉంటూ జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.సమరం చెప్పారు. యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం అనే అంశంపై శుక్రవారం సిద్ధార్థ ఆడిటోరియంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. సమరం మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను తీసుకోవడంతో యువత జీవితం నాశనమవుతుందని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే నష్టాలే ఎదురవుతాయన్నారు. డ్రగ్స్ సరఫరా, వినియోగంపై ఎవరికైనా తెలిస్తే 14500 నంబర్‌లో తెలియజేయాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి సందేహాలు నివృత్తి చేశారు. జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నేడు ప్రత్యేక ప్రసంగం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక ప్రసంగ కార్యక్రమం జరుగుతుందని అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ కాలమ్స్ కథ–కమామిషు అనే అంశంపై మాట్లాడతారని పేర్కొన్నారు. డిప్లొమో ఇన్ జర్నలిజం కోర్సు చేస్తున్న వారితో పాటు ఆసక్తి ఉన్న వర్కింగ్ జర్నలిస్టులు జూమ్ ఐడీ–815 9892 6979, పాస్‌వర్డ్–12345 ద్వారా హాజరై ప్రసంగాన్ని వీక్షించవచ్చని తెలిపారు.

విశ్వకర్మ జయంతికి తరలిరండి



భవానీపురం(విజయవాడపశ్చిమ): తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 17న బీసీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భగవాన్ విశ్వకర్మ జయంతి కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గం తరలి రావాలని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. గొల్లపూడి పరిధిలో బీసీ సంక్షేమ భవన్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సృష్టికర్త, సకల చేతి వృత్తులకు, విశ్వబ్రాహ్మణులకు ఆరాధ్య దైవం భగవాన్ విశ్వకర్మ జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన విశ్వబ్రాహ్మణ ప్రముఖులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం చేస్తామన్నారు. వేడుకల్లో పలువురు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఏపీ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు తుపాకుల సోమాచారి మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన సీఎం జగన్‌కు తమ జాతి యావత్తు రుణపడి ఉంటుందన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు దేవరపల్లి శర్మ, దివిలి బ్రహ్మం, విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శి పండురి రమేష్, కొండూరు మోహన్‌రావు పాల్గొన్నారు.

దత్తాశ్రమంలో చండీహోమం



భవానీపురం(విజయవాడపశ్చిమ): వినాయక చవితి ఉత్సవాలు పురస్కరించుకుని దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ శుక్రవారం పటమటలోని దత్త ఆశ్రమానికి విచ్చేశారు. మైసూరు నుంచి వచ్చిన ఘనాపాటి వంశీకృష్ణ, వేద పండితుల బృందం మంత్రోచ్చరణలతో నిర్వహించిన చండీహోమంలో సచ్చిదానంద స్వామి పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యంగా ఉంటూ పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని వేడుకుంటూ హోమం చేశామన్నారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 7 గంటలకు దత్త ఆశ్రమంలోని శ్రీ క్షిప్ర గణపతి ఆలయంలో వినాయకుడికి పంచామృత అభిషేకం చేయనున్నట్లు తెలిపారు.

చరిత్రను తిరగరాసిన రోజు

- మచిలీపట్నంలో వైద్యకళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి ఆర్కే రోజా
- వైద్యరంగానికి సీఎం జగన్ ప్రాధాన్యం
- పేదలకు సేవలందిస్తామంటున్న వైద్య విద్యార్థులు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షిస్తున్న మంత్రి రోజా, కలెక్టర్ రాజాబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, వ్యవసాయ కమిషన్ వైస్‌చైర్మన్ నాగిరెడ్డి, ఎమ్మెల్యేలు పేర్ని నాని, సింహాద్రి రమేష్

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నంలో వైద్య కళాశాలను ఏర్పాటు చేయడం ఉమ్మడి కృష్ణా జిల్లా చరిత్రను తిరగరాసిన రోజుగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖ, ఇన్‌చార్జ్ మంత్రి ఆర్కే రోజా అభివర్ణించారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడిగా.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వైద్యానికి ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. మచిలీపట్నంలో నిర్మించిన వైద్య కళాశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో శుక్రవారం ప్రారంభించారు. దీనికి విచ్చేసిన ఆమె తొలుత విద్యార్థులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వైద్యకళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదలకు ఉన్నతమైన వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ఐదు కాలేజీలను ప్రారంభించారన్నారు. వాటిలో తరగతులు జరగడం శుభపరిణామమన్నారు. అన్ని సౌకర్యాలతో కళాశాలను ఏర్పాటు చేసిన సీఎం జగన్‌ను విద్యార్థులు అభినందిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని పేదలకు వైద్య సాయం అందించడానికి కృషి చేస్తామని విద్యార్థులు ప్రకటించటం ఆనందంగా ఉందన్నారు. కేవలం మూడేళ్లలో వైద్య కళాశాలను అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయమన్నారు.

అబ్బురంగా ఉంది

మెడికల్ కళాశాలకు 2021 మే 31న తాను శంకుస్థాపన చేశానని బందరు ఎమ్మెల్యే పేర్ని నాని తెలిపారు. కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం అబ్బురంగా ఉందని చెప్పారు. రాజశేఖరరెడ్డి ఒక అడుగు ముందుకు వేస్తే సీఎం జగన్ ఐదడుగులు ముందుకు వేశారన్నారు. నియోజకవర్గంలో గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించింది రాజశేఖరరెడ్డి అని, నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మచిలీపట్నం నియోజకవర్గానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని.. ఆయన కంటే తాను పెద్దవాడినైనా పాదాభివందనం చేస్తున్నానన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆయన జెండా మోసిన మేమందరం గర్వంగా చెప్పుకునే అవకాశం వచ్చిందని తెలిపారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ మచిలీపట్నం ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుతో 40 కిలోమీటర్ల విస్తీర్ణంలో నివసిస్తున్న ప్రజలకు ఆధునిక వైద్య సదుపాయం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. నిర్ణీత సమయానికి కాలేజీని ఆధునికంగా, సౌకర్యవంతంగా నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ వైస్‌చైర్మన్ నాగిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్, కైలే అనిల్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పూర్ణమ్మ, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్లు భారతి, విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఆశాలత, డీఆర్వో వెంకటరమణ, డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వసతులతో ఏర్పాటు

అన్ని సదుపాయాలతో ప్రభుత్వ వైద్యకళాశాలను ఏర్పాటు చేశారు. నిష్ణాతులైన ప్రొఫెసర్లు ఎంతో తోడ్పాటును అందిస్తున్నారు. ఇన్ని వసతులు కల్పించిన కళాశాలలో వైద్య విద్యను అభ్యసించి మా ప్రాంతంలో పేద ప్రజలకు వైద్య సాయం చేస్తాను

– సచిన్ దాండియా, ముఖ్యమంత్రితో మాట్లాడిన రాజస్తాన్ విద్యార్థి



కాలేజీ ప్రాంగణంలో రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా ప్రజాప్రతినిధులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా, కలెక్టర్ రాజాబాబు, ప్రజాప్రతినిధులు

ఎన్టీఆర్ జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ల నియామకం

కంకిపాడు: ఎన్టీఆర్ జిల్లా జగనన్న సచివాలయాల కోఆర్డినేటర్లు నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్లుగా బీరవల్లి శివారెడ్డి, యక్కంటి వెంకటరెడ్డి నియమితులయ్యారని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేసింది.

ఆర్థిక, ఆరోగ్యాభివృద్ధిలో ముందడుగు



తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే రమేష్‌బాబు

అవనిగడ్డ: పోర్టు, మెడికల్ కళాశాల ఏర్పాటు ద్వారా కృష్ణా జిల్లా ఆర్థికంగా, ఆరోగ్యసేవల్లో ముందడుగు వేయనుందని కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. అవనిగడ్డలో రూ.90 లక్షల వ్యయ అంచనాతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే సింహాద్రి శుక్రవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండు నెలల క్రితం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బందరు పోర్టు పనులకు శంకుస్థాపన చేయగా, నేడు వర్చువల్ పద్ధతిలో వైద్య కళాశాలను ప్రారంభించారన్నారు. నియోజకవర్గ కేంద్రం అవనిగడ్డలో తహసీల్దార్ భవనం ప్రారంభోత్సవంతో మరిన్ని మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ పవన్‌కల్యాణ్, చంద్రబాబు కలిసినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేసీ అపరాజితా సింగ్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీపీ సుమతీదేవి, సర్పంచ్ ఉమ, జెడ్పీటీసీ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పిచ్చేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సివిల్స్ మెయిన్స్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సివిల్స్ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 171 మందికి 161 మంది పరీక్షలకు హాజరయ్యారు. ముగ్గురు విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లు, వసతులను పరిశీలించారు. పరీక్షల నిర్వహణను సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. శని వారం, ఆదివారం కూడా పరీక్షలు జరగనున్నాయి.



ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద తరగతి గదుల నంబర్లు చూస్తున్న అభ్యర్థులు

దుర్గమ్మ భక్తులకు కుంకుమ ప్రసాదం



భక్తులకు కుంకుమ ప్రసాదం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ



అమ్మవారి ఆలయానికి పూలతో విశేష అలంకరణ

లాంఛనంగా ప్రారంభించిన దుర్గగుడి కమిటీ చైర్మన్, ఈవో

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న భక్తులకు కుంకుమ ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నామని దుర్గగుడి కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై శుక్రవారం మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన అనంతరం కుంకుమ ప్రసాదం పంపిణీని ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వస్తున్న రూ. 500, రూ.300, రూ.100 టికెట్ల క్యూలైన్లతో పాటు సర్వదర్శనం క్యూలో భక్తులకు కుంకుమ ప్యాకెట్లను అందజేస్తారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణశర్మ, మురళీధర్‌శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విశేష పూల అలంకరణ

శ్రావణ అమావాస్య, శుక్రవారం నేపథ్యంలో అమ్మవారి ఆలయంతో పాటు మల్లేశ్వర స్వామి ఆలయం, ఇతర ఉపాలయాలను పూలతో అలంకరించారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు క్యూలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ ఉభయదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో పనులు.. రాకపోకలు నిషేధం

దుర్గాఘాట్ ఎదుట సోమవారం కొండ చరియలు విరిగి పడిన చోట శుక్రవారం తిరిగి పనులు ప్రారంభించారు. వీటిని కమిటీ చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ, పాలకమండలి సభ్యులు కట్టా సత్తెయ్య పరిశీలించారు. దేవదాయ శాఖతో నియమించిన టెక్నికల్ కమిటీ సభ్యుల సూచనల మేరకు ఘాట్‌రోడ్డులో మెత్తగా ఉన్న కొండ రాళ్లను తొలగిస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఆలయ ఈఈ లింగం రమాదేవి, ఇంజినీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. కొండ చరియలు తొలగింపు పనుల్లో భాగంగా కుమ్మరిపాలెం వైపు నుంచి రథం సెంటర్ వైపునకు రాకపోకలను పోలీసులు నిషేధించారు. తెల్లవారుజాము నుంచి ఘాట్‌రోడ్డు మీద రాకపోకలు యథావిధిగా కొనసాగగా, ఉదయం 10 గంటలకు పనులు ప్రారంభించడంతో రాకపోకలను నిషేధించారు. దీంతో దేవస్థాన సిబ్బందిని కొండపైకి అనుమతించలేదు. దీంతో వారు చుట్టూ తిరిగి దుర్గగుడి ఫ్లై ఓవర్ మీదగా ఆలయానికి చేరుకున్నారు.

ఇంటింటికీ 'సురక్ష'



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, పక్కన డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, జేసీ సంపత్‌కుమార్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): జగనన్న ఆరోగ్య సురక్షతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటింటికీ రక్షణ కల్పిస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్ మల్లాది విష్ణు చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్‌తో కలిసి సింగ్‌నగర్ ఇందిరానాయక్ నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ప్రజలకు 'ఆరోగ్య సురక్ష'.. వరం లాంటిదని తెలిపారు. ఇంటింటికీ వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, ఆశాకార్యకర్తలు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. మొదటిదశలో ఇంటింటి సర్వే, రెండో దశలో వైద్యబృందాల ఏర్పాట్లు, మూడో దశలో ఓరియంటేషన్, నాలుగో దశలో వైద్య శిబిరాలు నిర్వహించడానికి ప్రణాళికను రూపొందించినట్లు వివరించారు. ఇంటింటి సర్వేలో ప్రాథమిక పరీక్షలు చేసి వ్యాధులను గుర్తించడం.. స్పెషలిస్టులు, పీహెచ్‌సీ డాక్టర్లు వారికి చికిత్స చేసి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తారని చెప్పారు. అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తారన్నారు. ఈ నెల 30 నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటుచేసి 45 రోజులు వైద్యసేవలు అందించనున్నామని తెలిపారు. జేసీ సంపత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఏఎన్ఎం, సీహెచ్ఓ, ఆశా, వలంటీర్లు ముగ్గురుతో బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ సర్వే చేస్తారన్నారు. వివరాలను ఆరోగ్య సురక్ష యాప్‌లో నమోదుచేసి అక్కడే బీపీ, షుగర్, యూరిన్, హిమోగ్లోబిన్, కళ్లె, డెంగ్యూ, మలేరియా జ్వరాలు, చర్మంపై దీర్ఘకాలిక మచ్చలు తదితర ఏడురకాల పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ యాప్‌లో నమోదు చేసిన వివరాల ఆధారంగా కేస్ షీట్ తయారుచేసి వైద్యం అందిస్తారన్నారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా

- నేడు నాలుగో విడత కాపు నేస్తం నిధుల విడుదల
- కృష్ణా జిల్లాలో 23,110 మందికి రూ. 34.67 కోట్లు
- ఎన్టీఆర్ జిల్లాలో 15,424 మందికి 23.14 కోట్లు జమ



కాపునేస్తం మూడో విడత చెక్కు ఇస్తున్న మంత్రి ఆర్కే రోజా తదితరులు (ఫైల్)

చిలకలపూడి(మచిలీపట్నం): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న కాపు నేస్తం పథకంతో కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తోంది. వీరి ఆర్థిక అభ్యున్నతి కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. 45 నుంచి 60 సంవత్సరాల్లోపు మహిళలకు ఏడాదికి రూ. 15 వేల నగదును జమ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అత్యధిక మంది లబ్ధిపొందుతున్నారు. కృష్ణా జిల్లాలో 2023–24 సంవత్సరానికి సంబంధించి నాలుగో విడతగా 23,110 మంది లబ్ధిదారులకు రూ. 34.67 కోట్లు శనివారం వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 15,424 మందికి 23.14 కోట్లు జమకానున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమచేయనున్నారు.

కృష్ణాలో..

కాపు నేస్తం పథకాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2020 జూన్ 24న ప్రవేశపెట్టారు. ఆ ఏడాది కృష్ణా జిలాలో 22,750 మంది లబ్ధిదారులకు రూ. 34.14 కోట్లు అందజేశారు. రెండో విడతగా 2021 జూలై 22న 21,049 మందికి రూ. 31.57 కోట్లు అందించారు. మూడో విడతగా 2022 జూలై 29వ తేదీన 21,720 మంది లబ్ధిదారులకు రూ. 32.58 కోట్లు అందాయి. ద్వైవార్షిక మంజూరులో భాగంగా 1,298 మంది లబ్ధిదారులకు రూ. 1.95 కోట్లు అందించారు. ఇప్పటి వరకు మొత్తం 66,825 మంది లబ్ధిదారులకు రూ. 100.24 కోట్లు అందజేశారు. నాలుగో విడతగా 23,110 మంది లబ్ధిదారులకు రూ. 34.67 కోట్లు వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరగనున్నట్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లాలో..

పటమట(విజయవాడతూర్పు): 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లాలో 15,424 మంది లబ్ధి పొందనున్నారు. వీరి ఖాతాల్లో రూ.23.14కోట్లు జమవుతాయి. 2020–21లో జిల్లాలో 12,892 మందికి రూ. 19.33 కోట్లు, 2021–22లో అదనంగా 13,798 మందికి రూ. 20.70 కోట్లు, 2022–23లో 14,641 మందికి రూ. 21.96 కోట్లు, అదనంగా మరో 1253 మందికి నగదు జమ చేశారు.

ఆర్‌పీఎఫ్ డాగ్ కాంపిటీషన్‌లో రెమోకు రెండో స్థానం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆలిండియా ఆర్‌పీఎఫ్ డాగ్ కాంపిటీషన్‌లో విజయవాడ డివిజన్ స్క్వాడ్‌కు చెందిన రెమో(డాగ్) పేలుడు పదార్థాల గుర్తింపులో జాతీయస్థాయిలో రెండో స్థానం పొందింది. నార్త్‌సెంట్రల్ రైల్వే, ప్రయాగ్‌రాజ్, ఆగ్రా డివిజన్‌లో ఈ నెల 8 నుంచి 10 వరకు జరిగిన పోటీల్లో 11 జోనల్స్ జట్ల నుంచి మొత్తం 60 డాగ్‌లు పాల్గొన్నాయి. ఇతర డాగ్‌ల కంటే వేగంగా, సులభంగా పేలుడు పదార్థాలను గుర్తించి రెండో స్థానం సాధించింది. 2021లో కోయంబత్తూర్ జోనల్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. శిక్షణ ఇచ్చిన ట్రైనీలు ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ బి.విజయరాజు, హెడ్ కానిస్టేబుల్ మహేష్‌బాబులను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర బీటీ, ఏఎస్‌సీ మధుసూదనరావు అభినందించారు.

బందరులో వైద్య మణిహారం





బాలుర హాస్టల్ భవనం



బాలికల హాస్టల్ భవనం



ప్రొఫెసర్ల విశ్రాంతి గదులు



ప్రయోగశాల



విద్యార్థుల హాస్టల్లోని వసతులు



డైనింగ్ హాల్

బందరులో వైద్య కళాశాల కల సాకారమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 550 కోట్లతో కేవలం 27 నెలల్లోనే వైద్య కళాశాలను నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. 15 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కళాశాల నిర్మించారు. అద్భుతమైన క్లాస్‌రూమ్‌లు, ల్యాబ్‌లు, హాస్టళ్లను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆధునిక హంగులతో డిపార్ట్‌మెంటల్ బ్లాక్, ల్యాబొరేటరీ బ్లాక్, లెక్చరర్ గ్యాలరీ బ్లాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఎగ్జామినేషన్ బ్లాక్‌లు నిర్మించారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి గృహాలు సిద్ధం చేశారు. సుందరంగా తరగతి గదులను తీర్చిదిద్దారు.

-చిలకలపూడి(మచిలీపట్నం)

చరిత్ర పుటల్లో చిరస్థాయిగా వైఎస్ జగన్

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్

పెడన: వైద్య రంగంలో తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు.

మంత్రి కార్యాలయం శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. దేశానికే దిక్సూచిగా వైద్య ఆరోగ్య రంగంలో ముఖ్యమంత్రి తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలు మరచిపోలేనివని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఐదింటిని సీఎం వర్చువల్ విధానంలో ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ విశాల హృదయమున్న వైఎస్ జగన్ ప్రతి ఒకరికీ అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సదుద్దేశంతో ఉన్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఐదు మెడికల్ కాలేజీల్లో 2023–24 విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించేలా కృషి చేశారని తెలిపారు. విజయనగరం ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రారంభించి అనంతరం వర్చువల్ విధానంలో రాజమహేంద్రవరం, ఏలూరు, నంద్యాల, మచిలీపట్నంలో కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రారంభించడం సంతోషకరమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మన రాష్ట్రంలో కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మాత్రమే ఉండగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన ఈ నాలుగేళ్లలో మరో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం అనేది దేశంలోనే ఒక చరిత్ర అని అన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్య రంగంలో ఎన్నో కీలక సంస్కరణలు తీసుకొచ్చి చరిత్రలో నిలిచారని గుర్తు చేశారు.

ప్రజల గుండెల్లో ఎప్పటికీ....

ఇప్పుడు వైఎస్సార్ తనయుడు జగన్ ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజల ఆరోగ్యం పట్ల పడుతున్న తపన, అత్యుత్తమ వైద్యం అందించేలా చేస్తున్న కార్యక్రమాల వల్ల ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయారని తెలిపారు. మచిలీపట్నంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నప్పుడు తామంతా వారికి కృతజ్ఞతలు తెలియజేశామని చెప్పారు. అతి తక్కువ సమయంలోనే మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయి ఇప్పుడు తరగతులు ప్రారంభం కావడం అనేది మాట తప్పని మడమ తిప్పని జగనన్న నైజానికి మచ్చు తునకని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు ఆర్థిక భారం కలిగించకుండా సమీపంలోనే ఉన్న మచిలీపట్నంలో అత్యాధునిక సదుపాయాలతో వైద్య కళాశాల ఏర్పాటు చేయటంపై మరోసారి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

జనసేన, టీడీపీది ఫెవికాల్ బంధం



కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, పక్కన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్:ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకుని అవినీతిపరుడైన తన తండ్రిని బయటకు తీసుకొచ్చేందుకే లోకేష్ యాత్ర చేస్తున్నాడని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. దివాకర్ ట్రావెల్స్ బస్సు ప్రమాద కేసుకు సంబంధించి శుక్రవారం ఆయన నందిగామ కోర్టుకు హాజరయ్యారు. ముందుగా శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు నివాసంలో కొద్దిసేపు ఎమ్మెల్యేతో మాట్లాడారు. అనంతరం కోర్టుకు వచ్చారు. కోర్టు బయట విలేకర్లతో మాట్లాడుతూ కోట్లకు కోట్లు ఫీజులు చెల్లిస్తూ, ప్రత్యేక విమానాలు పెట్టి ఢిల్లీ నుంచి తెచ్చుకున్న న్యాయవాది ఇక్కడే ఉంటే లోకేష్‌కు ఢిల్లీలో ఏం పని ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 16 నెలలు జైలులో పెట్టి ఇబ్బందులకు గురిచేసినా మొక్కవోని ధైర్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగారని చెప్పారు. ప్రజాదరణ పొంది ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని గుర్తు చేశారు.

జనసేన, టీడీపీని ప్రజలు ఘోరంగా ఓడిస్తారు..

జనసేన, టీడీపీది ఫెవికాల్ బంధమని తెలిపారు. 2014 నుంచి వారిద్దరూ కలిసే ఉన్నారన్నారు. ఇప్పుడు ప్రత్యేకంగా పొత్తు పెట్టుకునేదేముందని పేర్కొన్నారు. ఇద్దరూ కలిసి పోటీ చేసినా, ప్రజలు ఆ రెండు పార్టీలను ఘోరంగా ఓడించటం ఖాయమని చెప్పారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకుతినటంతో పాటు హవాలా ద్వారా వేల కోట్లు దొడ్డిదారిన మళ్లించిన విధానాన్ని చూసి మేధావులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిగా ఉండి నిరుపేదల సొమ్మును కాజేయటం దౌర్భాగ్యమని ధ్వజమెత్తారు.

చంద్రబాబు ఒక్క పథకమైనా పెట్టారా?

14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ఒక్క పథకమైనా ప్రవేశపెట్టారా.. సంక్షేమ పథకాల ద్వారా లాభపడిన ఒక్క కుటుంబమన్నా ఉందా అని ప్రశ్నించారు. చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక రాజకీయ కక్షతో ప్రభుత్వం అరెస్ట్ చేయించిందని అంటున్నారని, అసలు చంద్రబాబు ఏం చేశారని ప్రజాదరణ ఉంటుందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ప్రతి ఇల్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిందని ప్రజలే స్వయంగా చెబుతున్నారని తెలిపారు. సమావేశంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, గుడివాడ సాంబశివరావు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా వినాయకచవితి

- ఉత్సవాల్లో మట్టి వినాయక విగ్రహాలు వినియోగించాలి
- చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ భాస్కరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినాయకచవితి పూజకు మట్టి విగ్రహాలను వినియోగించాలని చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ భాస్కరరావు ప్రజలకు సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో జోనల్, ప్రాంతీయ కార్యాలయాల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ వినాయకచవితి అంటేనే పర్యావరణ పండుగ అని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ భగవంతునికి పూజ చేయాలని తెలిపారు. పర్యావరణహితంగా పండుగ చేసుకుంటూ భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతి సంపదను అందించాలన్నదే ఈ పండుగ వెనుక వున్న ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. వినాయకచవితి పూజకు మట్టితో తయారు చేసిన విగ్రహాలను వినియోగించాలని సూచించారు. వినాయక ప్రతిమను సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయాలన్నారు. 21 రకాల పత్రి, ప్రతిమను నిమజ్జనం చేసిన తర్వాత తమలోని ఔషధ గుణాలున్న ఆల్కలాయిడ్స్‌ను జలంలోకి వదిలేస్తాయన్నారు. ఈ ఆల్కలాయిడ్స్ వల్ల నీటిలోని ప్రమాదకరమైన బాక్టీరియాను నశింపజేస్తాయన్నారు. అంతే కాకుండా ఆక్సిజన్ శాతం పెరుగుతుందన్నారు. ఇదే వినాయక నిమజ్జనం వెనుక దాగి ఉన్న పర్యావరణ పరమ రహస్యమని వివరించారు. సమావేశంలో జోనల్, జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శ్రీరామమూర్తి, జోనల్, ప్రాంతీయ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగులు పాల్గొన్నారు.

వినాయకచవితి పూజా విధానం, నిమజ్జనంలో అనుసరించాల్సిన విధానాలు ఇవే....

- మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలనే పూజించాలి
- వినాయక విగ్రహాల అలంకరణలో సహజమైన రంగులనే వాడాలి.
- అయిల్ పెయింట్స్ వాడొద్దు. రసాయనిక రంగులు వాడొద్దు.
- వినాయక విగ్రహాల తయారీ, అలంకరణ, పూజలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్, థర్మోకోల్ వాడొద్దు
- గణేష్ నిమజ్జనానికి ముందు పత్రి, పూలు వంటి వాటిని కంపోస్టు చేసి మొక్కలకు ఎరువులా వేయడానికి వినియోగించండి.
- గణేష్ విగ్రహాలను ఎవరి ఇళ్లల్లో వారు ఒక బకెట్ నీటిలో పూర్తిగా కరిగిపోయే వరకు నిమజ్జనం చేసి తరవాత ఆ నీటిని మొక్కలకు పోయాలి.
- జలాశయాల్లో మట్టి విగ్రహాలకు మాత్రమే స్థానం కల్పించండి.
- జలచరాలకు, వన్య ప్రాణులకు, పక్షులకు ఈప్రకృతిలో ఆరోగ్యంగా సంచరించే అవకాశం కల్పించాలి.
- గణేష్ నిమజ్జనానికి ముందు ప్లాస్టిక్, నీటిలో కరగని సామగ్రిని తొలగించాలి.
- ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని మానేయాలి. మీబిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు స్వచ్ఛమైన ప్రకృతి సంపదను అందించాలి వంటి సూచనలు చేశారు.

డయల్ యువర్ కమిషనర్‌కు 14 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న టీకే రాణా

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):ప్రజా సమస్యల సత్వర పరిష్కార వేదికగా శుక్రవారం సీపీ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమంలో 14 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ టీకే రాణా పాల్గొని నేరుగా బాధితులతో మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో ట్రాఫిక్ సమస్యలు, కుటుంబ కలహాలు, ఆర్థిక నేరాలు, స్థలం తగాదాలు తదితర సమస్యలపై బాధితులు సీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన సంబంధిత పోలీస్ స్టేషన్ యస్‌హెచ్‌ఓలు, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి పరిష్కరించే దిశగా ఆదేశాలు జారీ చేశారు. డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

బాలికను వేధించిన కేసులో నిందితులకు రెండేళ్ల జైలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):బాలికను వేధింపులకు గురిచేసిన కేసులో ఇద్దరు నిందితులకు 2 ఏళ్ల కఠినకారాగారశిక్షా, జరిమానా విధిస్తూ విజయవాడ పోక్సో కోర్ట్ స్పెషల్ జడ్జి డాక్టర్ ఎస్.రజిని శుక్రవారం తీర్పు వెల్లడించారు. విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక పంజా సెంటర్‌లో తన కుటుంబంతో కలిసి జీవిస్తుంది. ఈ క్రమంలో 2017 జూలై 28న ఆమె స్కూల్‌కి వెళుతున్న సమయంలో రాయల్‌హోటల్ వద్ద ఆరీఫ్, నాగూర్ అనే వ్యక్తులు బాలికతో అభ్యంతరకరంగా మాట్లాడుతూ, చేయి పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించారు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు పోక్సో చట్టం కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు భవానీపురం మసీదువీధికి చెందిన షేక్ ఆరీఫ్, టూటౌన్ బురాడ వీధికి చెందిన పఠాన్ నాగుల్‌మీరాలను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులో షేక్ అరీఫ్‌కి 2 సంవత్సరాల శిక్ష, రూ.15 వేలు జరిమానా, పఠాన్ నాగూర్ మీరాకి 2 సంవత్సరాల శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. బాధిత బాలికకు జరిమానా నుంచి రూ.20 వేలతో పాటుగా డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ నుంచి రూ. 50 వేలు నష్ట పరిహారం అందించాల్సిందిగా తీర్పులో పేర్కొన్నారు.

ప్రయాణికుడిపై దాడి చేసి డబ్బులు కాజేసిన ఆటోడ్రైవర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):రైలు దిగి అర్ధరాత్రి సమయంలో ఆటోలో ఇంటికి వెళ్తున్న ప్రయాణికుడిని కింద పడేసి జేబులో డబ్బులు కాజేసిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. అప్పారావు అనే వ్యక్తి ఇబ్రహీంపట్నంలో నివాసం ఉంటున్నాడు. తన స్వగ్రామమైన అనకాపల్లి వెళ్లి గురువారం అర్ధరాత్రి రైల్వేస్టేషన్‌లో ట్రైన్ దిగాడు. ఇబ్రహీంపట్నం వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. ఆటో అప్పారావుతో పాటుగా మరో వ్యక్తి అందులో ప్రయాణికుడిగా ఉన్నాడు. భవానీపురం ఆంధ్రా హాస్పిటల్ సమీపానికి వచ్చే సమయంలో ఆటోను పక్కన ఉన్న చీకటి ప్రాంతంలోకి తీసుకెళ్లి ఆటో డ్రైవర్, ప్రయాణికుడిగా ఉన్న మరో వ్యక్తి అప్పారావును కిందపడేసి జేబులో ఉన్న రూ.53 వేలు తీసుకొని అక్కడి నుంచి పరారయ్యారు. బ్లేడ్‌తో అప్పారావుకు గాయపర్చి వెళ్లిపోయారు. దీంతో బాధితుడు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

శాంతిభద్రతలు పర్యవేక్షించిన ఎస్పీ

పెనమలూరు:పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను జిల్లా ఎస్పీ జాషువా శుక్రవారం పర్యవేక్షించారు. అయన ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అధికారులతో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు అరెస్టుకు ప్రజల నుంచి మద్దతు రాకపోవటంతో టీడీపీ నేతలు కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద ఆందోళన చేసి సమస్యలు సృష్టించాలని వ్యూహం పన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి స్వయంగా శాంతిభద్రతల పై సమీక్షించారు. డీఎస్పీ జయసూర్యతో పాటు సీఐలు, ఎస్ఐలతో సమావేశమయ్యారు. ప్రజా జీవనానికి ఎటువంటి భంగం కలిగించినా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసులు అప్రమత్తంగా ఉండటంతో ఎటువంటి ఆందోళన జరగలేదు. ప్రజా జీవనానికి ఇబ్బందులు తలెత్తలేదు.

విద్యుత్ అక్రమ వినియోగదారులకు రూ.5.54 లక్షల జరిమానా

హనుమాన్‌జంక్షన్ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తున్న వినియోగదారులకు రూ.5.54 లక్షల జరిమానా విధించినట్లు ఏపీ సీపీడీసీఎల్ విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ కనెక్షన్లపై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 44 బృందాలుగా ఏర్పడిన అధికారులు 2636 గృహ, 253 వాణిజ్య విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో 217 విద్యుత్ సర్వీసులకు అదనపు లోడు వినియోగిస్తున్నట్లుగా గుర్తించి రూ. 5,54,376 జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడివాడ ఈఈ టి.రామకృష్ణ, హనుమాన్‌జంక్షన్ డీఈఈ బి.శ్రీనివాసరావు, ఏఈఈ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వీరపనేనిగూడెంలో పొక్లెయిన్ సీజ్

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెం గ్రామంలో శుక్రవారం పోలవరం ఏఈ కె.విజయలక్ష్మి ఆకస్మికంగా దాడులు జరిపి మట్టి అక్రమంగా తరలిస్తున్న పొక్లెయిన్ సీజ్ చేశారు. గ్రామానికి చెందిన గుర్రం గోపి కొంతకాలంగా పోలవరం మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్నారని ఫిర్యాదులు రావటంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. సీజ్ చేసిన పొక్లెయిన్‌ను ఆత్కూరు పోలీసులకు అప్పగించినట్లు ఏఈ తెలిపారు. ఈ అక్రమ తవ్వకాలపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

దాడి కేసులో నిందితుడికి ఏడాది జైలు

పెదపారుపూడి:దాడి చేసి వ్యక్తిని గాయపరిచిన కేసులో నిందితుడిపై నేరం రుజువు కావటంతో ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి కె. నాగలక్ష్మి గురువారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పల్లా నాగకళ్యాణి తెలిపారు. 2017లో మండలంలోని వెంట్రప్రగడ గ్రామానికి చెందిన కొడాలి బసవరావు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన కె. శ్రీనివాసరావుపై దాడిచేసి గాయపరిచిన ఘటనపై అప్పటి ఎస్ఐ సీహెచ్‌కే దుర్గాప్రసాద్ కేసు నమోదుశారని పేర్కొన్నారు. నిందితుడిపై కోర్టులో నేరం రుజువు కావటంతో సంవత్సరం జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

ప్రమాదవశాత్తూ కాలువలో పడి వ్యక్తి మృతి



మృతుడు నలిగిలి కోటయ్య

బార్లపూడి(మొవ్వ):ప్రమాదవశాత్తూ కాలువ పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మొవ్వ మండలం బార్లపూడి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. కూచిపూడి ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు.. ధర్మాపురం గ్రామానికి చెందిన నలిగిలి కోటయ్య (44) బార్లపూడి ఎస్సీకాలనీ రోడ్డులో గల చెరువులో పడి మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోటయ్యకు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



అవగాహన ర్యాలీలో పాల్గొన్న దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధి విధానాలు జనరంజకంగా ఉన్నాయని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. 5వ డివిజన్ పరిధిలోని క్రీస్తురాజపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన రూపొందించి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు లబ్ధిపొందుతున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకంతో పేదలకు కార్పొరేట్ తరహాలో వైద్యం అందుతోందని తెలిపారు. ఏదైనా కారణాల వల్ల ఆ పథకం వర్తించకపోతే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికంగా భరోసా కల్పిస్తామన్నారు. పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం మరో అడుగు ముందుకేస్తోందని చెప్పారు. అక్టోబర్ 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మొదలవుతోందని స్పష్టం చేశారు. దీని ద్వారా లక్షలాది మంది పేదల ఇళ్లకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నిపుణులైన వైద్యులు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, సీఎంహెచ్ఓ రత్నావళి, ఏఎంహెచ్ఓ ఇక్బాల్, మెడికల్ ఆఫీసర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మద్దతివ్వడం సిగ్గుచేటు

ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్



మసీదు వద్ద మాట్లాడుతున్న గౌస్ మొహిద్దీన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): గత ప్రభుత్వ పాలనలో ముస్లిం మైనారిటీలను మోసగించిన చంద్రబాబు స్కిల్ స్కామ్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న నేపథ్యంలో కొందరు మైనార్టీలు ఆయనకు మద్దతు తెలపటం సిగ్గుచేటని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. శుక్రవారం భవానీపురం పున్నమీఘాట్ వద్దగల మొహమ్మదీయ మసీదులో తొలుత ఆయన నమాజ్ చేశారు. అనంతరం బయట మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుకు లేని మద్దతు ఉన్నట్లు చూపేందుకు ఆరాటపడుతున్న టీడీపీ నాయకులు గత రెండు రోజులుగా ఆడుతున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. మొన్న కుప్పంలో, నిన్న విజయవాడ పశ్చిమంలో బుద్ధా వెంకన్న, జలీల్‌ఖాన్, ఎంఎస్ బేగ్‌లు కొంత మంది టీడీపీ నాయకులను పోగేసి మద్దతు ఉన్నట్లు చూపిస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో గుంటూరులో జరిగిన నారా హమారా సభలో మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నించిన ముస్లిం యువతపై దేశద్రోహం నేరం మోపి నిర్బంధించి హింసించిన చరిత్ర చంద్రబాబుదన్నారు. అటువంటి వ్యక్తి అవినీతి కేసులో అరెస్ట్ అయితే మైనారిటీలు ఎలా మద్దతు ఇస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో షేక్ హసన్ బాషా, షేక్ బాజీ షహీద్, షేక్ గౌస్, ఖలీలుల్లా ఖాన్, మహమ్మద్ హఫీజ్, ఎండీ సయీద్, షేక్ ఇమ్రాన్, రవూఫ్, జబీయుల్లా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫార్మసీ రంగంలో నూతన పరిశోధనలపై సదస్సు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫార్మసీ రంగంలో నూతన ఉత్పత్తులపై పరిశోధనలు, వ్యాపార అవకాశాలను విద్యార్థులకు తెలియజేసేందుకు శుక్రవారం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్, పలు నూతన ఉత్పత్తులపై పరిశోధనా పత్రాలు సమర్పించి కొత్త పేటెంట్స్ సాధించిన డాక్టర్ గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన ఉత్పత్తుల తయారీకి ఉన్న అవకాశాలు, వాటిని ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందే విధంగా చేసేందుకు ఉన్న అవకాశాలను ఫార్మసీ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ. సునీత, టీపీరావు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): పాఠశాల దశలోనే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ డి. చంద్రశేఖర్ అన్నారు. శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ స్కూల్‌లో నూతన విద్యార్థి మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్గం తెలిసిన వ్యక్తి, ఇతరులకు దారి చెప్పి దిశా నిర్దేశం చేసేవాడే నాయకుడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన మార్చ్‌ఫాస్ట్ విన్యాసాలు అలరించాయి. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులకు ముఖ్య అతిథి చేత బ్యాడ్జిని అందజేశారు. స్కూల్ ఆర్ఐ పద్మ, ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ జ్ఞానసుందరి, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు స్మార్ట్ విజన్ గ్లాసెస్ పంపిణీ



గుణదల (విజయవాడ తూర్పు): దృష్టిలోపాలు కలిగిన యువత, అంధ విద్యార్థులను ప్రోత్సహించే దిశగా సమాజంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని హెల్ప్ ద బ్లైండ్ ఫౌండేషన్ సంస్థ ట్రస్టీ ఎస్. నరసింహన్ అన్నారు. ఆంధ్రలయోల కళాశాలలో దృష్టిలోపాలు ఉన్న విద్యార్థులకు స్మార్ట్ విజన్ గ్లాసెస్(కళ్ల జోళ్లు) పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, అంగవైకల్యం ఉన్నవారికి, అంధులకు ప్రత్యేక లక్షణాలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. చదువుతో పాటు పలు రంగాలలో తమ సత్తా చాటుతున్నారని వివరించారు. హెల్ప్ ది బ్లైండ్ ఫౌండేషన్, విజన్ ఎయిడ్ ఇండియా సహకారంతో ఒక్కొక్క కళ్లజోడు రూ.30వేలు ఖరీదు చేసే విజన్ గ్లాసెస్‌ను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 14 మందికి స్మార్ట్ విజన్ గ్లాసెస్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రభుదాస్, అధ్యాపకులు సహాయ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

18న సహస్ర కుడుముల అర్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితిని పురస్కరించుకుని ఈనెల 18వ తేదీ సోమవారం ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో లోక కల్యాణార్థం సహస్ర కుడుములతో అర్చన నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తులు సహస్ర కుడుముల అర్చనలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తోందని తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. శుక్రవారం 16వ డివిజన్ 75వ సచివాలయంలో రెండో విడత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. స్థానిక చోడిశెట్టి నరశింహనాయుడు వీధితో పాటు పలు ప్రాంతాల్లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై స్థానికులను ఆరా తీశారు. అవినాష్ మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశామన్నారు. నవరత్నాల్లో భాగంగా కులాలకు, మతాలకు, పార్టీలకతీతంగా జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను అందించామన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎం చేసేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. విజయవాడ తూర్పులో కనీసం రూ.400 కోట్లకు వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 16వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధిక, ఈశ్వరప్రసాద్, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, నాంచారయ్య, వేముల దుర్గారావు, మాజీ కార్పొరేటర్ బహదూర్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులు వేగవంతం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులు, గృహ విద్యుత్ కనెక్షన్ల కేటాయింపు చర్యలు త్వరితగతిన చేపట్టాలని ఏపీ సీపీడీసీఎల్ ఉమ్మడి కృష్ణాజిల్లా ఎస్ఈ ఎ.మురళీ మోహన్ ఆదేశించారు. స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నూజివీడు, గుడివాడ డివిజన్ విద్యుత్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జగనన్న కాలనీలోని లబ్ధిదారులు విద్యుత్ కనెక్షన్‌ను ఉచితంగా మంజూరు చేయాలని, ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తక్షణమే మార్పు చేయాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేయాలని ఎస్ఈ సూచించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు నిమిత్తం వస్తున్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, నిర్ణీత రుసుము చెల్లించిన రైతులకు తక్షణమే విద్యుత్ సదుపాయం అందించాలన్నారు. డీఈ హనుమయ్య, గుడివాడ, నూజివీడు డివిజన్ ఈఈ, డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

ప్రతి ఇంజినీర్‌కు ఆదర్శం మోక్షగుండం



రిటైర్డ్ ఇంజినీర్ వెంకటరామారావు దంపతులను సత్కరిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నేటి యువత మోక్షగుండం విశ్వేశ్వరయ్య పూర్తి చేసిన ప్రాజెక్టుల గురించి తెలుసుకుని స్ఫూర్తిని పొందాలని నీటి పారుదలశాఖ రిటైర్డ్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డాక్టర్ బి.వెంకటరామారావు అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతి సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఇంజినీర్స్ డే నిర్వహించారు. వెంకట రామారావు అతిథిగా హాజరై మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మన దేశానికి చెందిన మొట్టమొదటి సివిల్ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని అన్నారు. మనదేశంలోని 8 విశ్వవిద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించాయన్నారు. అనంతరం వెంకటరామారావు దంపతులను సన్మానించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి సభకు అధ్యక్షత వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎంవీ బాబు, కార్యదర్శి ఎస్.గోపిచంద్, రిటైర్డ్ అధ్యాపకుడు వి.భానుమూర్తి పాల్గొన్నారు.

విత్తనాలతో కూడిన మట్టి గణపతిని పూజిద్దాం



అవగాహన కల్పిస్తున్న వీఎంసీ అదనపు కమిషనర్ సత్యవతి

పటమట(విజయవాడతూర్పు): విత్తనాలతో కూడిన మట్టి వినాయకుడిని పూజించి.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దామని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి అన్నారు. మట్టి గణపతి విగ్రహాల ఏర్పాటుపై శుక్రవారం లబ్బీపేటలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అక్కడకు మండపాల ఏర్పాటుకు అనుమతి కోసం వచ్చిన వారితో ఆమె మాట్లాడారు. విత్తనాలతో కూడిన మట్టి వినాయకుని పూజించడమే కాకుండా వినాయకుని పందిళ్లలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పర్యావరణ అనుకూలమైన వస్తువులనే వాడాలని ఆమె పేర్కొన్నారు. ఈ పండుగలో ఉపయోగించే పూజ పుష్పాలు, ఆకులు, పండ్లను నిరుపయోగంగా పారవేసే విధానాన్ని మార్చుకోవాలన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ, గ్రీన్ వేవ్స్ రీసైక్లర్‌తో కలిసి వినూత్నంగా చేపట్టిన వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ద్వారా నిరుపయోగమైన పువ్వులను, ఆకులను పరిమళమైన అగరబత్తీలు, కొవ్వొత్తులతో దూపాలను తయారుచేస్తున్నామన్నారు. మిగిలిన వ్యర్థాలను విండ్రో కంపోస్ట్ ద్వారా ఎరువుగా మార్చుతామని చెప్పారు. ఈ వినాయక చవితి పూజ అనంతరం, పుష్పాలను, ఆకులను నగరపాలక సంస్థ వారు ప్రత్యేకంగా కేటాయించిన డబ్బాలలో వేసి అందించాలని సూచించారు. ఒకవేళ ఎక్కువ మొత్తంలో పుష్పాలు, ఆకులు, పండ్లను అందించడంలో మరింత సమాచారం కావాలంటే గ్రీన్ వేవ్స్ రీసైక్లర్(919676152910)ను సంప్రదించాలని కోరారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం



నందిగామ: వినాయక చవితి సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నందిగామ పట్టణంలోని పలు కూడళ్లలో కళాకారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు మట్టితో చేసిన వినాయకుడిని పూజించడం వలన కలిగే ప్రయోజనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయకుడిని పూజించడం వలన పర్యావరణానికి కలిగే నష్టాలను వివరిస్తూ పలు స్కిట్స్ ప్రదర్శించారు. పట్టణంలోని బస్టాండ్, రైతుపేట, గాంధీ సెంటర్, భారత్ టాకీస్ రోడ్, మెయిన్ బజార్, రథం సెంటర్, పాత బస్టాండ్ ప్రాంతాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

మట్టి గణపతి విగ్రహాలు సిద్ధం



భక్తుల కోసం సిద్ధంగా ఉన్న మట్టి గణపతి విగ్రహాలు



విగ్రహాలు తయారు చేస్తున్న కార్మికుడు

పెనమలూరు: వినాయకచవితి సందర్భంగా భక్తుల కోసం పవిత్ర మట్టి గణపతి విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి. గంగూరు వద్ద మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి భక్తులకు అందుబాటులో ఉంచారు. పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి ప్రేమికులు మట్టి గణపతి విగ్రహాలతో వినాయక చవితి పండుగను ఘనంగా చేసుకోవాలని ముందుకు వస్తున్నారు. మట్టి గణపతి విగ్రహాలను పూజించే భక్తులు పుష్కలంగా ఆశీస్సులు అందుతాయని ప్రగాఢ విశ్వాసం. గంగూరులోని మన గ్రామంలో రసాయన రంగులతో కాకుండా కేవలం మట్టితోనే చేసిన వినాయుడి ప్రతిమలు రూపొందించారు. కోల్‌కత్తా నుంచి వచ్చిన కళాకారులు మట్టి వినాయుడి బొమ్మలు ఆకర్షణీయంగా రూపొందించారు. మట్టి వినాయకుడి విగ్రహాలు ఉపయోగించటం వలన పర్యవరణం పరిరక్షణే కాకుండా భూమిని కాపాడుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. మన గ్రామంలో చేతి వృత్తుల వారికి జీవనాధారం కల్పించటానికి కృషి చేస్తున్నారు. ఇక్కడ గంగానది మట్టితో తయారు చేసిన వినాయకుడి విగ్రహం కొన్నవారికి ఉచితంగా ఖాదీవస్త్రాలు, గో ఆధారిత బియ్యం 2 కేజీలు, గో ఆధారిత బెల్లం కిలో, జ్యూట్ బ్యాగ్ ఒకటి, వినాయకుడు గొడుగుగా తాటి గొడుకు ఇస్తారు. 5 అడుగులు ఉన్న మట్టి వినాయకుడి విగ్రహం రూ.12 వేలు, 3 అడుగుల విగ్రహం రూ.9 వేలు ధర ఉంది. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయకుడి విగ్రహాలతోనే ప్రకృతి ప్రేమికులు పూజలు చేసి భూమిని కాపాడాల్సిన బాధ్యత ఉంది.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శివకుమారి

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తలిదండ్రులతోపాటు ఉపాధ్యాయులపై ఉందని లయోల కళాశాల ప్రొఫెసర్ బి. శివకుమారి అన్నారు. 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమంపై అవగాహన సదస్సు ఆంధ్రలయోల కళాశాలలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ, విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు.. పేద కుటుంబంలో జన్మించి శాస్త్రవేత్తగా ఎదిగి దేశానికి రాష్ట్రపతి స్థాయికి చేరిన అబ్దుల్ కలామ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా కో ఆర్డినేటర్ మైనం హుస్సేన్ మాట్లాడుతూ అక్టోబర్ చివరి వారంలో సైన్స్ ప్రాజెక్టులపై పాఠశాల విద్యార్థులకు పోటీలుంటాయన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులు గైడ్ టీచర్ సహాయంతో తాము ఎంచుకున్న అంశాలపై పరిశీలనలు చేసి కేస్ స్టడీస్ ఆధారంగా ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయవలసి ఉంటుందన్నారు. అనంతరం బాలల సైన్స్ కాంగ్రెస్ విధి విధానాల గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైన్స్ కాంగ్రెస్ నిర్వాహకులు జయలక్ష్మి, నాగేశ్వరరావు, ప్రసాద్ బాబు, శ్రీనివాసరావులతో పాటు సుమారు 240 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నపిల్లలతో ఫ్రెండ్లీగా ఉండాలి



కంచికచర్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్ కార్యక్రమం జరిగింది. ఈ మేరకు పీడీ మాట్లాడుతూ స్నేహ బాలల గ్రామాలుగా చేయాలన్నారు. బాల్య వివాహాలు నిరోధించాలని, బాల కార్మికులు లేకుండా చూడాలని, వారిని బడికి పంపాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను నిరోధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాల శంకరరావు, డీసీపీఓ జాన్సన్, ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబీ, ఎంఈఓ బి.బాలాజీ, కంచికచర్ల, చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓలు వి.భాగ్యరేణుక, లక్ష్మీ భార్గవి, సూపర్‌వైజర్లు తారాబీ, కరీముల్లా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊపందుకున్న వినాయక విగ్రహాల విక్రయాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్‌లో వినాయక విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి. వినాయక చవితి సమీపించటంతో భక్తులు, భక్త బృందం సభ్యులు వచ్చి వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ 3 అడుగుల విగ్రహాల నుంచి 10 అడుగుల విగ్రహాల వరకు అందుబాటులో ఉన్నాయి. విగ్రహాల సైజు, ఆకృతిని బట్టి రూ. 4 వేలు నుంచి రూ.15వేలు వరకు ధరలు పలుకుతున్నాయి. ఇంకా పెద్ద విగ్రహాలు కావలిసిన వారికి ఆర్డర్‌లపై నున్న నుంచి తీసుకువచ్చి అందించనున్నట్లు వ్యాపారులు తెలిపారు. శని, ఆది వారాలలో విగ్రహాల విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మెగా మెడికల్ క్యాంప్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రైవేటు హాస్పిటల్స్‌లో వేలాది రూపాయలు ఖర్చు లేకుండా పేద, మధ్య తరగతి ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించే లక్ష్యంతో శర్వాణి లెబోరేటరీ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు సంస్థ అధినేత, స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఈ వైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రముఖ హాస్పిటల్స్ నుంచి పలు విభాగాల వైద్యులు అన్ని రకాల పరీక్షలతో పాటు గుండె సంబంధిత వ్యాధులు, ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల సమస్యలు, సుగర్, బీపీ, స్త్రీల సంబంధిత వ్యాధులు, ఎముకలు, కీళ్లు, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భార్యపై ఇటుక రాయితో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యపై ఇటుక రాయితో దాడికి పాల్పడిన భర్తపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన షేక్ ఆలీయాబేగం, మొహిద్దీన్ భార్యాభర్తలు. మొహిద్దీన్ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. మొహిద్దీన్‌కు డబ్బులు అవసరం ఉన్నప్పుడల్లా భార్యను అడగడంతో తెలిసిన వారి వద్ద అప్పులు చేసింది. ఇలా మొత్తం రూ. 6 లక్షల మేర అప్పులు చేయగా, అప్పు ఇచ్చిన వారు తిరిగి డబ్బులు ఇవ్వాలని ఆలీయాబేగంపై ఒత్తిడి చేయసాగారు. దీంతో అప్పులు తీర్చేందుకు మార్గం చూడాలని ఆలీయా బేగం భర్తను అడగడంతో గురువారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మొహిద్దీన్ తన చేతికి దొరికిన ఇటుక రాయిని తీసుకుని భార్యపై దాడి చేయడంతో గాయమైంది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వివాహితతో అసభ్యకర ప్రవర్తన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాపురం గ్రామానికి చెందిన చిట్టి మాధవికి రమేష్‌తో వివాహమైంది. అయితే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో కొంత కాలంగా వేరు వేరుగా ఉంటున్నారు. గురువారం రాత్రి 12 గంటల సమయంలో మాధవి ఇంటి సమీపంలో నివసించే దారం సన్ని వచ్చి తలుపు కొట్టసాగాడు. దీంతో నిద్ర లేచిన మాధవి ఎందుకు తలుపు కొడుతున్నావంటే ఒక సారి మాట్లాడాలని చెప్పాడు. దీంతో తలుపు తీసిన మాధవి ఇంట్లోకి ప్రవేశించిన సన్ని ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో కేకలు వేసి బయటకు పరుగులు తీసింది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తల్లీకుమార్తెల అదృశ్యంపై కేసు

పెనమలూరు: తల్లీకుమార్తెల అదృశ్యంపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. తాడిగడప కార్మికనగర్‌కు చెందిన వి.కోటేశ్వరరావు, కవిత చక్రవర్తి గత కొద్ది సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి మూడేళ్ల కుమార్తె తేజశ్విని ఉంది. భర్త సెల్‌ఫోన్ షోరూమ్‌లో పని చేస్తాడు. కాగా కవితచక్రవర్తి, ఆమె కుమార్తె తేజశ్విని ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. వారి కోసం కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



ఒత్తిడిని వదిలేయండి ఇలా...

ఉదయం లేచినప్పటి నుంచి ఉరుకులు పరుగులు మొదలు. చేయాల్సిన పనుల చిట్టా చాంతాడంత. దీంతో హడావుడి, ఆందోళన. ఫలితం ఒత్తిడి. అందుకనే ఈ రోజుల్లో ఎక్కువ శాతం మంది ప్రజలు ఒత్తిడికి గురవుతున్నారు. ఆందోళనతో చిత్తవుతున్నారు. వీటి వల్ల వచ్చే శారీరక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మరి ఈ ఒత్తిడిని తగ్గించుకుంటే చాలా అనారోగ్య సమస్యల నుంచి బయట పడొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకు ఇంట్లో మనంతట మనం పాటించగల చిన్న చిట్కాలను చెబుతున్నారు. అవేంటో చూద్దామా..?

గోరు వెచ్చని లేదా చల్లని నీటితో స్నానం చేయడం చాలా మంచిది. శరీరంలో ఎక్కడైనా నొప్పులుగా అనిపిస్తే చిన్నగా మసాజ్ చేసుకోవడం, కండరాలన్నీ సాగేలా ఒళ్లు విరుచుకోవడం లాంటి పనుల వల్ల ఒత్తిడి తగ్గుతుంది. బాత్‌రూమ్‌లో కూనిరాగాలు తీయడం లేదా ఏదైనా లైట్ మ్యూజిక్‌ని పెట్టుకుని, గోరువెచ్చని నీటితో శరీరం, మనస్సు తేలిక పడేంతవరకు టబ్ బాత్ చేయాలి. అందుకు మంచి సువాసన ఉన్నసహజమైన సబ్బును ఉపయోగించాలి. ఇలా చేయడం వల్ల ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది.

నృత్యం...

నృత్యం చేయడం అనేది ఒత్తిడి నివారిణిలా పని చేస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. మంచి సంగీతాన్ని పెట్టుకుని దానికి తగినట్లుగా డ్యాన్స్ చేయవచ్చు. ఎవరైనా ఉన్నప్పుడు చేయడం మొహమాటం అయితే ఎవరూ లేనప్పుడు ఆ పని చేయండి. దీనివల్ల మనసుకు ఆనందం కలుగుతుంది. ఒత్తిడి హార్మోన్ల స్థాయి తగ్గుతుంది.

ఇష్టమైన వారితో ప్రేమగా...

ఎక్కువ ఒత్తిడిలో ఉన్నప్పుడు ఇష్టమైన వారితో ప్రేమగా... సంతోషంగా గడిపేందుకు ప్రయత్నించండి. అందువల్ల శరీరంలో డోపమైన్ లాంటి హ్యాపీ హార్మోన్‌లు విడుదలవుతాయి. దీంతో మీరు ఒత్తిడి నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

బబుల్ ర్యాప్‌లను పగలగొట్టడం...

బబుల్ ర్యాప్ కవర్లను చూడగానే అంతా వాటిని పగలగొట్టాలని ఉవ్విళ్లూరతారు. అందుకు కారణాలు లేకపోలేదు. అలా వాటిని పేల్చడం వల్ల మనలో ఓ రకమైన ఆనందం కలుగుతుంది. ఒత్తిడి దూరమవుతుంది. అందువల్లనే మనం వాటిని పేల్చేందుకు ఇష్ట పడుతుంటాం.

మంచి పుస్తకాలు చదవడం...

మంచి పుస్తకాలు, పేపర్లు చదవడం ద్వారా కూడా ఒత్తిడి నుంచి బయటపడవచ్చు. ఒత్తిడిగా అనిపించినప్పుడు మీకు నచ్చిన పుస్తకం తీసి చదవండి. వెంటనే తగ్గుముఖం పడుతుంది ఆ ఒత్తిడి. అలాగే రోజూ దినపత్రికలను చదవడం కూడా ఒత్తిడి నివారణలో ఒక భాగం. దినపత్రికలు చదవడమనగానే నేరవార్తలు, హత్యావార్తలు కాదు. మనసుకు కాస్తంత ఆహ్లాదం కలిగించే వార్తలు చదవడం మేలు.

ఆలయ సందర్శనం...

మీ మతాన్ని అనుసరించి మీరు ప్రార్థనామందిరాలను సందర్శించడం మంచిది. రోజూ కాసేపు పూజామందిరంలో గడపడం వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. అలాగని దేనినీ అతిగా చేయరాదు. గంటలు గంటలు పూజలు చేస్తూ గడపడం కూడా మంచిది కాదు. క్రమం తప్పకుండా ఆలయానికి లేదా మసీద్‌కు లేదా చర్చికి వెళ్లడం వల్ల ఒత్తిడి దూరం అవుతుంది.

మీరు ఒత్తిడిలో ఉన్నారు అనుకున్నప్పుడువీటిలో మీకు వీలైనవాటిని పాటించి చూడండి.

అన్నింటికన్నా ముఖ్యం ఒత్తిడి వచ్చాక బాధ పడేకంటే ఒత్తిడికి గురికాకుండా చూసుకోవడం చాలా ఉత్తమం. అదేవిధంగా ఒత్తిడి ఎందువల్ల వస్తుందో తెలుసుకుంటే నివారించుకోవడం సులభం కాబట్టి. ముందుగా మీ పనులను ప్రశాంతగా పూర్తి చేయడం ఆరంభించండి.



ధ్యానం...

ఒత్తిడి నుంచి బయట పడటానికి ధ్యానం అద్భుతమైన మార్గం అని చాలా అధ్యయనాల్లో తేలింది. శ్వాస మీద ధ్యాస పెట్టి కేవలం రెండు నిమిషాలు కళ్లు మూసుకున్నా సరే అది మీ శరీరంలో స్ట్రెస్ హార్మోన్ సార్టిసాల్ స్థాయిల్ని తగ్గిస్తుంది.

ఆహారానికి సుగంధం

ఆరోగ్యానికి అందలం



ఆహారం సులభంగా జీర్ణమవడానికి ఆహారంలో కొన్ని సుగంధ ద్రవ్యాలను చేర్చుకుంటే మేలు. అవేంటో, ఎలా పనిచేస్తాయో తెలుసుకుందాం... జీర్ణశక్తి బాగుంటే ఆరోగ్యం బాగున్నట్లే. మనం తీసుకునే ఆహారం మీదనే అది జీర్ణమవడం ఆధారపడి ఉంటుంది. మన వంటిళ్లలో సహజంగానే జీర్ణశక్తిని పెంచే సుగంధ ద్రవ్యాలు బోలెడుంటాయి. అలాంటి వాటిలో తేలికగా అందుబాటులో ఉండే పదార్థాలే ఎక్కువ. వాటిని వాడటం ద్వారా జీర్ణశక్తి ఎలా మెరుగవుతుందో చూద్దాం...



అల్లం...

దీర్ఘకాలిక అజీర్తి సమస్యలు ఉన్న వాళ్లకి అల్లం మంచి మందు. ఇది కడుపు నొప్పి రాకుండా చేస్తుంది. అల్లం టీ తాగడం, వండుకునే ఆహార పదార్థాల్లో కొంచెం అల్లాన్ని చేర్చడం ద్వారా ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. కడుపు ఖాళీ అవడానికీ ఇది సహకరిస్తుంది.



ధనియాలు...

కడుపు ఉబ్బరంగా, వికారంగా ఉన్నప్పుడు కాసిని ధనియాలు నీటిలో వేసి మరిగించి తాగడం వల్ల ఉపశమనం కలుగుతుంది. ధనియాల్లో ఉండే కొన్ని లక్షణాల వల్ల గ్యాస్ సమస్యలు దూరం అవుతాయి.

యాలకులు...

కడుపులో మంట, నొప్పి, వికారం లాంటి వాటికి యాలకులు మంచి మందులా పని చేస్తాయి. దీంట్లో మాంగనీసు ఎక్కువగా ఉంటుంది. ఇది తిన్న ఆహారం అరిగి శక్తినిచ్చేలా చేస్తుంది. మధుమేహం నుంచి కాపాడుతుంది.



మెంతులు...

నానబెట్టిన మెంతుల్ని ఖాళీ కడుపుతో తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. అజీర్తి, మలబద్ధకం లాంటి వాటికి పరిష్కారం దొరుకుతుంది. పేగుల ఆరోగ్యం బాగుంటుంది.



సోంపు...

ఆహారం తేలిగ్గా జీర్ణం కావడానికి సోంపు చాలా మంచిది. ఇంట్లో కూడా తిన్న వెంటనే కొన్ని సోంపు గింజలు నమిలితే దీనిలో ఉండే పొటాషియం, జింక్, మాంగనీసు, ఐరన్, కాపర్ లాంటి ఖనిజాలు జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిజేయడంలో సహకరిస్తాయి.





జీలకర్ర...

జీలకర్రలో మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, పాస్ఫరస్ సమృద్ధిగా ఉంటాయి. ఇంకా విటమిన్ ఎ, సి, కె, ఇ, బీ 6 కూడా ఉంటాయి. రోజూ టీ స్పూను జీలకర్ర తీసుకోవడం వల్ల ఈ పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. పేగుల్లో పేరుకుపోయిన మలినాలను తొలగించడంలో ఇది సహకరిస్తుంది. దీన్ని భోజనానికి ముందు తీసుకుంటే డైజెస్టివ్ ఎంజైమ్స్‌ని ప్రేరేపిస్తుంది. జీర్ణక్రియలో సహకరిస్తుంది.

అందువల్ల ఈ సుగంధ ద్రవ్యాలను తప్పకుండా తీసుకోవాలి.

హెల్త్ టిప్స్



- ఉసిరి పచ్చడి తీసుకోవడం, తేనెలో నాన పెట్టిన ఉసిరిని నిత్యం పద్ధతి ప్రకారం సేవించడం ద్వారా దృష్టిలోపం తగ్గుతుంది. ఉసిరి పొడిని నిత్యం పరకడుపున తేనెతో కలిపి సేవించడం వల్ల వత్తిడి, అలసట తగ్గుతుంది.



- ఎండు ద్రాక్షలు లేదా కిస్‌మిస్‌లు వాడడం మంచిది. వీటికి చలువ చేసే గుణం వుంది. గ్లాసుడు నీళ్లలో ఎండు ద్రాక్షలు వేసి, నాన పెట్టి, ఆ నీటిని తీసుకుంటే వేడి చేయకుండా ఉంటుంది. ముఖ్యంగా పిల్లలకు చాలా మంచిది.



- గోధుమలు, బియ్యం, పెసలు, రాగులు, సోయాగింజ లు, జొన్నలు అరకిలో వంతున కలిపి, 50 గ్రాముల నువ్వులు, 20 గ్రాముల జీలకర్ర జోడించి, దోరగా విడివిడిగా వేయించాలి. ఆపై మరపట్టించి రొట్టెలు చేసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ పిండితో జావ కూడా చేసుకోవచ్చు.



- నెలసరి నొప్పితో బాధపడేవారు పుదీనా ఆకులను నీళ్లలో వేసి మరిగించి, వడకట్టి, ఆ నీటిని సేవించడం వల్ల మంచి ఫలితం వుంటుంది. పుదీనా ఆకులు, ఉప్పు కలిపి నీటిలో మరిగించి, ఆ ఆవిరి పడితే గొంతు మృదువుగా మారుతుంది.

సడెన్‌గా చెమటలా..?

చెమటలు పట్టడం అనేది చాలా సాధారణ విషయం.. ఎందుకంటే శరీర శ్రమ అతిగా చేయడం వల్ల అందరిలో చెమట పడుతూ ఉంటుంది. ముఖ్యంగా వేసవిలో మరింత సహజం. అయితే కొందరిలో చెమట విచ్చలవిడిగా పడుతూ ఉంటుంది. దీంతోపాటు కొందరిలో అకస్మాత్తుగా చెమటలు పోస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు చాలామంది దీనిని సాధారణ సమస్యగా భావించి తేలిగ్గా తీసుకుంటున్నారు. దీని వల్ల భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలని కొని తెచ్చుకున్నట్లేనని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇలా మీకు జరుగుతుంటే మాత్రం మీ ఒంటి మీద మీరు కాస్తంత శ్రద్ధ తీసుకోవాల్సిందే మరి!



అకస్మాత్తుగా చెమటలు పట్టడం అనేకరకాల అనారోగ్య సమస్యలకు ముందస్తు సూచనలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీనిని గుండెజబ్బుల లక్షణాలలో ఒకటిగా వైద్యులు భావిస్తారు. తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే ముందు తరచు అకస్మాత్తుగా చెమటలు పడతాయని నిపుణులు చెబుతున్నారు. మీలో ఇలాంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించడం, వారి సలహా మేరకు హెల్త్‌చెకప్ చేయించుకోవడం మంచిదని అనుభవజ్ఞుల సలహా.


అధిక చెమట ఈ వ్యాధుల లక్షణాలలో ఒకటి...

అకస్మాత్తుగా చెమటలు పట్టడం గుండెపోటు మొదటి లక్షణమని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. మహిళలకు రాత్రిపూట ఎక్కువగా చెమట పడడం వల్ల భవిష్యత్‌లో రానున్న తీవ్రసమస్యలకు సంకేతాలు. తీవ్ర దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా కూడా ఎక్కువగా చెమట పడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా కొంతమందిలో మధుమేహం పెరగడం కారణంగా కూడా ఇలాంటి సమస్యలు వస్తాయి.

- అకస్మాత్తుగా వచ్చే చెమటలు రాకుండా ఉండాలంటే... ఆహారంలో ఉప్పు వాడకాన్ని తగ్గించడం
- మద్యపానం అలవాటుంటే వెంటనే మానేయడం
- ఆకు కూరలు, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం
- గ్రీన్ టీ తీసుకోవడం
- రోజుకు కనీసం మూడు లీటర్ల నీటిని తాగడం
- డీప్ ఫ్రైలు, ఇతర నూనె పదార్థాలను తగ్గించడం
- ప్రతి రోజూ తేలికపాటి వ్యాయామాలు చేయడం
- పద్ధతి ప్రకారం డైట్ తీసుకోవడం అవసరం.

సినిమా

మీ ఆనందమే నాకు సంతృప్తి



- విజయ్ దేవరకొండ

“నేను చదువుకునే రోజుల్లో ఫ్రెండ్స్ అంతా విహార యాత్రకు వెళ్తే నేను ఇంట్లో డబ్బులు అడిగి ఇబ్బందిపెట్టడం ఇష్టం లేక అలాగే ఉండిపోయేవాడిని. ఆ విహార యాత్రలో నా స్నేహితులు ఎలా ఎంజాయ్ చేస్తున్నారో అని ఆలోచిస్తూ ఉండేవాడిని. తమ్ముడి (ఆనంద్ దేవరకొండ) ఇంజినీరింగ్ ఫీజు కోసం ఇబ్బంది పడుతున్నప్పుడు ఎవరైనా కొంత సహాయం చేస్తే బాగుండును అనిపించేది. కానీ ఎవర్నీ అడగడానికి ఇష్టం ఉండేది కాదు. అవన్నీ దాటుకుని ఈ స్థాయికి చేరుకున్నాను. ఇవాళ మీకు (అభిమానులు) హెల్ప్ చేయగలుగుతున్నాను అంటే అది నా వ్యక్తిగత ఆకాంక్ష. నేను అందించే ఈ లక్ష రూపాయలతో మీకు ఒత్తిడి తగ్గి ఆనందం కలిగితే అది నాకు సంతృప్తిగా ఉంటుంది'' అన్నారు విజయ్ దేవరకొండ. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 1న విడుదలైంది. 'ఖుషి' సినిమా హ్యాపీనెస్‌ను షేర్ చేసేందుకు ఎంపిక చేసిన 100 లక్కీ ఫ్యామిలీస్‌కు రూ. లక్ష చొప్పున చెక్స్ అందించారు విజయ్ దేవరకొండ. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''ఈ ప్రోగ్రామ్‌ను అనౌన్స్ చేసినప్పటి నుంచి మాకు ఇప్పటివరకూ 50 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ ఏడాది వంద మందికి మాత్రమే సహాయం చేయగలుగుతున్నాం. ప్రతి ఏడాది కొంతమందికి సహాయం చేస్తూనే ఉంటాను. నేను స్ట్రాంగ్‌గా ఉన్నంతవరకూ, సినిమాలు చేస్తున్నంతవరకూ నేను సహాయం చేస్తూనే ఉంటాను. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు థ్యాంక్స్'' అన్నారు. ''కేవలం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, సౌత్ స్టేట్స్ నుంచి సెలెక్ట్ చేశారు. సౌత్‌లో అన్ని ప్లేసెస్ నుంచి మా సినిమాకు మంచి స్పందన లభించింది'' అన్నారు శివ నిర్వాణ. ''వంద మందికి సహాయం చేయాలనే ప్రయత్నం మా మూవీతో విజయ్ మొదలుపెట్టినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు నవీన్, రవిశంకర్.

కోలీవుడ్ కబురు?

దివంగత నటి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్‌కు కోలీవుడ్ నుంచి కబురు వెళ్లిందట. తమిళ నటుడు అథర్వ హీరోగా ఆకాష్ అనే కొత్త దర్శకుడు ఓ తమిళ చిత్రాన్ని తెరకెక్కించనున్నారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు ఖుషీ కపూర్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. ఖుషీకి ఈ కథ నచ్చిందని, ఆమె దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నది కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో వినిపిస్తున్న మాట. ఒకవేళ ఇదే నిజమైతే.. ఖుషీ కపూర్ నటించే తొలి తమిళ సినిమా ఇదే అవుతుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. 'పయ్యా ('ఆవారా')' సినిమాకు సీక్వెల్‌గా 'పయ్యా 2' రానుందని, ఇందులో ఆర్య హీరోగా నటిస్తారని, ఖుషీ కపూర్ హీరోయిన్‌గా ఎంపికయ్యారనే టాక్ గతంలో కోలీవుడ్‌లో వినిపించింది. అయితే 'పయ్యా 2' సీక్వెల్‌లో ఖుషీ కపూర్ నటిస్తుందనే వార్తల్లో వాస్తవం లేదని ఆమె తండ్రి, నిర్మాత బోనీ కపూర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇక హిందీలో 'ఆర్చీస్' అనే వెబ్ ఫిల్మ్‌లో ఖుషీ కపూర్ నటిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ నుంచి స్ట్రీమింగ్ కానుందని సమాచారం.



- ఖుషీ కపూర్

సప్త సాగరాలు

రక్షిత్ శెట్టి హీరోగా నటించి, నిర్మించిన కన్నడ చిత్రం 'సప్త సాగర దాచే ఎల్లో'. హేమంత్ ఎం. రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. ఈ నెల 1న కన్నడలో విడుదలైన ఈ చిత్రం హిట్‌గా నిలిచింది. ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, రక్షిత్ శెట్టి కలిసి 'సప్త సాగరాలు దాటి' అనే పేరుతో ఈ నెల 22న తెలుగులో విడుదల చేయనున్నారు. ''క్లాసిక్ లవ్ స్టోరీగా రూపొందిన చిత్రమిది. కన్నడలో సూపర్ హిట్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం తెలుగులోనూ సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



- రక్షిత్, రుక్మిణి

ప్రేమకథ విన్నారా?



- మృణాల్ ఠాకూర్

కెరీర్‌లో హీరోయిన్‌గా మంచి ఫామ్‌లో ఉన్నారు మృణాళ్ ఠాకూర్. నార్త్ అండ్ సౌత్ అనే తేడాలను పక్కన పెడితే ఈ బ్యూటీ హీరోయిన్‌గా నటించిన ఐదు సినిమాలు రిలీజ్‌కు రెడీ అవుతున్నాయంటే ఆమె ఏ స్పీడ్‌తో దూసుకెళ్తున్నారో ఊహించవచ్చు. ఇదే స్పీడ్‌ను కొనసాగించాలనుకుంటూ బాలీవుడ్ కొత్త సినిమాకు సై అన్నారట మృణాళ్. శ్రీదేవి టైటిల్ రోల్ చేసిన హిందీ హిట్ ఫిల్మ్ 'మామ్' తీసిన దర్శకుడు రవి ఉదయార్ ఇటీవల ఓ లవ్‌స్టోరీ స్క్రిప్ట్‌ను రెడీ చేసుకున్నారట. ఆయన ఈ కథను మృణాళ్‌కు వినిపించగా, ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ సమాచారం. సిద్ధార్థ్ చతుర్వేది హీరోగా నటించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుందని బీ టౌన్ టాక్.

ఆ రోజు కీడా కోలా



- బ్రహ్మానందం

'పెళ్ళిచూపులు', 'ఈ నగరానికి ఏమైంది?' చిత్రాల ఫేమ్ దర్శకుడు తరుణ్ భాస్కర్ నటించి, తెరకెక్కించిన తాజా చిత్రం 'కీడా కోలా'. క్రైమ్ కామెడీ జానర్‌లో రూపొందిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీలో బ్రహ్మానందం, రఘురామ్, రవీంద్ర విజయ్ లీడ్ రోల్స్ చేశారు. కె.వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ ఈ సినిమాను నిర్మించారు. కాగా ఈ సినిమా నటుడు–నిర్మాత రానా సమర్పణలో నవంబరు 3న విడుదల కానున్నట్లుగా చిత్ర యూనిట్ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్.

భయం.. అత్యాశ.. కుట్ర



- వంశీ, ఆనంద్ దేవరకొండ, ఉదయ్, అనురాగ్

ఆనంద్ దేవరకొండ హీరోగా ఉదయ్ శెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'గం..గం.. గణేశా'. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ వేడుకలో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''భయం, అత్యాశ, కుట్ర అంశాల చుట్టూ ఈ సినిమా కథనం సాగుతుంది. 'బేబీ' తో ఆడియన్స్ ఎంత ఎమోషనల్ అయ్యారో, 'గం..గం..గణేశా' చిత్రంతో అంత ఎంటర్‌టైన్ అవుతారు. ఉదయ్ కథ, విజన్‌ను నమ్మి ఈ సినిమా చేశాను'' అన్నారు. ''ఈ సినిమా విజయంపై మాకు పూర్తి నమ్మకం ఉంది'' అన్నారు వంశీ కారుమంచి. 'ప్రేక్షకులకు నచ్చే చిత్రం ఇది'' అన్నారు ఈ చిత్ర సహనిర్మాత అనురాగ్ పర్వతనేని.

మిస్టర్ ఇడియట్ వస్తున్నాడు



- మాధవ్, సిమ్రాన్ శర్మ

హీరో రవితేజ తమ్ముడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్ శర్మ హీరోయిన్. గౌరీ రోణంకి దర్శకత్వంలో జేజేఆర్ రవిచంద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శుక్రవారం మాధవ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'మిస్టర్ ఇడియట్' లోని మాధవ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శక–నిర్మాత కె. రాఘవేంద్ర రావు విడుదల చేశారు. ''మిస్టర్ ఇడియట్' ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గౌరీ రోణంకి. ''నవంబరులో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాత జేజేఆర్ రవిచంద్.

అందాలు చదివే కళ్లకైనా...



- పంఖురి, నవదీప్

నవదీప్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పంఖురి గిద్వానీ, మిర్చి హేమంత్ నటించారు. ప్రశాంత్ రెడ్డి తాటికొండ నిర్మాత. గోవింద్ వసంత సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అందాలు చదివే కళ్లకైనా.. కందాలు తిరిగే కాళ్లకైనా.. వందేళ్ల కదిలే గుండెకైనా..' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను అనిల్ కష్ణన్ పాడారు. ''లవ్ మౌళి' షూటింగ్ మొత్తం మేఘాలయలోని చిరపుంజీలో చిత్రీకరించాం'' అని యూనిట్ పేర్కొంది.